# నినాదం

నిఖార్సైన జర్నలిజం

శనివారం, ఆగస్టు 02, 2025 | సంపుటి - 20 | సంచిక 203 | వెల - 4రూ | పేజీలు - 12

Hyderabad, Karimnagar, Khammam, Nalgonda, Nizamabad, Warangal, Mahabubnagar.


## ఎన్నికల అక్రమాలపై అణుబాంబు లాంటి ఆధారాలు

### ఇసిపై విపక్షనేత రాహుల్ గాంధీ విమర్శలు



న్యూఢిల్లీ : ఎన్నికల సంఘంపై లోక్‌సభలో ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఎన్నికల సంఘం ఓట్లను చోరీ చేస్తోందని ఆయన ఆరోపించారు. ఆ అక్రమాలకు సంబంధించి పూర్తి ఆధారాలున్నాయని అన్నారు. ఈ ఓట్ల చోరీ అక్రమాలను తీవ్రంగా పరిగణిస్తున్నామని.. బిజెపి కోసం ఇసి ఓట్లను చోరీ చేస్తోందని మండిపడ్డారు. మధ్యప్రదేశ్ అసెంబ్లీ ఎన్నికల్లో, లోక్‌సభ ఎన్నికల్లో, మహారాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో ఓట్ల చోరీ జరిగిందని ధ్వజమెత్తారు. 2లో

## క్రీడా రంగానికి మార్గదర్శిగా తెలంగాణ

ఘన వారసత్వానికి కొనసాగింపు.. మెరుగైన భవిష్యత్‌కు బాటలు...

మౌలిక వసతుల అభివృద్ధి.... క్రీడాకారులకు ప్రోత్సాహకాలు

ఒలింపిక్స్ పతకాల సాధనే ధ్యేయంగా అడుగులు

నేడు క్రీడా పాలసీని ఆవిష్కరించనున్న ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి

గగన్ నారంగ్, పుల్లెల గోపీచంద్, అభినవ్ బింద్రా, అంజుబాబీ తదితరులతో చర్చాగోష్టులు





హైదరాబాద్ : దేశ క్రీడా రంగానికి దిక్సూచిగా... ఒలింపిక్స్ పతకాల వేటకు ఆట మైదానంగా.... భావి క్రీడాకారులకు మార్గదర్శిగా... ఘనమైన గత వారసత్వపు పరిమళాలను మరింతగా వ్యాపింపజేసేందుకు హైదరాబాద్ వేదిక కాబోతోంది. ప్రతి క్రీడాకారునిలో ప్రతిభకు మరింతగా సానబెట్టి విశ్వ వేదికపై మన క్రీడాకారులు దేశ పతాకాన్ని గర్వంగా ఎగురవేసేందుకు వీలుగా వారికి అవసరమైన వసతులు, ప్రోత్సాహకాలు కల్పించేందుకు తెలంగాణ ప్రజా ప్రభుత్వం క్రీడా విధానాన్ని (స్పోర్ట్స్ పాలసీ) రూపొందించింది. ప్రముఖ క్రీడాకారుల సమక్షంలో గౌరవ ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి తెలంగాణ క్రీడా విధానాన్ని శనివారం ఆవిష్కరించనున్నారు. కోటి జనాభా లేని దేశాలు ఒలింపిక్స్‌లో నాలుగైదు బంగారు పతకాలు దక్కించుకుంటుంటే వంద కోట్ల పైచిలుకు జనాభా ఉన్న మన దేశం మాత్రం ఒక్క స్వర్ణ పతకం గెలుచుకోవడం కష్టమవుతోంది.. దశాబ్దాలుగా ప్రభుత్వాలు సరైన క్రీడా పాలసీని రూపొందించు కోకపోవడం... క్రీడాకారులు, కోచ్‌లకు సరైన ప్రోత్సాహం కల్పించకపోవడం 2లో

## రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

ఎవరిమెప్పుకోసం ఈ విపరీత వ్యాఖ్యలు

రాహుల్ తీరుపై మండిపడ్డ కేంద్రమంత్రి కిరణ్ రిజిజు

న్యూఢిల్లీ : రాహుల్ భారత్ వ్యతిరేక భాషను ఉపయోగించి ఎన్నికల సంస్థను కించపరిచారని కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాల శాఖ మంత్రి కిరణ్ రిజిజు ఆరోపించారు. 2లో



## కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

ఆంధ్రాకు మేలు చేసేలా గతంలో నిర్ణయాలు

తప్పిదాలు సరిదిద్దేలా కాంగ్రెస్ అడుగులు

పాదయాత్రలో బిఆర్ఎస్‌పై టీపీసీసీ చీఫ్ ఘాటు విమర్శలు

బీఆర్ఎస్ అధినాయకత్వంపై టీపీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ సంచలన ఆరోపణలు చేశారు. బనకచర్ల విషయంలో గత పాలకులదే ముమ్మాటికీ తప్పని విమర్శించారు. బీఆర్ఎస్ నేతలు కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు- రాజకీయాలు చేసి ఆంధ్రా పాలకులకు మేలు చేశారని ధ్వజమెత్తారు. బీఆర్ఎస్ నేతల తప్పిదాలను సరిదిద్దేందుకు కాంగ్రెస్ ప్రభుత్వం సిద్ధంగా ఉందని ఆ దిశగా అడుగులు వేస్తోందని ఉద్ఘాటించారు. తాకట్టు- పెట్టిన వాటాను వెనక్కు తేవడానికి ప్రయత్నిస్తుంటే బీఆర్ఎస్ నాయకులు తమ ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నారని మండిపడ్డారు మహేష్ కుమార్ గౌడ్.

వికారాబాద్ : శుక్రవారం వికారాబాద్ జిల్లా పరిగిలో మహేష్ కుమార్ గౌడ్ పర్యటించారు. ఈ సందర్భంగా పరిగిలో జనహిత పాదయాత్ర ముగింపు అనంతరం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడారు. ఉత్తమ్ కుమార్ రెడ్డి పవర్ పాయింట్ ప్రజెంటేషన్‌లో 2014 నుంచి మొన్నటి వరకు గత బీఆర్ఎస్ పాలకులు చేసిన తప్పిదాలు స్పష్టంగా కనిపిస్తున్నాయని తెలిపారు. అప్పటి ఆంధ్రా పాలకులకు కేసీఆర్, హరీష్‌రావు తలొగ్గి కాంప్రమైజ్ అయ్యారని ఫైర్ అయ్యారు మహేష్ కుమార్ గౌడ్. బనకచర్ల ప్రాజెక్టు సంపూర్ణంగా పూర్తయితే తెలంగాణకు తీవ్ర అన్యాయం జరుగుతుందని మహేష్ కుమార్ గౌడ్ ఆవేదన వ్యక్తం చేశారు. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వానికి ఫిర్యాదు చేసి ప్రాజెక్టు నిర్మాణానికి అడ్డుకట్ట వేశామని గుర్తుచేశారు. బీఆర్ఎస్ నాయకుల తప్పిదాలు బయటకు వస్తాయని 2లో

## ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ

నామినేషన్లు దాఖలుకు ఆగస్టు 21 చివరితేదీ

సెప్టెంబర్ 9న ఎన్నిక...అదేరోజు ఫలితం ప్రకటన




న్యూఢిల్లీ : జగదీప్ ధన్‌ఖడ్ రాజీనామాతో ఖాళీగా ఉన్న ఉపరాష్ట్రపతి పదవికి ఎన్నికల సంఘం కసరత్తు మొదలు పెట్టింది. ఈ క్రమంలో నూతన ఉప రాష్ట్రపతి ఎన్నిక కోసం శుక్రవారం షెడ్యూల్ విడుదలైంది. సెప్టెంబర్ 9న ఆ ఎన్నిక జరగనుందని కేంద్ర ఎన్నికల సంఘం వెల్లడించింది. జగదీప్ ధన్‌ఖడ్ తన పదవికి అనూహ్యంగా రాజీనామా చేయడంతో ఈ పక్రియ అనివార్యమైంది. 2లో

## సిఎం రేవంత్‌కు కాళేశ్వరం నివేదిక

అందచేసిన మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి

హైదరాబాద్ : సీఎం రేవంత్‌రెడ్డికి కాళేశ్వరం కమిషన్ నివేదిక అందింది. శుక్రవారం దీనిని రాష్ట్ర నీటిపారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి స్వయంగా అంద జేశారు. కాళేశ్వరం ప్రాజెక్టు పై జస్టిస్ పీసీ ఘోష్ న్యాయ విచారణ చేపట్టిన సంగతి తెలిసిందే. మిగతా 2లో

## సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం



అధికారంలో ఉన్నవారిని దించడంలోనూ ముందుంటారు

వంటకంలో ఉప్పు లాంటి వారు...వారు లేకుంటే రాజకీయాలు లేవు

దిగజారుతున్న జర్నలిజం విలువలు...సోషల్ మీడియా పేరుతో అరాచకాలు

నవ తెలంగాణ దశమ వార్షికోత్సవంలో సిఎం రేవంత్ రెడ్డి

ప్రజాసమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని, వారిది రాజీలేనిపోరాటమని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అన్నారు. అధికారంలోకి తేవడానికి కమ్యూనిస్టులు ఉపయోగపడతారో లేదో విశ్లేషించలేను కానీ, అధికారంలో ఉన్నవారిని దించడానికి మాత్రం పనికొస్తారని ముఖ్యమంత్రి అన్నారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన నవ తెలంగాణ దశమ వార్షికోత్సవ కార్యక్రమంలో సీఎం పాల్గొన్నారు.

హైదరాబాద్ : తప్పు చేసేవాళ్లను గద్దె దించడంలో కమ్యూనిస్టులు ఎప్పుడూ ముందుంటారని అన్నారు. అబద్ధాల ప్రాతిపదికన రాజకీయాలు చేయకూడదని.. రాజకీయాల్లోకి వచ్చినప్పుడే నిర్ణయించుకున్నానని ఈ సందర్భంగా సిఎం అన్నారు. కమ్యూనిస్టులు ఉప్పు లాంటి వారు. ఎన్ని మసాలాలు ఉన్నా.. ఉప్పు లేకపోతే వంటకు రుచి రాదని అన్నారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రావడానికి కమ్యూనిస్టులు చేసిన ఉద్యమాలు ఉపయోగపడ్డాయి. 2004లో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందంటే.. ఆనాడు విద్యుత్ ఉద్యమాలను లోతుగా ప్రజల్లోకి తీసుకెళ్లింది కమ్యూనిస్టు సోదరులని నమ్ముతున్నానని అన్నారు.. 2023లో మేము అధికారంలోకి రావడానికి ప్రత్యక్షంగానో.. పరోక్షంగానో వీరభద్రం చేసిన పాద యాత్రలు, పోరాటాలు కారణం కావొచ్చన్నారు. ప్రజా పాలనను కొనసాగించడానికి కూడా మీ సహకారం కావాలని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. ఇదిలావుంటే సీసీనియర్ పాత్రికేయులు రాసిన విశ్లేషణలు మాకెంతో ఉపయోగపడతాయని తెలిపారు. వార్తా కథనాలను నిశితంగా గమనిస్తూ ఉంటానని అన్నారు. పరిపాలనపై పట్టు సాధించాలంటే విశ్లేషణలు చదవాలని, అన్ని అంశాలు ఒకే చోట 2లో

## యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

మొదటి యూనిట్ గ్రిడ్‌కు అనుసంధానం

800 మెగావాట్ల సామర్థ్యం కలిగిన యూనిట్ ప్రారంభం



నల్గొండ జిల్లా దామరచర్లలోని యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లోని 800 మెగావాట్ల విద్యుత్తు ఉత్పత్తి సామర్థ్యం కలిగిన మొదటి యూనిట్ అందుబాటులోకి వచ్చింది. దీనిని జాతికి అంకితం చేశారు. మంత్రులు భట్టి విక్రమార్క, ఉత్తమ్ కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, అడ్లూరి లక్ష్మణ్ శుక్రవారం నాడిక్కడ జరిగినకార్యక్రమంలో జాతికి అంకితం చేశారు. కార్యక్రమంలో మండలి ఛైర్మన్ గుత్తా సుఖేందర్‌రెడ్డి కూడా పాల్గొన్నారు.

నల్లగొండ : అంతకు ముందు యాదాద్రి థర్మల్ విద్యుత్కేంద్రం లో ఇంటిగ్రేటెడ్ టౌన్‌షిప్‌కు మంత్రులు శంకుస్థాపన చేశారు. 55 ఎకరాల్లో రూ.970 కోట్లతో టౌన్‌షిప్‌ను నిర్మించ నున్నారు. వన మహోత్సవంలో భాగంగా మంత్రులు ఇక్కడ మొక్కలు నాటారు. అనంతరం భూనిర్వాసితులతో మాట్లాడారు. ఆగస్టు 15 లోపు వారికి ఉద్యోగాలు ఇస్తామని హామీ ఇచ్చారు. మిగతా 2లో

## హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మత్తులు



రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టాం

త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు

2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పూర్తి

దేశంలో అత్యధికంగా పెన్షన్లు ఇస్తున్నది మన రాష్ట్రమే

గూడెం చెరువులో పెన్షన్లు అందచేసిన సిఎం చంద్రబాబు

2

# ఎన్నికల అక్రమాలపై అణుబాంబు లాంటి ఆధారాలు

మధ్యప్రదేశ్, మహారాష్ట్రలో కొత్తగా కోటి ఓట్లు- చేర్చారని పేర్కొన్నారు. ఇసి అక్రమాలపై ఆరు నెలలపాటు- దర్యాప్తు చేశామన్నారు. అణుబాంబు లాంటి ఆధారాలు తమ వద్ద ఉన్నాయని.. ఆ అణుబాంబు పేలితే ఎన్నికల సంఘమే ఉండదని హెచ్చరించారు. ఇసిలో అక్రమాలకు పాల్పడిన ఏ స్థాయి అధికారినైనా, ఒకవేళ రిటైరైనా వదిలి పెట్టామని స్పష్టం చేశారు.

# యాదాద్రి థర్మల్ కేంద్రం జాతికి అంకితం

గత ప్రభుత్వం 2015లో 800 మెగావాట్ల సామర్థం గల 5 కేంద్రాల నిర్మాణం చేపట్టింది. 2017లో పనులు ప్రారంభించారు. సుమారు రూ.30వేల కోట్ల అంచనా వ్యయం కాగా మరో రూ.5వేల కోట్లు అదనంగా ఖర్చు చేయాల్సిన పరిస్థితి ఏర్పడింది. రెండో యూనిట్‌ను గతేడాది డిసెంబరు 7న సీఎం ప్రారంభించారు. ఇప్పుడు ఒకటో యూనిట్‌ను జాతికి అంకితం చేసి పవర్‌గ్రిడ్‌కు అనుసంధానం చేశారు. 3, 4వ యూనిట్ నిర్మాణ పనులు దాదాపు పూర్తి కావొచ్చాయి. ఈ ఏడాది చివరి నాటికి అందుబాటులోకి రానున్నాయి. 5వ యూనిట్ 2026 మార్చిలోగా పూర్తి చేసేందుకు చర్యలు చేపట్టారు. ప్లాంటుకు మూడు కిలోమీటర్ల సమీపంలో దుబ్బతండా వద్ద ఉద్యోగుల నివాస సముదాయాల కోసం సుమారు 60 ఎకరాల్లో మెగా టౌన్‌షిప్ నిర్మించనున్నారు.

# ఉపరాష్ట్రపతి ఎన్నికకు షెడ్యూల్ విడుదల

పార్లమెంటు- వర్షాకాల సమావేశాలు ప్రారంభమైన తొలిరోజే ధన్‌ఖడ్ తన పదవిని వీడారు. ఈ నేపథ్యంలో ఎన్నిక షెడ్యూల్ విడుదలైంది. దీనిపై ఆగస్టు 7న ఎన్నికల సంఘం నోటిఫికేషన్ జారీ చేయనుంది. నామినేషన్లు దాఖలుకు చివరితేదీ ఆగస్టు 21గా ప్రకటించింది. పోలింగ్ తేదీ నాడే అంటే సెప్టెంబర్ 9నే ఫలితాలు వెల్లడి కానున్నాయి. ఉప రాష్ట్రపతి పదవికి ఎన్డీయే కూటమి.. ఎవరిని ఎంపిక చేస్తుందన్న దానిపై ఆసక్తి నెలకొంది. ఇప్పటికే రేసులో పలువురి పేర్లు తెర పైకి వచ్చాయి. బిహార్ ముఖ్యమంత్రి నీతీశ్‌కుమార్, జేడీయూ నేత హరివంశ్ నారాయణ్ సింగ్, కాంగ్రెస్ ఎంపీ శశిథరూర్ సహా పలువురు నేతల పేర్లు ఉప రాష్ట్రపతి రేసులో ఉన్న సంగతి తెలిసిందే. పార్టీ సిద్ధాంతాలు, భావజాలానికి అనుగుణంగా వ్యవహరించే నేతకు భాజపా ఆ పదవిని అప్పగిస్తుందని సమాచారం. ఇదిలావుంటే ఆరోగ్యపరమైన కారణాలతో రాజీనామా చేస్తున్నట్లు- రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ముకు లేఖ పంపారు. 2022 ఆగస్టు 11న ఉప రాష్ట్రపతిగా బాధ్యతలు చేపట్టిన ధన్‌ఖడ్‌కు 2027 ఆగస్టు వరకూ పదవీకాలం ఉంది. అయితే రెండేళ్ల 344 రోజులకే వైదొలిగారు. 74 ఏళ్ల ధన్‌ఖడ్ తర్వాత ఉప రాష్ట్రపతిగా ఎవరిని ఎన్నుకుంటారనే అంశంపై ఆసక్తి నెలకొంది. ఉభయ సభల్లో వివిధ ఖాళీలతో కలిపి సభ్యుల సంఖ్య ప్రస్తుతం 786గా ఉంది. ఇందులో మెజారిటీకి 394 మంది మద్దతు అవసరం. లోక్‌సభలో ఎన్డీయేకు 293 మంది సభ్యుల బలముంది. రాజ్యసభలో 129 మంది మద్దతుంది. మరోవైపు విపక్ష కూటమికి లోక్‌సభలో 234 మంది సభ్యులు, రాజ్యసభలో 79 మంది సభ్యుల బలముంది. మొత్తంగా ఎన్డీయేకు 422 మంది, విపక్ష కూటమికి 313 మంది అనుకూలంగా ఉన్నారు. ఇలా ఉభయ సభల్లో మెజారిటీ లేనప్పటికీ ఉప రాష్ట్రపతి ఎన్నికలో పోటీ చేసేందుకు విపక్షాలు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# అలా ఎన్‌కౌంటర్ నుంచి బయటపడ్డా

## ఆనాటి ఘటనపై రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు

హైదరాబాద్,ఆగస్ట్1 : తనను ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేసినట్లు- ఎమ్మెల్యే రాజాసింగ్ సంచలన వ్యాఖ్యలు చేశారు. ఓ టీ-వీ ఇంటర్వ్యూలో ఆయన మాట్లాడుతూ.. నాడు జరిగిన సంచలన విషయాలను వివరించారు. తాను హిందువాహినిలో చేరి యువతను ధర్మం వైపు ఆకర్శితులయ్యేలా కార్యక్రమాలు చేపట్టానని గుర్తు చేశారు. కాంగ్రెస్ హయాంలో తమ కార్యక్రమాలకు ఎప్పుడూ ఏదో ఒక గొడవ సృష్టించేవారని, తాము ఎక్కడికి వెళితే అక్కడ 144 సెక్షన్ అమలు చేసేవారని రాజాసింగ్ తెలిపారు. ఎవరైనా హిందువులను మతం మార్చాలని ప్రయత్నిస్తే తాము అడ్డుకునే వాళ్లమన్నారు. మా వల్ల ఏదో ఒక గొడవ జరుగుతోందని అప్పటి కాంగ్రెస్ గవర్నమెంట్ కుట్రలు చేసింది. లేనిపోని కేసులు పెట్టి జైలుకు పంపారు. అప్పుడు కూడా ఆగలేదు. జైలుకు వెళ్లాం బయటకు వచ్చాం. మళ్లీ ధర్మం కోసం కార్యక్రమాలు చేశామని తెలిపారు. ఇలా ఎన్‌కౌంటర్ మిస్టరీని కూడా బయటపెట్టారు. కాంగ్రెస్ హయాంలో మమ్మల్ని ఎన్‌కౌంటర్ చేయాలని ప్లాన్ చేశారని రాజాసింగ్ తెలిపారు. నన్ను, నాతో పాటు- ఓ హిందూవాహిని కార్యకర్తను అడివిలోకి తీసుకెళ్లారు. ఎన్‌కౌంటర్ చేయడానికి ప్లాన్ చేశారు. నన్ను ఎన్‌కౌంటర్ చేయబోయే పోలీస్ కట్టర్ హిందు. నా గురించి ఆయనకు తెలియదు. ఉన్నతాధికారులు నన్ను ఎన్‌కౌంటర్ మాత్రమే చేయాలని ఆయనకు చెప్పారు. ఆ పోలీసు నన్ను అడవిలోకి తీసుకెళ్లి జీపు నుంచి కిందికి దింపారు. పరిగెత్తమని చెప్పాడు. ఆయన తన గన్ లోడ్ చేసుకుంటున్నాడు. అప్పుడే నాకు అర్థం అయ్యింది నన్ను ఎన్‌కౌంటర్ చేస్తారని.. 'ఉరకడం ఎందుకు సార్.. ఇక్కడే కాల్చేయండి.' అని నేను ఆ పోలీసు అధికారికి చెప్పాను. ధర్మం కోసం చావాలనే మా కల ఇక్కడే చంపేయండి అని చెప్పాను. దీంతో ఆ పోలీసు అధికారి ఆలోచనలో పడ్డారు. వీళ్లు ధర్మం గురించి మాట్లాడుతున్నారేంటి? అని ఆలోచించారు. ఇంతకు మీరు ఎవరు? అని ఆ ఆఫీసర్ అప్పుడు మమ్మల్ని అడిగారు. దాదాపు రెండు గంటల పాటు- మా చరిత్ర ఆయనకు చెప్పాం. మిమ్మల్ని చంపి ఉంటే పెద్ద పాపం అయి ఉండేది అని ఆ పోలీస్ ఫీల్ అయ్యారు. దీంతో కొన్ని ఛానెల్స్‌కి ఆ పోలీసే స్వయంగా 'రాజాసింగ్‌ను ఎన్‌కౌంటర్ చేయబోతున్నారు.' అని మీడియాకు లీక్ చేశారు. దీంతో టీవీల్లో ఈ వార్త వచ్చింది. దీంతో నన్ను ఎవరైతే ఎన్‌కౌంటర్ చేయాలని పోలీసులకు ఆదేశాలు ఇచ్చారో వాళ్లే ఆపేయాలని ఈ అధికారికి ఫోన్ చేశారు. అలా ఎన్‌కౌంటర్ నుంచి బయట పడ్డామని రాజాసింగ్ సంచలన విషయాలు బయటపెట్టారు.



# సమస్యలపై పోరాటంలో కమ్యూనిస్టులది అగ్రభాగం

క్రోడీకరించి విశ్లేషణలు రాయడం ఎంతో ఉపయోగకరమని తెలియజేశారు. అయితే జర్నలిజం విలువలు దిగజారుతున్నాయని, ఇప్పుడు ప్రతి ఒక్కరు జర్నలిస్టుగా కనిపిస్తున్నారని అన్నారు. ఇందులో ఎవరు ఏమిటో మీరే చెప్పాలన్నారు. జర్నలిజం డెఫినేషన్ మారిందని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. జర్నలిజం వృత్తిలో ఉన్నవాళ్లు తమ బాధ్యతను మరవకూడదన్నారు. సోషల్ మీడియా పేరుతో జర్నలిజంలోకి వస్తున్నా వారి విషయంలో జాగ్రత్తగా ఉండాల్సిన అవసరం ఉందన్నారు. సోషల్ మీడియా జర్నలిస్టులను వేరే చేయాలని.. వాళ్లను వేరుగా కూర్చోబెట్టాలని పాత్రికేయులకు సీఎం విజ్ఞప్తి చేశారు. వాళ్లు, మీరు ఒక్కటి కాదన్న భావనను ప్రజలకు కల్పించాల్సిన అవసరం ఉందని సీఎం స్పష్టం చేశారు. ఈ రోజు మీడియా, సోషల్ మీడియా, డిజిటల్ మీడియా ఎవరు పడితే వాడు జర్నలిస్ట్ అని గొప్పలు చెప్పుకుంటున్నారు. పెన్ను పేపర్ ఇస్తే ఏబీసీడీలు కూడా రాయలేని వారు కూడా నేను జర్నలిస్ట్‌ని అంటారన్నారు. ఏం జర్నలిస్ట్ అని అడిగితే సోషల్ మీడియా జర్నలిస్ట్ అంటున్నారు. పేరు పక్కనే జర్నలిస్ట్ అని పెట్టుకుంటారు అదేదో వాళ్ల ఇంటిపేరు అయినట్టు- అంటూ వ్యాఖ్యానించారు. వాళ్ల తాతలు, ముత్తాతల నుంచి జర్నలిజంలోనే పుట్టి పెరిగినట్టు. జర్నలిస్ట్ ఎల్లయ్య, జర్నలిస్ట్ పుల్లయ్యా అని పెట్టు-కుంటు-న్నారు. వాడు ఎప్పుడైన జర్నలిజం స్కూల్‌లో చదివిండా? లేకపోతే ఓనమాలు మొత్తం అయినా వస్తాయా అంటే రెండూ రావు. ఒకప్పుడు ఈ రాజకీయ పార్టీలు సిద్ధాంతాన్ని పూర్తిగా నమ్మిన కార్డు హోల్డర్స్ అయిన జర్నలిస్టులు ఉండేవాళ్లు. లేదా జర్నలిజం చదివిన వాళ్లకు ఈ బాధ్యతలు ఇచ్చే వాళ్లు. వాళ్ల పనితనాన్ని బట్టి వాళ్లకు బాధ్యత పెంచేవాళ్లు. కానీ ఈ రోజు అదేమీ లేదు. రోడ్లమీద ఆవారా గా తిరిగేటోడు .. ఎక్కువ తిట్లొచ్చినోడు, ఏందంటే అదే మాట్లాడేటోడే జర్నలిజం అనే ముసుగు తొడుక్కొని అందరి పట్ల అసహ్యకరమైన భాషను ఉపయోగించే పరిస్థితులు వచ్చాయని ఆవేదన చెందారు. ఇలా జర్నలిజం ముసుగులో కొందరు ప్రెస్‌మీట్‌లు పెట్టినప్పుడు ముందు వరుసలో ధిక్కారంగా కూర్చుంటారు. మనమేదో లోకువ అయినట్టు-, వాళ్లేదే పెత్తనాన్ని చెలాయించడానికి వచ్చినట్లు- మన కళ్లలోకి చూస్తుంటారు. ఇంకా నన్ను చూసి నమస్కారం పెడతలేవు. నన్ను చేసి ఇంకా తల వంచుకుంటలేవు అని చూస్తుంటాడు. స్టేజీ దిగిపోయి పల్ల పల్ల చెంపలు పగులగొట్టాలని నాకు అనిపిస్తది. కానీ, పరిస్థితులు, హోదా అడ్డం వస్తుందని సీఎం రేవంత్‌రెడ్డి వ్యాఖ్యానించారు. ఇకపోతే ఈ కార్యక్రమంలో మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర ప్రభుత్వ సలహాదారు నరేందర్‌రెడ్డి, సీపీఎం సీనియర్ నేతలు రాఘవులు, తమ్మినేని వీరభద్రం తదితరులు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# కేసీఆర్, హరీష్‌రావు తాకట్టు రాజకీయాలు

పసిగట్టి తమ ప్రభుత్వంపై ముందే ఆరోపణలు చేస్తున్నారని దుయ్యబట్టారు. బనకచర్ల విషయంలో గత కేసీఆర్ ప్రభుత్వం తప్పు చేసింది... దాన్ని సరిదిద్దే క్రమంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఉందని మహేష్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. మహేష్ కుమార్ గౌడ్ పరిగి నియోజకవర్గంలో పాదయాత్ర నిర్వహించారు. ఈ యాత్రలో ముఖ్య ఉద్దేశం ప్రజలతో ప్రత్యక్షంగా మమేకం కావడం, వారి సమస్యలు తెలుసుకోవడం అని ఆయన స్పష్టంగా తెలిపారు. మేము అధికారంలో ఉన్నా లేకపోయినా ప్రజల మధ్యలో ఉండాలన్న ఉద్దేశంతోనే ఈ పాదయాత్రను ప్రారంభించాం. ఇది కేవలం ఒక రాజకీయ కార్యక్రమం కాదు. ప్రజల జీవితాల్లో ఎదుర వుతున్న వాస్తవాలను నేరుగా తెలుసుకోవడానికి, వారి సలహాలు, సూచనలు స్వీకరించడానికి ఇదొక సాధనంలా వుంది,' అని మహేష్ కుమార్ గౌడ్ అన్నారు. గాంధీ యాత్రల నుండి రాహుల్ గాంధీ చేపట్టిన భారత్ జోడో యాత్ర వరకు పాదయాత్రలు దేశ ప్రజలను చైతన్యపరిచిన ఉదాహరణలుగా నిలిచాయని గౌడ్ గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి, ఉపముఖ్యమంత్రి భట్టి విక్రమార్క చేసిన పాదయాత్రలు కూడా ప్రజల్లో కొత్త ఆశలు నింపాయన్నారు. అదే దారిలో టీ-పీసీసీ ఈ పాదయాత్రకు శ్రీకారం చుట్టిందని చెప్పారు. ఈ యాత్రలో ఏఐసీసీ నాయకురాలు మీనాక్షి నటరాజన్‌తో పాటు- రాష్ట్ర మంత్రులు, కాంగ్రెస్ నాయకులు పాల్గొన్నారు. తదుపరి పాదయాత్రలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి కూడా పాల్గొననున్నట్లు మహేష్ గౌడ్ తెలిపారు. తెలంగాణ రాష్ట్రాన్ని ఏడున్నర లక్షల కోట్ల అప్పులతో తాము అధికారం చేపట్టామని, అయినప్పటికీ ప్రతి నెలా 6 వేల కోట్ల అప్పు చెల్లిస్తూ, సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని గౌడ్ వివరించారు. బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల నిబంధనపై కాంగ్రెస్ ప్రభుత్వం కట్టు-బడి ఉందని స్పష్టం చేశారు. ప్రజల ఆకాంక్షలకే స్పందనగా కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడింది. వారికి న్యాయం చేయడమే మా లక్ష్యం, అంటూ ఆయన తన ప్రసంగాన్ని ముగించారు.

# సిఎం రేవంత్‌కు కాళేశ్వరం నివేదిక

సంబంధిత నివేదికను గురువారం నీటిపారుదల శాఖ ముఖ్య కార్యదర్శి రాహుల్ బొజ్జాకు ఆయన అందజేశారు. శుక్రవారం ఆ నివేదిక సీఎంకు చేరింది. ఈ సందర్భంగా సీఎం రేవంత్‌తో డిప్యూటీ- సీఎం భట్టి విక్రమార్క, మంత్రులు ఉత్తమ్, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, సీఎస్ రామకృష్ణారావు భేటీ- అయ్యారు. కాళేశ్వరం కమిషన్ నివేదికపై వీరంతా చర్చించారు. కాళేశ్వరం బ్యారేజీల నిర్మాణంలో అన్ని రకాల వైఫల్యాలు జరిగాయని, దీనికి కింది స్థాయి నుంచి ఉన్నత స్థాయి వరకు పలువురు కారణమని నివేదికలో జస్టిస్ పీసీ ఘోష్ కమిషన్ స్పష్టం చేసినట్లు- తెలిసింది. వ్యవస్థలు కాకుండా వ్యక్తుల ఇష్టాల ప్రకారం పనులు జరిగాయని, ఉన్నత స్థాయిలో వచ్చిన ఒత్తిడులకు లొంగి నిబంధనలకు విరుద్ధంగా నిర్ణయాలు తీసుకొన్నారని, ఆర్థిక అవకతవకలు జరిగాయని... ఇలా పలు అంశాలను కాళేశ్వరం న్యాయ విచారణ కమిషన్ పేర్కొన్నట్లు- సమాచారం. మేడిగడ్డ, అన్నారం, సుందిళ్ల బ్యారేజీలకు సంబంధించి డీపీఆర్ తయారీ మొదలుకొని మేడిగడ్డ బ్యారేజీ కుంగడం... అన్నారం, సుందిళ్ల బ్యారేజీలలో సీపేజీల వరకు ఎప్పుడు ఏం జరిగింది... రికార్డుల ఆధారంగా ఎక్కడ ఎవరు బాధ్యులన్నది వివరంగా నివేదికలో తెలియజేసినట్లు- విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది.

# గుజరాత్‌లో పర్యటించిన ఒమర్ అబ్దుల్లా

## ఈ పర్యటన ఐకమత్యాన్ని చాటిందన్న ప్రధాని



న్యూఢిల్లీ,ఆగస్ట్1 : జమ్మూకశ్మీర్ సీఎం ఒమర్ అబ్దుల్లా ఇటీవల గుజరాత్‌లో టూర్ చేశారు. ఈ నేపథ్యంలో సీఎం ఒమర్ అబ్దుల్లా.. సబర్మతి రివర్‌ఫ్రంట్ తో పాటు- స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ సందర్శించారు. అక్కడ దిగిన ఫోటోలను తన ఎక్స్‌లో పోస్టు చేశారు. ఆ ఫోటోలపై ప్రధాని మోదీ రియాక్ట్ అయ్యారు. సబర్మతి, స్టాచ్యూ ఆఫ్ లిబర్టీ వద్ద జమ్మూకశ్మీర్ సీఎం టూర్ చేయడం సంతోషకరమని ప్రధాని అన్నారు. అబ్దుల్లా పర్యటన ఐకమత్యాన్ని చాటుతుందన్నారు. భారతీయులు ఇతర ప్రాంతాల్లో టూర్ చేసేందుకు ఈ ఘటన ఇన్స్‌పిరేషన్‌గా నిలుస్తుందన్నారు. జమ్మూకశ్మీర్‌కు పర్యాటకం కీలకమైంది. ఇటీవల పెహల్గామ్ దాడితో ఆ రాష్ట్ర ఆదాయం తగ్గింది. ఆ రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను బలోపేతం చేసే ఉద్దేశంతో సీఎం అబ్దుల్లా.. పర్యాటకుల్ని ఆకర్షించేందుకు గుజరాత్ టూర్ చేపట్టారు. ప్రధాని మోదీ తన ఫోటోలపై రియాక్ట్ కావడంతో.. సీఎం ఒమర్ అబ్దుల్లా దానికి కౌంటర్ పోస్టు చేశారు. ట్రావెల్ చేయడం వల్ల మన హద్దులు, మనసులు విస్తరిస్తాయి ప్రధాని గారు అంటూ పేర్కొన్నారు. జమ్మూకశ్మీర్‌లో టూరిజం కీలకమైందని, లక్షల మందికి ఆదాయం అదే అన్నారు. అందుకే మా రాష్ట్రానికి వచ్చేలా భారతీయ పర్యాటకుల్ని ఆకట్టు-కునే ప్రయత్నం చేస్తున్నామన్నారు. అహ్మదాబాద్‌లో జరిగిన ఓ టూరిజం ఈవెంట్‌లో పాల్గొనేందుకు వెళ్లిన సీఎం అబ్దుల్లా .. సబర్మతి రివర్ ఫ్రంట్ వద్ద మార్నింగ్ రన్ చేశారు. చాలా అందమైన ప్రదేశంలో వాకింగ్ చేసినట్లు- అబ్దుల్లా పేర్కొన్నారు. అటల్ ఫూట్ బ్రిడ్జ్ మీద కూడా రన్ చేసినట్లు- ఆయన చెప్పారు. తన పర్యటన సందర్భంగా గుజరాతీ టూర్ ఆపరేటర్లు, ట్రావెల్ పరిశ్రమ వాటాదారులతో ఆయన చర్చించారు. వారిలో విశ్వాసాన్ని నింపే ప్రయత్నం చేశారు.

# బాలకృష్ణకు బాబు,పవన్‌ల అభినందనలు

అమరావతి,ఆగస్ట్1 : బాలకృష్ణ హీరోగా అనిల్ రావిపూడి తెరకెక్కించిన 'భగవంత్ కేసరి' చిత్రానికి జాతీయ ఉత్తమ చిత్రం(తెలుగు) అవార్డు రావడంపై ఏపీ సీఎం చంద్రబాబు ఆనందం వ్యక్తం చేశారు. 'ఎక్స్' వేదికగా చిత్రబృందానికి శుభాకాంక్షలు చెప్పారు. 'ప్రేక్షకాదరణ పొందిన భగవంత్ కేసరి సినిమాకి జాతీయ అవార్డు రావడం సంతోషకరమైన విషయం. హీరో బాలకృష్ణ, చిత్రబృందానికి శుభాకాంక్షలు'అని పేర్కొన్నారు. జాతీయ చలన చిత్ర పురస్కారాల్లో తెలుగు సినిమా రంగానికి పలు పురస్కారాలు దక్కడం సంతోషంగా ఉందని ఏపీ డిప్యూటీ- సీఎం పవన్ కల్యాణ్ అన్నారు. 'సోదరుడు, హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ నటించిన 'భగవంత్ కేసరి' ఉత్తమ తెలుగు చిత్రం పురస్కారానికి ఎంపిక కావడం ఆనందదాయకం' అని పేర్కొన్నారు. ఇతర విజేతలకూ అభినందనలు తెలిపారు. మంత్రి నారా లోకేశ్ ఎక్స్ వేదికగా భగవంత్ కేసరి చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. జాతీయ చలనచిత్ర అవార్డుల్లో బాలా మామయ్య హీరోగా నటించిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం చాలా సంతోషం.సందేశాత్మక చిత్రంగా ప్రేక్షకుల మన్ననలు అందుకున్న ఈ సినిమాకి జాతీయ అవార్డు వచ్చిన సందర్భంగా మామయ్య, డైరెక్టర్ అనిల్ రావిపూడి, చిత్ర బృందానికి అభినందనలు అని పోస్టు పెట్టారు.

# క్రీడా రంగానికి మార్గదర్శిగా తెలంగాణ

మౌలిక వసతులు లేకపోవడంతో ఈ సమస్య ఉత్పన్నమైంది. దీనిని సమూలంగా మార్చేందుకు ముఖ్యమంత్రి ఎ.రేవంత్ రెడ్డి కంకణం కట్టుకున్నారు. అందుకే తెలంగాణ స్పోర్ట్స్ పాలసీని రూపొందింపజేశారు. తెలంగాణ ఘన చరిత్ర.... క్రికెట్, బ్యాడ్మింటన్, టెన్నిస్, చదరంగం వంటి క్రీడల్లో తెలంగాణకు ఘనమైన చరిత్ర ఉంది.. 2002 నేషనల్ గేమ్స్, 2024 ఇంటర్ కాంటినెంటల్ కప్ వంటి పెద్ద ఈవెంట్లకు తెలంగాణకు ఆతిథ్యమిచ్చింది. ఈ నేపథ్యంలో ఈ ఘన వారసత్వాన్ని కొనసాగిస్తూనే మరింతగా తెలంగాణ ఖ్యాతిని విశ్వవ్యాప్తంగా చాటేలా నూతన పాలసీకి రాష్ట్ర ప్రభుత్వం రూపకల్పన చేసింది. అయిదు ప్రధానాంశాలుగా.... అయిదు ప్రధానాంశాలుగా తెలంగాణ నూతన క్రీడా పాలసీ రూపొందించారు. అవి.. 1. క్రీడా విధాన నిర్వహణ, 2. క్రీడ రంగంపై సానుకూలత పెంచడం, 3. క్రీడాభివృద్ధికి అవసరమైన దీర్ఘకాలిక విధానాల రూపక్పలన, 4. క్రీడల అభివృద్ధికి అవసరమైన మైదానాలు, కోర్టుల అభివృద్ధి, 5. క్రీడాకారుల నైపుణ్యాల పెంపునకు చర్యలు, వారికి ఉద్యోగ అవకాశాల కల్పన..విదేశీ క్రీడా సంస్థలతో ఒప్పందాలు... క్రీడా పాలసీలో ముఖ్యమైన అయిదు అంశాల్లో భాగంగా యంగ్ ఇండియా వ్యాయామ విద్యా, క్రీడా విశ్వ విద్యాలయం ఏర్పాటు చేస్తారు. మన క్రీడాకారులు మెరుగ్గా రాణించేందుకు వీలుగా విదేశాల్లోని ప్రముఖ క్రీడా సంస్థలతో ఒప్పందాలు చేసుకుంటారు. క్రీడాకారులు, పారా క్రీడాకారులకు అవసరమైన అన్ని వసతులు కల్పిస్తారు. 119 నియోజకవర్గాల్లో మినీ స్టేడియాలు నిర్మిస్తారు... ప్రతి మండలంలో క్రీడా మైదానాలు ఏర్పాటు చేస్తారు.. సీఎం కప్ వంటి పోటీలు నిర్వహిస్తారు. ఒలింపిక్స్‌లో పతకాలు గెలిచిన వారికి భారీ బహుమతులు, క్రీడాకారులకు రిజర్వేషన్లు, రిటైర్డ్ క్రీడాకారులకు పింఛన్లు, కోచ్‌లకు మెరుగైన పారితోషికాలు ఇస్తారు. క్రీడా పాలసీ ఏవిధంగా అమలవుతుంది... ఏ విధమైన మార్పులు చేయాలనే దానిపై ఏడాది తర్వాత ప్రభుత్వం సమీక్షిస్తుంది. ఆ తర్వాత మూడేళ్లకు, అయిదేళ్లకు దానిపైనా సమీక్ష ఉంటుంది. డిజిటల్ డాష్‌బోర్డు విధానం ద్వారా ప్రతి ఒక్కరూ దానిని వీక్షించే అవకాశం కల్పిస్తారు. నేడు హెచ్‌ఐసీసీలో కాంక్లేవ్‌లు.. తెలంగాణలో క్రీడా విధానంపై హెచ్‌ఐసీసీలో ప్రముఖ క్రీడాకారులతో రెండు సదస్సులు నిర్వహిస్తారు.. ఒక సదస్సులో ప్రముఖ క్రీడాకారులు, క్రీడా నిపుణులు పుల్లెల గోపీచంద్, గగన్ నారంగ్, అంజూ బాబీ జార్జ్, సుమతి పాండే, తథాగత ముఖర్జీ, మరో సదస్సులో అభినవ్ బింద్రా, రవికాంత్ రెడ్డి, నీలం బాబర్దేశాయ్, అడిల్లె సుమరివాలా పాల్గొంటారు...

# హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మత్తులు

కడప : హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టామని ఎపి సిఎం చంద్రబాబు నాయుడు తెలిపారు. దివంగత ముఖ్యమంత్రి ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టులు నిర్మించబడ్డాయని అన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం లోని గూడెం చెరువులో చేనేత కార్మికురాలు అలివేలమ్మ ఇంటికి వెళ్లి ఆమెకు సీఎం పింఛను అందజేశారు. కుటుంబసభ్యులతో మాట్లాడి వారి బాగోగులు తెలుసుకున్నారు. అనంతరం ప్రజావేదిక వరకు సీఎం ఆటోలో వెళ్లారు. అక్కడ నిర్వహించిన సభలో చంద్రబాబు మాట్లాడారు. రూ.3,800 కోట్లతో హంద్రీవా పనులు చేపట్టామని, త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తి చేసి చెరువులన్నీ నింపుతాం అని తెలియ జేశారు. సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకుంటే కరువు అనేదే ఉండదని, రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని చెప్పారు. ఉపాధి కోసం యువత వేరే ప్రాంతాలకు వెళ్లాల్సిన అవసరం రాకూడదని, త్వరలోనే కడప స్టీల్ ప్లాంట్ నిర్మాణ పనులు జరుగుతాయని హామీ ఇచ్చారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్ ప్లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని, రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎపి రూ. 14 వేలు, కేంద్రం రూ. 6 వేలు మొత్తంగా రైతులకు రూ. 20 వేలు ఇవ్వబోతున్నాం అని చంద్రబాబు పేర్కొన్నారు. దేశంలోనే ఎక్కువ పింఛను ఇచ్చే రాష్ట్రం ఏపీ అని సీఎం చంద్రబాబు అన్నారు. అర్హులైన వితంతువులకు సాయం చేస్తున్నామని చెప్పారు. పింఛన్ల విషయంలో మన తర్వాత తెలంగాణ, కేరళ ఉన్నాయన్నారు. పేదలకు సాయం చేస్తే కలిగే తృప్తి మరిదేంట్లోనూ రాదని చెప్పారు. ఈ సందర్భంగా జగన్, వైకాపా నేతల తీరుపై సీఎం ఆగ్రహం వ్యక్తం చేశారు. మాజీ మంత్రి వివేకానందరెడ్డి హత్య జరిగితే మాపై విషం చిమ్మారు. అనేక మాటలు మారుస్తూ నాపై అభాండాలు వేసి అసత్యాలు రాశారు. మహిళా ఎమ్మెల్యేపైనా దూషణలకు దిగుతున్నారు. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి గురించి ఇష్టానుసారంగా నోరుపారేసుకున్న వ్యక్తిని మందలించాల్సింది పోయి ఇంకా రెచ్చగొట్టేలా వ్యవహరించిన వ్యక్తి జగన్. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలి. నాయకుడే రెచ్చగొడితే ఇక కిందిస్థాయి నేతలు ఇష్టారాజ్యంగా మాట్లాడతారు. ప్రతిచోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నాయి.. జాగ్రత్తగా ఉండాలి. మభ్యపెట్టి, మోసం చేసి ప్రజలకు అసౌకర్యం కలిగిస్తే చర్యలు తప్పవు. సాక్షి పత్రికలో వచ్చిందని నమ్మితే కుక్కతోక పట్టుకుని గోదారి ఈదినట్లేనని అన్నారు. కడప స్టీల్‌ప్లాంట్ పనులు ప్రారంభమయ్యాయి. 2028 డిసెంబర్ నాటికి తొలి దశ పనులను పూర్తిచేయాలని స్పష్టంగా ఆదేశాలిచ్చా. స్టీల్‌ప్లాంట్‌తో జమ్మలమడుగు ప్రాంతం అభివృద్ధి చెందుతుంది. మంచి కార్యక్రమాన్ని చెడగొట్టడం.. పడగొట్టడం ఈజీ.. నిలబెట్టడమే కష్టం. వైకాపా హయాంలో ఐదేళ్ల పాటు- విధ్వంసం చేశారు.. కేంద్ర పథకాలను నిలిపివేశారు. తల్లికి వందనం హామీని నిలబెట్టు కున్నాం.. ఏడుగురు పిల్లలున్నా ఇచ్చాం. అమెరికాకు గ్రాండ్ క్యానియన్‌లా మనకు గండికోట ఉంది. దాన్ని ఆకర్షణీయ ప్రాంతంగా తయారు చేస్తాం. రూ.85కోట్లతో పనులు ప్రారంభిస్తాం. శ్రీకృష్ణదేవ రాయల విగ్రహం ఏర్పాటు- చేస్తాం. గతంలో గండికోట ప్రాజెక్టును ఎన్టీఆర్ ప్రారంభిస్తే నేను పూర్తి చేశా. హంద్రీనీవా లైనింగ్ పనులు, చెరువుల మరమ్మతులు చేపట్టాం. 2024 ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి ఏడు సీట్లు గెలిచాం. వచ్చే ఎన్నికల్లో ఉమ్మడి జిల్లాలో పదికి పది సీట్లు- గెలిపించేందుకు ఇక్కడి ప్రజలు సిద్ధంగా ఉన్నారని చంద్రబాబు అన్నారు. మంత్రి సవిత, ఎమెల్యేలు కార్యక్రమంలో పాల్గొన్నారు.

# రాహుల్‌ది భారత్ వ్యతిరేక భాష

దేశ ఆర్థిక స్థితిని 'డెడ్ ఎకానమీ'గా అభివర్ణించడాన్ని ప్రతిపక్ష సభ్యులే వ్యతిరేకిస్తున్నారన్నారు. ఆయన ఎవరి మెప్పు కోసం ఇలాంటి విపరీత వ్యాఖ్యలు చేస్తున్నారో తెలియదని అన్నారు. భాజపా కోసం ఈసీ ఓట్ల చోరీకి పాల్పడుతోందని.. దాన్ని రుజువు చేసేందుకు తమ వద్ద అణు బాంబు లాంటి ఆధారాలున్నాయని ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ చేసిన వ్యాఖ్యలపై మంత్రి కిరణ్ రిజిజు తీవ్రంగా స్పందించారు. ప్రతిపక్షంలోని నాయకులే రాహుల్ ఉపయోగించిన భాషను వ్యతిరేకిస్తున్నారు. దేశ ఆర్థిక స్థితిని డెడ్ ఎకానమీగా మీరెలా చెప్పగలరని ప్రశ్నిస్తున్నారు. రాహుల్ చిన్న పిల్లాడు కాదని, ప్రతిపక్షనాయకుడి హోదాకు తగ్గట్టుగా వ్యవహరించాలని రిజిజు సూచించారు. అధికారులను బెదిరించడం, దేశానికి వ్యతిరేకంగా మాట్లాడటం సరికాదన్నారు. ఉద్దేశపూర్వకంగా పార్లమెంటు కార్యకలాపాలను అడ్డుకోవడం వల్ల అంతిమంగా ఓడిపోయేది ప్రతిపక్ష ఎంపీలే అని రిజిజు వ్యాఖ్యానించారు. 'ప్రతిపక్షం సభను పనిచేయనివ్వడం లేదు. ప్రజల సమస్యలను లేవనెత్తలేని ఎంపీలకు అధిక నష్టం జరుగుతుందని అన్నారు. చర్చలు పార్లమెంటరీ నియమాల ప్రకారం జరగాలని లోక్‌సభ స్పీకర్, రాజ్యసభ డిప్యూటీ- ఛైర్మన్ ఇద్దరూ స్పష్టం చేశారని రిజిజు అన్నారు.ప్రతిపక్ష నేత దేశానికి హాని కలిగించే ప్రమాదకరమైన ఆట ఆడుతున్నారని మండిపడ్డారు.

# భగవంత్ కేసరికి జాతీయ అవార్డు

## బాలయ్యకు, అనిల్రావిపూడికి అభివనందనల వెల్లువ

అమరావతి,ఆగస్ట్1 : అనిల్ రావిపూడి దర్శకత్వంలో నట సింహం నందమూరి బాలకృష్ణ నటించిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడంతో, ఈ చిత్ర హీరో నందమూరి బాలకృష్ణకు పలువురి ప్రముఖుల నుంచి అభినందనలు వెల్లువెత్తుతున్నాయి. ఈ చిత్రం 2023, అక్టోబర్ 19వ తేదీన ప్రపంచవ్యాప్తంగా విడుదలైంది. హీరో బాలకృష్ణ, కాజల్ అగర్వాల్, అర్జున్ రాంపాల్, శ్రీలీల ప్రధాన తారాగణంగా నటించారు. ఈ చిత్రానికి తెలుగు ప్రేక్షకులు బ్రహ్మరథం పట్టారు. 71వ జాతీయ చలనచిత్ర అవార్డుల్లో బాలా మామయ్య హీరోగా నటించిన భగవంత్ కేసరి జాతీయ ఉత్తమ తెలుగు చిత్రంగా ఎంపిక కావడం చాలా సంతోషం. బాలా మామయ్య నటన, సందేశాత్మక చిత్రంగా ప్రేక్షకుల మన్ననలు అందుకున్న భగవంత్ కేసరికి నేషనల్ అవార్డు వచ్చిన సందర్భంగా బాలా మామయ్యకు, డైరెక్టర్ అనిల్ రావిపూడి గారికి, చిత్ర బృందానికి అభినందనలు తెలిపారు. భగవంత్ కేసరి చిత్రం ఉత్తమ చిత్రంగా ఎంపిక కావడంపై ఆ చిత్ర దర్శకుడు అనిల్ రావిపూడి, నిర్మాత సాహు గారపాటి మాట్లాడుతూ.. భగవంత్ కేసరి చిత్రం అటు- ప్రేక్షకాదరణ.. ఇటు- అవార్డులు రెండు అందుకుందని తెలిపారు. హీరో బాలయ్య బాబు మమల్ని ఎంతో సపోర్ట్ చేశారని గుర్తు చేసుకున్నారు. కథను నమ్మి మేము చేసిన ఈ ప్రయత్నానికి గుర్తింపు లభించటం చాలా ఆనందంగా ఉందన్నారు. ప్రతి సినిమాను బాధ్యతగా చేస్తామని.. కానీ ఇప్పుడు అది మరింత పెరిగిందన్నారు. ఈ అవార్డు మా ఉత్సాహాన్ని పెంచిందని పేర్కొన్నారు. ఈ ఏడాది ప్రారంభంలో ఓ బ్లాక్ బస్టర్ హిట్.. ఇప్పుడు ఈ అవార్డ్ రావడం పట్ల ఆయన సంతోషం వ్యక్తం చేశారు. వచ్చే సంక్రాంతికి మెగా స్టార్ చిరంజీవి హీరోగా చిత్రం విడుదల కానుందన్నారు.

# ఓయూలో అన్నాభావు సాఠె 105వ జయంతి వేడుకలు

హైదరాబాద్ : ఉస్మానియా యూనివర్సిటీలో డా. సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠె 105వ జయంతి వేడుకలను మాంగ్ సమాజ్ తెలంగాణ రాష్ట్ర సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మొదటగా అందరు అన్నాభావు సాఠె చిత్రపటానికి పూలమాల వేసి, నివాళి అర్పించారు. ముఖ్య అతిథిగా పాల్గొన్న టి.ఎస్.ఎఫ్. రాష్ట్ర అధ్యక్షులు డాక్టర్ జంపాల రాజేష్ గారు మాట్లాడుతూ పాఠశాలకు వెళ్లకుండానే ఏకలవ్యుడులాగా ఇష్టంగా కష్టపడి విద్యా జ్ఞానాన్ని ఆర్జించి ప్రపంచ ప్రఖ్యాతిగాంచిన కవి, రచయితగా ప్రసిద్ధిచెందిన డా. సాహిత్య సామ్రాట్ అన్నాభావు సాఠెను అందరు ఆదర్శంగా తీసుకోని మంచిగా చదువుకోవాలని, వారి సాహిత్యాన్ని వెలుగులోకి తీసుకొనిరావడానికి ఉస్మానియా విద్యార్థులు కృషిచేయాలని పిలుపునిచ్చారు. మాంగ్ సమాజ్ రాష్ట్ర అధ్యక్షులు గాయక్వాడ్ తులసీదాస్ మాంగ్, రాష్ట్ర ప్రధానకార్యదర్శి కాంబ్లే శంకర్ మాంగ్ మాట్లాడుతూ తహశీల్దార్ కార్యాలయం ద్వారా మాంగ్ కులానికి వెంటనే కుల ధ్రువీకరణ పత్రం జారీచేయాలని, వెనుకబడిన మాంగ్ సమాజ్ అభివృద్ధికి ప్రత్యేక మాంగ్ సమాజ్ కార్పొరేషన్ ఏర్పాటుచేయాలని, పిల్లలు చదువుకోవడానికి గురుకులాల్లో ప్రత్యేక సీట్లు కేటాయించాలి, ఏజెన్సీలో నివసించే మాంగ్ ప్రజలకు పాత పహాణి పత్రాల ఆధారంగా రైతులకు లభించే అన్ని సదుపాయాలు కల్పించాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బి.ఆర్.ఎస్.వి. ప్రధాన కార్యదర్శి డా.చందు, అమృతం కళ్యాణ్, జంపాల రాంబాబు, వెంకట్, సతీష్, శేఖర్, విజయ్, సాయికిరణ్, విక్రమ్, గాయక్వాడ్ చంద్రశేఖర్ మాంగ్ (రాష్ట్ర సంయుక్త కార్యదర్శి), హైదరాబాద్ కమిటీ అధ్యక్షులు కె.సుధాకర్ మాంగ్, ప్రధానకార్యదర్శి ఎస్.దిలీప్ మాంగ్, సిఎచ్. ఉద్ధవ్ మాంగ్, కె.అనిల్ మాంగ్, ఎన్.సాయి మాంగ్, మహిళలు, విద్యార్థులు, మాంగ్ సమాజ్ సభ్యులు పాల్గొన్నారు.



# నేడు మంథని నియోజకవర్గంలో మంత్రి శ్రీధర్‌బాబు పర్యటన..

**కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు భూమి పూజ, ప్రారంభోత్సవాలు చేయనున్న మంత్రి**



రామగిరి,ఆగస్టు 01(ది క్రైమ్ న్యూస్):- మంథని నియోజకవర్గంలో తెలంగాణ రాష్ట్ర ఐటీ, పరిశ్రమలు, శాసన సభా వ్యవహారాల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్‌బాబు పర్యటించనున్నారు. మంథని నియోజకవర్గంలో కోట్ల రూపాయలతో అభివృద్ధి పనులకు భూమి పూజతో పాటుగా ప్రారంభోత్సవాలను ఆయన చేపట్టనున్నారు. శనివారం ఉదయం 8గంటలకు మల్హర్ మండలం తాడిచెర్ల గ్రామంలో రూ. 50లక్షల నిధులతో నిర్మించిన నూతన పీఏసీఎస్ భవనాన్ని, రూ. 20లక్షల నిధులతో నూతన గ్రంధాలయం భవనాన్ని, రూ. 15 లక్షలతో సిసి రోడ్లను ఆయన ప్రారంభించనున్నారు. అదే విధంగా మల్హర తహసీల్దార్ కార్యాలయ కాంపౌండ్ వాల్‌కు ఆయన శంకుస్థాపన చేయనున్నారు. ఉదయం 9గంటలకు మంథని మండలం ఎగ్లాస్ పూర్ జడ్‌పిహెచ్‌ఎస్ పాఠశాలలో నూతనంగా రూ. 2కోట్ల 70లక్షలతో నిర్మించబోతున్న బాయ్స్?? హాస్టల్ భవనాని శంకుస్థాపన చేయనున్నారు.ఉదయం 9.30గం.లకు మంథని మున్సిపాలిటీ పరిధిలో రూ. 6కోట్ల 70 లక్షలతో నిర్మించిన మంథని పెట్రోల్ బంక్ ఏరియా, పెద్దపల్లి రోడ్డు, గోదావరిఖని రోడ్డు నూతనంగానే నెలకొల్పబడిన సెంట్రల్ లైటింగ్ ను ప్రారంభోత్సవము చేయనున్నారు. ఉదయం 10గం.లకు సింగరేణి సిఎస్ఆర్ నిధులతో 10వ తరగతి విద్యార్థులకు ఉపయోగపడే క్యూఆర్ కోడ్స్?? మెటీరియల్స్?? ప్రభుత్వ కాలేజీ గ్రౌండ్ లోని ప్రభుత్వ హైస్కూల్‌లో మంత్రి చేతుల మీదుగా విద్యార్థులకు అందజేయనున్నారు. అటవీ శాఖ, మంథని మున్సిపాల్టీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వన మహొత్సవం కార్యక్రమంలో పాల్గొననున్నారు. ఉదయం 10.30గం.లకు మంథని మండల పరిషత్ కార్యాలయం వద్ద నమూనా ఇందిరమ్మ ఇంటిని, మంథని మునిసిపాలిటీలో త్వరలో రూ. 20 కోట్ల 50లక్షలతో ప్రతి లబ్ధిదారునికి 5లక్షల ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు నిర్మించబోతున్న 410 ఇల్లులకు పైలాన్ శంకుస్థాపన కార్యక్రమాన్ని మంత్రి శ్రీధర్ బాబు చేతుల మీదుగా ప్రారంభోత్సవం చేసి అక్కడే ఎంజీఎన్ఆర్ఈజీఎస్ నిధుల నుండి నూతన గ్రామపంచాయతీ భవనాలకు కోటి 40 లక్షలతో మంథని మండలంలోని అడవి సోమనపల్లి, ఖానాపూర్, మల్లేపల్లి, అరెంద, గోపాల్ పూర్, ఉప్పట్ల, తోటగోపయ్యపల్లి గ్రామపంచాయతీ నూతన భవనాలకు శంకుస్థాపన చేయనున్నారు. మధ్యాహ్నం 11గం.లకు మంథనిలోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నిక కాబడిన వ్యవసాయ కమిటీ చైర్మన్, పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొంటారు. ఉదయం 12గంటలకు మంథని మున్సిపాల్టీ పరిధిలోని గంగాపురి వద్ద ఆర్ఆర్ గార్డెన్ లో తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో నూతన రేషన్ కార్డుల పంపిణీ కార్యక్రమం మంథని, రామగిరి, ముత్తారం, కమాన్ పూర్ నాలుగు మండలాల లబ్ధిదారులు 308మందికి రూ. 1కోటి 8లక్షలు విలువ చేసే చెక్కులను,14 కల్యాణ లక్ష్మి చెక్కుల లబ్ధిదారులకు మంథని ఆర్ఆర్ గార్డెన్‌లో మంత్రి చేతుల మీదుగా అందజేయనున్నారు. అక్కడే ఇందిరా మహిళా శక్తి ఆధ్వర్యంలో నిర్వహించే వేడుకల్లో ఆయన పాల్గొననున్నారు. మధ్యాహ్నం 2గం.లకు రామగిరి మండలం కల్వచర్ల గ్రామంలో రూ. 2కోట్ల 60లక్షల నిధులతో నిర్మించిన కల్వచర్ల నుండి లొంకకేసారం వరకు సీసీ రోడ్డును ప్రారంభోత్సవం చేయనున్నారు. మధ్యాహ్నం 3గం.లకు కమాన్ పూర్ లోని మార్కెట్ కమిటీ కార్యాలయం వద్ద నూతనంగా ఎన్నికైన కమాన్‌పూర్ వ్యవసాయ కమిటీ చైర్మన్, పాలకవర్గం సన్మాన కార్యక్రమంలో పాల్గొననున్నారు.

# అవినతి అధికారులపై ఫిర్యాదు చేయండి

**లంచం అడిగితే సమాచారం ఇవ్వండి**

**గత నెలలోనే 22 కేసులు నమోదు**

**ఎసిబి అధికారుల వెల్లడి**

హైదరాబాద్,ఆగస్ట్1 : ప్రభుత్వ శాఖల్లో విధులు నిర్వర్తించే అధికారులు, సిబ్బంది లంచం డిమాండ్ చేస్తే వెంటనే తమకు ఫిర్యాదు చేయాలని రాష్ట్ర ప్రజలకు తెలంగాణ అవినీతి నిరోధక శాఖ ఉన్నతాధికారులు శుక్రవారం హైదరాబాద్‌లో సూచించారు. అవినీతిని నిరోధించేందుకు ప్రజల్లో అవగాహన కల్పించేందుకు విస్తృతంగా కార్యక్రమాలు చేపడుతున్నట్లు- వివరించారు. అందులో భాగంగా బహిరంగ ప్రదేశాల్లో పోస్టర్లు, స్టిక్కర్లు ద్వారా అవినీతికి వ్యతిరేకంగా ఫిర్యాదులు చేసేలా ప్రజలను అప్రమత్తం చేస్తున్నామన్నారు. అయితే రాష్ట్రంలో అవినీతి అధికారులపై మెరుపు దాడులు చేసినట్లు- చెప్పారు. ఆ క్రమంలో 2025 జులై మాసంలో మొత్తం 22 అవినీతి కేసులు నమోదు చేసినట్లు తెలిపారు. ఆ జాబితాలో ట్రాప్ చేయడం, లెక్కకు మించిన ఆదాయం కలిగి ఉండడం, క్రిమినల్ మిస్ కండక్ట్ తదితర కేసులు ఉన్నాయని పేర్కొన్నారు. ట్రాప్ కేసుల్లో రూ.5.75 లక్షలు, లెక్కకు మించిన ఆదాయం కేసులో రూ.11.5కోట్ల విలువైన ఆస్తులు వెలుగులోకి వచ్చాయన్నారు. అలాగే ఆర్టీఏ, చెక్ పోస్టులు, సబ్ రిజిస్ట్రార్ తదితర కార్యాలయాల్లో ప్రత్యేక తనిఖీలు చేపట్టినట్లు- తెలిపారు. ఆ సమయంలో లెక్కల్లోకి రాని రూ.1.49 లక్షల నగదు స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. అయితే ఈ ఏడాది జనవరి నుంచి జులై మాసం వరకు 148 కేసులు నమోదు చేసినట్లు- తెలిపింది. ఈ కేసులో ప్రమేయం ఉన్న మొత్తం 145 ప్రభుత్వ ఉద్యోగులు ఔట్ సోర్సింగ్ సిబ్బందిని అరెస్ట్ చేశామన్నారు. అలాగే మొత్తం రూ.30.32 లక్షలు ట్రాప్ కేసుల్లో స్వాధీనం చేసుకున్నామని చెప్పారు. లెక్కకు మించిన ఆదాయం కేసుల్లో ఆస్తుల విలువ రూ.39కోట్లకు పైగా ఉందన్నారు. మరోవైపు నీటి పారుదల శాఖలో పలువురు ఇంజనీర్లు.. ఇంజనీర్ ఇన్ చీఫ్ మరళీధర్ రావు, నూనె శ్రీధర్‌తోపాటు- మరో ఇంజనీర్ హరిరామ్‌ను ఏసీబీ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ ముగ్గురు అధికారుల వద్దే దాదాపు రూ.1000 కోట్లకు పైగా అవినీతి నగదు ఉన్నట్లు- ఈ సందర్భంగా ఏసీబీ అధికారులు నిర్ధారించారు.

# భూములివ్వం.. తెగేసి చెప్పిన రైతులు

**-రత్నాపూర్‌లో ఇండస్ట్రియల్ పార్క్ 203.31 ఎకరాల భూసేకరణ**

**-రత్నాపూర్‌లో భూసేకరణ గ్రామసభ**

**-గ్రామసభకు హాజరైన ఆర్డీవో, తహసిల్దార్**

**-అధికారులు మాట్లాడుతుండగానే గ్రామస్తుల నిరసన**





రామగిరి, ఆగస్టు 01(ది క్రైమ్ న్యూస్):- రామగిరి మండలం రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలోని రామగిరి ఖిల్లా మేడిపల్లి శివారులోని భూములను ప్రభుత్వానికి ఇవ్వమని రైతులు తేల్చి చెప్పారు. ఈ మేరకు రత్నాపూర్ గ్రామపంచాయతీ పరిధిలో ఇష్టబ్లిష్మెంట్ అఫ్ ఇండస్ట్రియల్ పార్క్/ ఎమ్ఎస్ఎమ్ఈ పార్క్ సంబంధించి గ్రామపంచాయతీ ఆవరణలో గ్రామ సభ (ప్రజాభిప్రాయ సేకరణ) కార్యక్రమమును మంథని డివిజనల్ అధికారి కాసబోయిన సురేష్, రామగిరి తాసిల్దార్ పి.సుమన్ నిర్వహించారు.రామగిరి మండలం రత్నాపూర్‌లో పారిశ్రామిక పార్కు కోసం భూసేకరణ కోసం అభివృద్ధి కోసం ప్రభుత్వం 203 ఎకరాలను గుర్తించింది, అందులో 147 ఎకరాల పట్టా భూమి, 56 ఎకరాల ప్రభుత్వ పట్టా భూమి ఉన్నాయి. పరిశ్రమల పేరుతో మా భూములను లాక్కొని మా బతుకులను రోడ్డుపాలు చేయొద్దని మేడిపల్లి రైతులందరూ కలిసి శుక్రవారం ప్రజాభిప్రాయ సేకరణ గ్రామసభలో ఆర్డీవోకి తమ గోడు వెళ్లబుచ్చారు. తరతరాల నుంచి సాగు చేసుకుంటున్న భూములను కంపెనీల కోసం ఇచ్చేది లేదని తేల్చి చెప్పారు. ప్రభుత్వం పరిహారం ఆశ చూపి మోసం చేసేందుకు ప్రయత్నిస్తుందని ఆరోపించారు. వ్యవసాయమే జీవనాధారం మేము భూములు ఇవ్వ%శీ% పరిహారం వద్దు అని రైతులందరూ వినతి పత్రంపై సంతకాల సేకరణ చేస్తూ పారిశ్రామిక పార్కు కోసం భూసేకరణకు వ్యతిరేకంగా గ్రామస్తులు నిరసన తెలిపారు.తమ భూములను ఇవ్వడానికి నిరాకరించి, స్థానిక నివాసితులు నిరసన వ్యక్తం చేశారు. గతంలో కృషి విజ్ఞాన కేంద్రం కోసం అప్పటికి తమ భూములు కోల్పోయామని ఇప్పుడు మిగిలిన భూములను కూడా తీసుకుంటే ఎలా అంటూ ఆవేదన వ్యక్తం చేశారు. మాకు అభివృద్ధి వద్దు పరిశ్రమలు వద్దు ఉద్యోగాలు అంతకంటే వద్దు మా బ్రతుకులు మేము బతుకుతామని మా జీవితాలు నాశనం అయ్యేలా అధికారులు నిర్ణయాలు తీసుకోవద్దని కోరారు. భూసేకరణ ప్రక్రియలో భాగంగా, ప్రభుత్వ అధికారులు, పోలీసు సిబ్బంది శుక్రవారం గ్రామాన్ని సందర్శించారు. తమ భూములను ఇవ్వడానికి నిరాకరించిన స్థానిక నివాసితులు నిరసన వ్యక్తం చేశారు. పారిశ్రామిక పార్కు కోసం తమ భూమిని ఇచ్చే ప్రశ్నే లేదని, ప్రభుత్వం ప్రతిపాదిత పార్కును వేరే ప్రదేశానికి మార్చాలని నిర్ణయించే వరకు ఆందోళన కొనసాగిస్తామని వారు అన్నారు. ఈ సందర్భంగా రైతుల అభ్యంతరాలను ప్రభుత్వం దృష్టికి అధికారుల దృష్టికి తీసుకెళ్తామని రైతులకు తెలిపారు. ఈ కార్యక్రమంలో పోలీస్ అధికారులు, గ్రామ ప్రజలు, రైతులు, గ్రామ పంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

# సాగునీటి జలాలపై అవగాహన తెచ్చుకోండి



**బనకచర్లపై ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ఎలా**

**ఇదేమీ ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదని గుర్తుంచుకో**

**నదీజలాల కేటాయింపులు తెలిసి మాట్లాడాలి**


**కాళేశ్వరంను అడ్డుకోవడానికి చంద్రబాబు లేఖలు రాసారు**

**లోకేశ్ వ్యాఖ్యలపై మండిపడ్డ బిఆర్ఎస్ ఎమ్మెల్యే హరీష్ రావు**

హైదరాబాద్ : సాగునీటి జలాల్లో నారా లోకేశ్‌కు అవగాహనం లోపం ఉందని, ఆయన యంగ్‌స్టర్.. భవిష్యత్‌ను చెడగొట్టుకుంటున్నారని, అవగాహన లేకుండా మాట్లాడి ప్రజల ముందు అభాసుపాలు కావద్దని, ఆంధ్రప్రదేశ్ విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్‌పై బిఆర్ఎస్ నేత, సిద్దిపేట ఎమ్మెల్యే హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. ఇది ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ కాదు.. పొక్కలు కొట్టేందుకు అని నారా లోకేశ్‌కు హరీశ్‌రావు వార్నింగ్ ఇచ్చారు. బనకచర్ల ప్రాజెక్టుపై తెలంగాణ భవన్‌లో హరీశ్‌రావు మీడియాతో మాట్లాడారు. గురువారం నారా లోకేశ్ మాట్లాడుతూ.. మిగులు జలాలు సముద్రంలో కలుస్తున్నాయి.. కనబడుతలేదా అంటున్నాడు. అధికారం ఉంది కదా.. మందబలం ఉంది.. సీఎం రేవంత్, కేంద్రం మా చేతుల్లో ఉన్నారని ఏది మాట్లాడితే అది మాట్లాడితే చెల్లుతదనుకుంటే పొరపాటని అన్నారు. మిగులు జలాలు సముంద్రంలో కలుస్తున్నాయి అంటున్నారు కదా.. ఒక వేళ నీళ్లు ఉన్నదే నిజమైతే కేంద్ర ప్రభుత్వ సంస్థలు సెంట్రల్ వాటర్ కమిషన్ మీ డీపీఆర్‌ను ఎందుకు తిప్పి పంపింది. గోదావరి రివర్ మేనేజమెంట్ బోర్డు ఎందుకు తిప్పి పంపింది. కేంద్ర ప్రభుత్వ పర్యావరణ మంత్రిత్వ శాఖ కూడా తిరస్కరించింది. నీళ్లు ఉన్నది నిజమైతే నాలుగు కేంద్ర సంస్థలు బనచర్లకు ఎందుకు తిరస్కరించాయో లోకేశ్ సమాధానం చెప్పాలి. గోదావరిలో తెలంగాణ వాటా ఎంత..? ఏపీ వాటా ఎంతో సమాధానం చెప్పాలని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు డిమాండ్ చేశారు. కాళేశ్వరం ప్రాజెక్టుకు పొక్క కొట్టి తీసుకుపోతున్నామా..? పొక్క కొట్టేందుకు ఇది ఏమైనా శ్రీశైలం ప్రాజెక్టా..? పోతిరెడ్డిపాడు ప్రాజెక్టా..? ఇది ఏమైనా ఉమ్మడి ఆంధ్రప్రదేశా..? కాళేశ్వరం ఒక లిఫ్ట్ ఇరిగేష్ ప్రాజెక్టు.. దీనికి పొక్క కొట్టుడు, చిల్లు కొట్టు-డు ఉండదు. ఆనాడు ఉమ్మడి ఏపీలో ఈనాటి కాంగ్రెస్ నేతలు పదవుల కోసం పెదవులు మూసుకోవడం వల్ల మీరు ఆడిందే ఆట పాడిందే పాట.. పోతిరెడ్డి పాడుకు పొక్క కొట్టి నీళ్లు తీసుకుపోయారు.. ఈనాటి కాంగ్రెస్ నాయకుల మౌనం వల్ల తెలంగాణకు తీవ్ర అన్యాయం జరిగింది. కానీ ఇక్కడున్నది బీఆర్ఎస్ పార్టీ. తెలంగాణ రాష్ట్రంగా ఉంది. ఇష్టమొచ్చినట్టు- పొక్క కొడుతాం అంటే చూసుకుంటూ ఊరుకోం అని నారా లోకేశ్‌ను హరీశ్‌రావు హెచ్చరించారు. నారా లోకేశ్ అన్ని అబద్ధాలు మాట్లాడుతున్నాడు.కాళేశ్వరం ప్రాజెక్టుకు అనుమతి లేదని మాట్లాడుతున్నాడు. ఒకటి కాదు రెండు కాదు 11 అనుమతులు ఉన్నాయి. అన్ని రకాల అనుమతులు సాధించి కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించింది బీఆర్ఎస్ ప్రభుత్వం. మీకు అనుమానం ఉంటే ఈ అనుమతుల లేఖలు పంపిస్తాను వెరిఫై చేసుకోండి అని హరీశ్‌రావు సూచించారు. కాళేశ్వరం ప్రాజెక్టును ఎప్పుడైనా అడ్డుకున్నామా..? టీడీపీ అడ్డుకొలేదు. తెలుగు ప్రజలంతా ఒక్కటే అని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడు. మీకు తెల్వకపోతే మీ నాన్నను అడగండి.. కాళేశ్వరం ప్రాజెక్టును అడ్డుకున్నామా..? లేకపోతే ఎన్నిసార్లు అడ్డుకున్నాం అని మీ నాన్నను అడగండి. అన్ని అనుమతులు వచ్చిన తర్వాత 2018లో రద్దు చేయండి, పనులు నిలిపివేయండి అని కేంద్రానికి సీఎం చంద్రబాబు లేఖ రాశారు. కాళేశ్వరం ప్రాజెక్టును వ్యతిరేకిస్తూ బాబు ఏడు లేఖలు రాశారు. నిన్ననేమో మేం కాళేశ్వరం వ్యతిరేకించామా..? అని లోకేశ్ సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడని హరీశ్‌రావు తీవ్రస్థాయిలో మండిపడ్డారు.మాజీ మంత్రి హరీష్ రావు సీఎం రేవంత్ రెడ్డిపై తీవ్ర విమర్శలు గుప్పించారు. హరీష్ రావు మాట్లాడుతూ.. ‘బనకచర్ల కట్టి తీరుతాం అని లోకేష్ మాట్లాడుతున్నారు.. కేంద్రం బలం, రేవంత్ రెడ్డి బలం చూసుకొని లోకేష్ మాట్లాడుతున్నారు.. లోకేష్ అలా మాట్లాడినా రాష్ట్ర ప్రభుత్వం ఇప్పటి వరకు స్పందించ లేదు.. సీఎం, మంత్రులు ఎవరూ కూడా ఖండించలేదు..ఎందుకు రాష్ట్ర ప్రభుత్వం నోరు మూసుకొని ఉంది.. మేము కడితే ఎవరు ఆపుతారో చూస్తాం అని లోకేష్ అంటుంటే ..బనకచర్ల కట్టట్లేదు అని రేవంత్ రెడ్డి అంటున్నాడు.. బనకచర్ల పై లోకేష్ బరితెగింపు మాటలు మాట్లాడుతున్నారు...సాగునీటి ప్రాజెక్టుల పై లోకేష్ అవగాహన లేకుండా మాట్లాడుతున్నారని మండి పడ్డారు. కృష్ణా నీళ్లను తరలించి నట్టుగా గోదావరి నీళ్లను తరలించుకు పోవాలని చూస్తున్నారు.. బనకచర్ల ప్రాజెక్టు ఎలా అడ్డుకోవాలో మాకు తెలుసు.. మా హక్కులకోసం మేము మాట్లాడుతున్నాం.. మాకు హక్కులకు ఇబ్బంది కలగకుండా చేసుకుంటే మేము మాట్లాడము.. ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొడు తున్నాం అని మాట్లాడుతున్నారు.. తెలంగాణ ప్రజలకు కడుపు లేదా.. మా నీళ్లు మాకు రావొద్దా.. బతుకు దెరువు కోసం అడిగితే ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టడమా.. బాబ్లీ గురించి కొట్లాడిన మీ నాన్న కూడా ప్రాంతీయ విద్వేషాలు రెచ్చగొట్టి నట్టేనా.. అవసరం అయితే బీఆర్ఎస్ పార్టీ సుప్రీం కోర్టు కు వెళుతుంది.. బనకచర్ల ప్రాజెక్టు ఆపే వరకు పోరాడతాము.. మీరు కట్టి తీరుతాం అంటే మేము అడ్డుకొని తీరుతాం.. తెలంగాణ ను అడ్డుకుంటే ఎలా తెచ్చుకున్నామో తెలుసు కదా.. కేంద్రం నీ చేతిలో ఉంది కాబట్టి సీడబ్ల్యూసీ ని ఒప్పిస్తాం అంటున్నావు.. లీగల్ గా కోట్లాడి బనకచర్ల ఆపుతామని హరీష్ రావు స్పష్టం చేశారు. అసలు నారా లోకేశ్ వ్యాఖ్యలపై సీఎం రేవంత్ ఎందుకు నోరు మెదపడం లేదని హరీశ్‌రావు సూటిగా ప్రశ్నించారు.లోకేశ్ బనకచర్ల ప్రాజెక్టు కట్టి తీరుతాం అనుమతులు తెచ్చి తీరుతాం అని మాట్లాడితే కాంగ్రెస్ ప్రభుత్వం ఎందుకు స్పందించడం లేదు. సీఎం రేవంత్ రెడ్డి, ఇరిగేషన్ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి ఎవరూ మాట్లాడరు ఖండించరు. దీన్ని బట్టి కాంగ్రెస్, టీడీపీ, బీజేపీ లోపాయికారి ఒప్పందం చేసుకున్నారని అర్థమవుతుంది. చంద్రబాబు బుల్డోజింగ్ విధానాలకు కాంగ్రెస్ బీజేపీ వంత పాడుతున్నాయి. మీరు సహకరించడం వల్లే లోకేశ్ ధైర్యంగా మాట్లాడుతున్నారు అని హరీశ్‌రావు నిప్పులు చెరిగారు. సీఎం రేవంత్ తన పదవిని కాపాడుకోవడం కోసం.. బీజేపీ తమ పీఠాన్ని ఢిల్లీలో కాపాడుకునేందుకు టీడీపీకి సహకరిస్తున్నారని హరీశ్‌రావు పేర్కొన్నారు.

# నూతన బాధ్యతలు స్వీకరించిన ఎస్సై యం.తేజం రెడ్డి.

గుండాల ఆగస్టు 01( ది క్రైమ్ న్యూస్) : గుండాల మండల పోలీస్ స్టేషన్ లో బుధవారం రోజున ఎస్సైగా నూతన బాధ్యతలు స్వీకరించిన యం తేజం రెడ్డిని గుండాల వికలాంగుల హక్కుల సమితి నాయకులు మర్యాద పూర్వకంగా కలిసి నూతనంగా బాధ్యతలు స్వీకరించినందుకు శుభాకాంక్షలు తెలిపి శాలువాతో సన్మానించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. ఎస్సై తేజం రెడ్డి సేవలు గుండాల మండల ప్రజానీకానికి ఉపయోగపడాలని ఆశాభావం వ్యక్తం చేశారు.ఇ కార్యక్రమంలో బలయ్య,వెంకటేష్ యాదగిరి, మరియు యాదాద్రి భువనగిరి జిల్లా వికలాంగుల హెల్పింగ్ సొసైటీ అధ్యక్షుడు సింగారం రమేష్, తదితరులు పాల్గొన్నారు.



# సంపాదకీయం

## విపత్తు సాయం కోసం ప్రత్యేక దళం !

విపత్తుల సమయంలో సకాలంలో స్పందించేలా వ్యవస్థను పటిష్టం చేసుకోవాల్సిన అవసరం ఉంది. విపత్తు నిర్వహణకు కూడా ఆర్మీలాంటి దళాన్ని ఏర్పాటు చేసి శిక్షణ ఇస్తే మంచిది. భూకంపాలు, అగ్నిప్రమాలు, వరదలు లాంటి ప్రమాదాల సమయాల్లో తక్షణం స్పందించేలా శిక్షణ ఇవ్వాల్సి ఉంటుంది. దేశంలో ఎక్కడ ఏ మూల ప్రమాదం జరిగినా సహాయక చర్యలకు దిగేలా తీర్చిదిద్దాలి. ఇలాంటి దళాలను ఏర్పాటు చేయడంతో పాటు,ఆర్థిక సంపత్తిని కూడా కట్టిబెడితే మంచిది. దీనిద్వారా విపత్తు నిర్వహణతో పాటు, నిరుద్యోగ సమస్యకూడా కొంతమేర తీరవచ్చు. విపత్తు నిర్వహణ అన్నది ఉమ్మడి వ్యవహారంగా ఉంటనే ఏదైనా ప్రమాదం జరిగినప్పుడు తక్షణం ఆదుకునేలా చర్యలు తీసుకునే అవకాశం ఉంటుంది. దీనికి ప్రత్యేక యంత్రాంగం ఏర్పాటు చేసుకోవాలి. ప్రత్యేకంగా నిధులను సమకూర్చాలి. లేదా కేంద్ర,రాష్ట్రాలు ఉమ్మడిగా నిధులు సమకూర్చాలి. అలాగే దీనిని సైన్యంలో ఒక భాగంగా చేస్తే మంచి ఫలితాలు వస్తాయి. భారత్ లాంటి దేశానికి ఇది తక్షణావసరమని పాలకులు గుర్తించాలి. ఇప్పటివరకు జరిగిన అనేక విప్తతులను దృష్టిలో పెట్టుకుని తగిన తర్ఫీదు ఇచ్చి స్వయం శక్తిగా దీనిని రూపొదించాలి. దేశంలో ఎక్కడ ఏ మూలన ఎలాంటి ఉపద్రవం వచ్చిపడినా తక్షణం రంగంలోకి దిగేలా అన్ని రాష్ట్రాల్లో సన్నద్ధంగా ఉండేలా చూడాలి. ఈ దిశగా ఆలోచ నలు చేసి ఆచరణకు సిద్దపడాలి. ఎన్డీఆర్ఎఫ్ దళాలు ఉన్నా దానిని మరితంగా పటిష్టం చేయాలి. దీనికి ఆర్టీ తరహా వ్యవస్థ అవసరం ఉంది. దేశంలో ఏ మూల ఎలాంటి ఉపద్రవం ముంచుకుని వచ్చినా సకాలంలో చేరుకుని సేవలు అందించే విధంగా తయారు కావాల్సి ఉంది. రైలు ప్రమాదాలు కావచ్చు.. వరదలు, భూకంపాలు వంటి ప్రకృతి వైపరీత్యాల సమయంలో సకాలంలో సత్వర సేవలు అందించే వీలు కలుగుతుంది. ఇటీవలి వరదలు, రైలు ప్రమాదాలు చూశాక శిక్షిత సిబ్బందంది అవసరముందని తెలుస్తోంది. దానికి సాంకేతికంగా సహాయ సహకారం అందించాలి. ప్రస్తుతానికి విపత్తులను ఎదుర్కోవడంలో ఆయా రాష్ట్రాల ప్రభుత్వాలు అనుసరించిన మార్గాలే ఇప్పుడు శరణ్యంగా మారాయి. ఈ దుస్తితి పోవాలంటే ఓ అత్యున్నత వ్యవస్థ అవసరం అన్నది గుర్తించాలి. కేంద్రరాష్ట్రాలు ఇందుకు ముందుకు రావాలి. ఉమ్మడిగా వ్యవస్థను తయారు చేసుకోవాలి. దీనిని ఆర్మీలో భాగంగా చేస్తే మరీ మంచిది. సాధారణ ఆర్మీ ఇలాంటి సమయాల్లో అంతగా పనిచేయకపోవచ్చు. కానీ అప్పుడు ఎక్కడ ఏ ఉపద్రవం వచ్చినా రంగంలోకి దిగేలా అవకాశం ఉంటుంది. ఏటా దేశవ్యాప్తంగా భారీ వర్షాల కారణంగా వరదలు ముంచెత్తుతున్నాయి. భారీ వర్షాల మూలంగా పెద్దయెత్తున నీరు వచ్చి చేరుతుండడంతో ప్రధానమైన డ్యాముల గేట్లను తెరవాల్సి రావడంతో దిగువన ఉన్న లోతట్టు ప్రాంతాలు జలదిగ్బంధనంలో చిక్కుకుని విలవిల్లా డుతున్నాయి. విపత్తుల సమయంలో స్వతంత్ర వ్యవస్థ రంగంలోకి దిగి ప్రజలను కాపాడడంతో పాటు, సహయాక చర్యల్లో నిమగ్నమయ్యేలా ఉంటే విమర్శలకు ఆస్కారం ఉండదు. హిమాచల్ ప్రదేశ్, మహారాష్ట్ర, కర్నాటక, కేరళ తమిళనాడు, తెలంగాణ, ఎపిల్లో ఏటా కుండపోతగా కురుస్తున్న వర్షాలతో ప్రజాజీవనం అతలాకుతలం అవుతున్నాయి. పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు, విరిగిపడుతున్న కొండ చరియలు, తెగిపోయిన రోడ్లు సాధారణ పౌర జీవనాన్ని అతలాకుతలం చేస్తున్నాయి. లోతట్టు ప్రాంత ప్రజలను సకాలంలో సహాయక శిబిరాలకు తరలించడం, ప్రాణనష్టాన్ని తగ్గించగలగడం అన్నది ఇలాంటి సమయాల్లో ముఖ్యం. పునరావాస శిబిరాల్లో బాధితులకు మంచినీరు, ఆహారం, మందులు వంటి కనీస సదుపాయాలు కల్పించడం, అంటువ్యాధులు ప్రబలకుండా ముందస్తు జాగ్రత్తలు తీసుకోవడం కూడా ముఖ్యమే. ప్రత్యేక యంత్రాంగం ఉండివుంటే వెంటనే రంగంలోకి దిగి యుద్ధ ప్రాతిపదికపై సహాయక చర్యలు చేపట్టే వీలుంటుంది. ప్రస్తుత వ్యవస్థలో ముంపు ప్రాంతాల ప్రజలను సురక్షితంగా బయటకు తీసుకురావడంలో కేంద్ర, రాష్ట్ర విపత్తు, సహాయక బృందాలు ప్రశంసనీయమైన కృషిచేస్తున్నాయి. అయితే ఇందులో ప్రధాన భూమిక రాష్ట్రాలదిగానే ఉంటోంది. అలాగాకుండా వ్యవస్థ ఉంటే సాయం కోసం కేంద్రంవైపు చూడాల్సిన ఆగత్యం రాదు. ఇప్పటికే స్వచ్ఛంద సంస్థలు, సహకార సంఘాలు, చలన చిత్ర పరిశ్రమ, ఇతర రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజలు ఉదారంగా ముందుకు వచ్చి విరాళాలందిస్తున్నారు. అయితే ఏటా ఎక్కడో ఓ చోట ఇలాంటి విపత్తులు సర్వ సాధారణంగా మారిన దశలో ప్రత్యేక,శాశ్వత ఏర్పాటు అవసరాన్ని గుర్తించాలి. అసాధారణ వరదలు కావడంతో పెద్దయెత్తున ఆస్తినష్టం కలిగించాయి. ఇటీవలి వరదల్లో వేల ఎకరాల్లో పంటలు తుడిచి పెట్టుకునిపోయాయి. రాష్ట్ర విపత్తుల నిర్వహణ, సహాయక అథారిటీని పటిష్టపరచినప్పటికీ ఇప్పుడు సంభవించిన విపత్తు అసాధారణమైనది. దీనిని ఎదుర్కోవడం అంత తేలికేమీ కాదు. అయినా, పరిస్థితి తీవ్రతకు మించిన వేగంతో ప్రభుత్వం కదిలింది. నదికి ఇరువైపులా వున్న ప్రజలను ఎప్పటికప్పుడు అప్రమత్తం చేసింది. ఇకపోతే విపత్త బృందం ఉంటే నష్టం అంచనా కూడా వెంటనే గుర్తించవచ్చు. లేకుంటే కేంద్రబృందం ఎప్పుడో నెల తరవాత రావడం...పోటోలు చూడడం.. అంచనా వేయడం జరుగుతోంది. అలా గాకుండా వెంటనే నష్టం అంచనాలు కూడా జరిగిపోవాలి. సహాయక చర్యలతో పాటు పునరావాస చర్యల్లో కూడా ఈ బృందాలు పాల్గొనేలా చేయాలి. ఇలా చేస్తే మంచి ఫలితాలతో పాటు సకాలంలో సాయం అందగలదు.

# బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితా




**వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచిన ఇసి**

**సబంధిత అధికారల వద్ద అభ్యంతరాల పరిశీలన**

న్యూఢిల్లీ,ఆగస్ట్1 : బీహార్‌లో ముసాయిదా ఓటర్ల జాబితాను భారత ఎన్నికల సంఘం శుక్రవారం ప్రచురించింది. ఓటర్లు ఇసిఐ వెబ్‌సైట్‌లో వారిపేర్లను తనిఖీ చేసుకోవచ్చు. ఇసిఐ జాబితా ప్రకారం.. జూన్‌లో ఎస్ఐఆర్ ప్రారంభం కావడానికి ముందు బీహార్‌లో 7.93 కోట్ల మంది నమోదిత ఓటర్లు ఉన్నారు. అయితే తాజాగా విడుదలై ముసాయిదా జాబితాలో ఎంతమంది ఓటర్లు ఉన్నారో తెలియాల్సి వుంది. ముసాయిదా జాబితా ప్రచురణతో పాటు- ' క్లెయిమ్‌లు మరియు అభ్యంతరాల' పక్రియ కూడా ప్రారంభమైంది. ఇది సెప్టెంబర్ 1 వరకు కొనసాగనుంది. ఈ సమయంలో ముసాయిదాలో పేర్లను తప్పుగా తొలగించారనే ఫిర్యాదులు ఉన్నవారు సంబంధిత అధికారులను సంప్రదించవచ్చు. ఈ ఏడాది చివరలో బీహార్‌లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్నాయి. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఇసిఐ బీహార్‌లో చేపట్టిన ప్రత్యేక సమగ్ర ఓటర్ల సవరణపై ప్రతిపక్షాలు ఆందోళన వ్యక్తం చేస్తున్న సంగతి తెలిసిందే. బిహార్‌లో అసెంబ్లీ ఎన్నికలకు సిద్ధమవుతున్న కేంద్ర ఎన్నికల సంఘం.. ఇటీవల రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ (ఎస్ఐఆర్)ను చేపట్టిన సంగతి తెలిసిందే. ఆ పక్రియ అనంతరం ఓటరు ముసాయిదా జాబితాను ఈసీ శుక్రవారం విడుదల చేసింది. దీన్ని ప్రధాన రాజకీయ పార్టీలకు అందజేసింది. అయితే, ప్రస్తుతానికి ఈ ముసాయిదా జాబితాలో చేర్చిన వివరాలు ఇంకా వెబ్‌సైట్‌లో పూర్తిగా అందుబాటులోకి రాలేదు. కానీ, ఓటర్లు ఈసీ వెబ్‌సైట్‌లో తమ పేర్లను చెక్ చేసుకోవచ్చని అధికారులు వెల్లడించారు. ఈ జాబితాలో సవరణలకు నెల రోజులు అంటే సెప్టెంబరు 1 వరకు గడువు కల్పించారు. అర్హులైన వ్యక్తుల పేర్లను జాబితాలో చేర్చడానికి, అనర్హులుగా భావించినవారి పేర్లను తొలగించడానికి పౌరులు, రాజకీయ పార్టీలు ఈలోగా ప్రతిపాదనలు చేయొచ్చని అధికారులు స్పష్టంచేశారు. ముసాయిదా జాబితాను రాష్ట్రవ్యాప్తంగా అన్ని జిల్లాల్లో.. గుర్తింపు పొందిన పార్టీలకు అందజేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ ప్రత్యేక సమగ్ర సవరణకు ముందు రాష్ట్రంలో 7.93 కోట్ల మంది ఓటర్లు ఉన్నారు. అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో ఈ సవరణ చేపట్టగా.. కీలక విషయాలు బయటపడిన సంగతి తెలిసిందే. రాష్ట్రంలో 52 లక్షల మంది ఓటర్లు సంబంధిత చిరునామాల్లో లేరని వెల్లడైంది. 18 లక్షల మంది ఓటర్లు చనిపోగా, 26 లక్షల మంది ఇతర నియోజక వర్గాలకు మారినట్లు- ఈసీ తెలిపింది. మరో ఏడు లక్షల మంది ఓటర్లు రెండుచోట్ల ఓటు- నమోదు చేసుకున్నట్లు- అధికారుల పరిశీలనలో తేలింది. అయితే, ఈ సమగ్ర సవరణను కాంగ్రెస్ సహా ప్రతిపక్షాలు తీవ్రంగా ఖండిస్తున్నాయి. ఉద్దేశపూర్వకంగానే ఓటర్లను తొలగిస్తున్నారని దుయ్యబట్టాయి. దీనిపై సుప్రీంకోర్టును ఆశ్రయించాయి. ప్రస్తుతం ఈ వ్యవహారం అత్యున్నత న్యాయస్థానం వద్ద పెండింగ్‌లో ఉంది.

## ఎస్ఎస్‌సీ పరీక్ష నిర్వహణలో లోపాలు.. విద్యార్థుల నిరసన

న్యూఢిల్లీ: ఎస్ఎస్‌సీ పరీక్ష నిర్వహణలో లోపాలపై విద్యార్థులు నిరసన తెలిపారు. సర్వర్ క్రాష్ వంటి సాంకేతిక సమస్యల వల్ల పలు కేంద్రాల్లో ఆన్‌లైన్ ఎగ్జామ్ క్యాన్సిల్ అయ్యిందని పలువురు అభ్యర్థులు ఆరోపించారు. ఎస్ఎస్‌సీ సెలక్షన్ పోస్ట్ ఫేజ్ 13 రిక్రూట్‌మెంట్ టెస్ట్ జూలై 24న ప్రారంభమై ఆగస్ట్ 1న ముగిసింది. అయితే దేశ వ్యాప్తంగా పలు పరీక్షా కేంద్రాల్లో సాంకేతిక సమస్యలు, ఇబ్బందులు తలెత్తాయి. సర్వర్ క్రాష్ కావడం వల్ల ఆన్‌లైన్ ఎగ్జామ్ మధ్యలో రద్దైంది. కంప్యూటర్లు మొరాయించడం, మౌస్‌లు పనిచేయకపోవడం వంటి ఇబ్బందులను అభ్యర్థులు ఎదుర్కొన్నారు. కాగా, కొందరు అభ్యర్థులను 500 కిలోమీటర్ల దూరంలో ఉన్న పరీక్షా కేంద్రాలకు పంపారు. అక్కడ కూడా సాంకేతిక సమస్యల వల్ల ఆన్‌లైన్ ఎగ్జామ్స్‌ను రద్దు చేశారు. కొన్ని సెంటర్స్ వద్ద ఆందోళన చేసిన వారిపైకి బౌన్సర్లను ఉసిగొల్పినట్లు అభ్యర్థులు విమర్శించారు. మూడు లక్షల మంది విద్యార్థులు ఈ పరీక్ష కోసం రిజిస్టర్ చేసుకోగా 55,000 మంది ఇబ్బందులు ఎదుర్కొన్నారని, సమస్యల గురించి ఎస్ఎస్‌సీకి ఫిర్యాదు చేసినట్లు అభ్యర్థులు తెలిపారు. మరోవైపు ఎస్ఎస్‌సీ సెలక్షన్ పోస్ట్ ఫేజ్ 13 రిక్రూట్‌మెంట్ టెస్ట్‌లో నిర్వహణ లోపాలపై చలో ఢిల్లీకి విద్యార్థులు పిలుపునిచ్చారు. జంతర్‌మంతర్ వద్ద నిరసన చేపట్టారు. శాంతియుతంగా నిరసన చేస్తున్న తమపైకి పోలీసులు బలప్రయోగం చేశారని విద్యార్థులు ఆరోపించారు. కాగా, బ్లాక్‌లిస్ట్ చేసిన కంపెనీకి ఎగ్జామ్ నిర్వహణ టెండర్‌ను ప్రభుత్వం ఇచ్చిందని విమర్శించారు. తమ భవిష్యత్తును నిర్ణయించే పరీక్షలను ఇలాంటి సంస్థకు ఎలా అప్పగిస్తారని ప్రశ్నించారు. పరిపాలనా లోపాలు, సాంకేతిక వైఫల్యాలను పరిష్కరించాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో నిరసనను తీవ్రం చేస్తామని విద్యార్థి సంఘాలు హెచ్చరించాయి.



## మాలెగావ్ కేసులో కొత్త విషయాలు

**ఆర్ఎస్ఎస్ చీఫ్ భగవత్ అరెస్ట్‌కు అప్పట్లో కుట్ర**

**మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ ప్రకటన**

న్యూఢిల్లీ,ఆగస్ట్1 : దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన 2008 నాటి మాలేగావ్ బాంబు పేలుళ్ల కేసులో నిందితులందరినీ ముంబయిలోని ప్రత్యేక కోర్టు నిర్దోషులుగా ప్రకటించిన క్రమంలో కొత్త విషయాలు వెలుగులోకి వస్తున్నాయి. నాటి యూపిఎ హయాంలో జరిగిన ఈ కేసులో సాధ్వి ప్రజ్ఞా ఠాకూర్‌పై నేరం మోపారు. తాజా తీర్పుతో ఆమెతో పాటు పలువురు నిర్దోషులుగా తీర్పువచ్చింది. ఈ క్రమంలో నాటి కేసు విచారణ బృందంలో ఉన్న మాజీ ఏటీఎస్ అధికారి మహబూబ్ ముజావ్ మాట్లాడుతూ కీలక ఆరోపణలు చేశారు. ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్‌ను అరెస్టు చేయాలని అప్పట్లో తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. దీంతో ఇప్పుడు ఈ విషయం సంచలనంగా మారింది. అంటే ఇదంతా కుట్రపూరితంగా సాగిందని తెలుస్తోంది. శుక్రవారం ముజావ్ ఓ వార్తాసంస్థతో మాట్లాడుతూ ఈ వ్యాఖ్యలు చేశారు. ఈ కేసు దర్యాప్తునకు సంబంధించి కొంతమంది వ్యక్తులను అరెస్టు చేయాలని తనకు ఆదేశాలు వచ్చాయని తెలిపారు. వారిలో రామ్ కల్సంగ్రా, సందీప్ దాంగే, దిలీప్ పాటిదార్‌తో పాటు- ఆర్ఎస్ఎస్ చీఫ్ మోహన్ భాగవత్ కూడా ఉన్నారన్నారు. అలాంటి ప్రభావం చూపే వ్యక్తిని అరెస్టు చేయడం అంటే అది తన శక్తికి మించిందన్నారు. ఈ కేసు దర్యాప్తు అధికారిగా ఉన్న పరమ్‌బీర్ సింగ్‌తో పాటు- మరికొంతమంది ఉన్నతాధికారులు ఈ ఆదేశాలను తనకు ఇచ్చినట్లు- ఆయన తెలిపారు. వారి సూచనల ప్రకారం.. తనకు సాయం చేసేందుకు రాష్ట్రం నుంచి దాదాపు పది మంది సిబ్బందిని సమకూర్చారన్నారు. నిధులు సమకూర్చడంతో పాటు- అధికారికంగా రివాల్వర్ కూడా జారీ చేశారని ముజావ్ తెలిపారు. అయితే, ఉన్నతాధికారుల ఆదేశాలను పాటించేందుకు నిరాకరించడంతో తనపై తప్పుడు కేసు పెట్టారన్నారు. ఆ తర్వాత వాటన్నింటిలో తాను నిర్దోషిగా బయటకు వచ్చినట్లు- వెల్లడించారు. మహారాష్ట్రలోని మాలేగావ్ ప్రాంతంలో 2008 సెప్టెంబరు 29న పేలుడు సంభవించింది. ఓ మసీదు సమీపంలో మోటార్ సైకిల్‌కు అమర్చిన బాంబు పేలడంతో ఆరుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 100 మందికి పైగా గాయపడ్డారు. అప్పట్లో ఈ కేసు పెను సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై ప్రజ్ఞా ఠాకూర్, పురోహిత్‌తో పాటు- రమేశ్ ఉపాధ్యాయ్, అజయ్ రహీర్‌కార్, సుధాకర్ ద్వివేది, సుధాకర్ చతుర్వేది, సమీర్ కులకర్ణిలను ప్రధాన నిందితులుగా పేర్కొంటూ కేసు నమోదైంది. ఈ కేసుపై ముంబయిలోని ప్రత్యేక కోర్టులో గురువారం విచారణ జరగ్గా.. నిందితులందరి నీ నిర్దోషులుగా ప్రకటించింది. ఇదంతా ఒక ఎత్తయితే ముజావ్ చేసిన ప్రకటన ఇప్పుడు ప్రకంపనలు రేపనుంది.


## కంగనా రనౌత్‌కు ఎదురుదెబ్బ..

**నటి పిటిషన్‌ను తిరస్కరించిన హైకోర్టు..!**

బాలీవుడ్ నటి, బీజేపీ ఎంపీ కంగనా రనౌత్‌కు పంజాబ్-హర్యానా హైకోర్టులో ఎదురుదెబ్బ తగిలింది. బటిండా కోర్టులో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ పరువు నష్టం దావా రద్దు చేయాలంటూ కంగనా దాఖలు చేసిన పిటిషన్‌ను హైకోర్టు తిరస్కరించింది. ఐపీసీ సెక్షన్లు 499, 500 కింద అభియోగాలు మోపారని, మేజిస్ట్రేట్ జారీ చేసిన సమన్ల ఉత్తర్వు చట్టబద్ధమైనదని జస్టిస్ త్రిభువన్ దహియా సింగిల్ బెంచ్ స్పష్టం చేసింది. వ్యవసాయ చట్టాలకు వ్యతిరేకంగా రైతులు ఉద్యమం చేపట్టిన విషయం తెలిసిందే. ఈ ఉద్యమంపై ఆమె చేసిన ట్వీట్‌పై పరువు నష్టం కేసు నమోదైంది. కంగనా చేసిన రీట్వీట్‌లో బటిండాకు చెందిన మహిందర్ కౌర్ ఫొటోలో అందులో ఉన్నది. ఢిల్లీ షాహిన్‌బాగ్ నిరసన తెలుపుతున్న మహిళలో లింక్ చేయడంపై తన పరువు భంగం కలిగించారని ఆమె కోర్టును ఆశ్రయించారు. దాంతో కోర్టు పరువు నష్టం కేసులో కంగనాకు వ్యతిరేకంగా సమన్లు జారీ చేసింది. బాధ్యతాయుతమైన పదవిలో ఉన్న కంగనా రనౌత్ మరింత బాధ్యతాయుతంగా ప్రవర్తించాలని.. అన్ని ఆధారాలను పరిశీలించిన తర్వాత చట్టపరమైన ప్రక్రియ మేరకు మేజిస్ట్రేట్ సమన్లు జారీ చేశారని హైకోర్టు పేర్కొంది. ట్వీట్‌లో ఆమె ఉద్దేశమేమీ తప్పు కాదని.. సరిగ్గానే ట్వీట్ చేసిందని కంగనా తరఫు న్యాయవాది వాదనలు వినిపించినా కోర్టు అంగీకరించలేదు. కంగనా ఆ ట్వీట్ చేయలేదని.. కేవలం రీట్వీట్ చేసిందని.. ట్వీట్‌లో గౌతమ్ యాదవ్ పేరును చేర్చలేదని.. కంగనాపై మాత్రమే పిటిషన్ దాఖలైందంటూ చేసిన వాదనలను సైతం కోర్టు తోసిపుచ్చింది. ఈ కేసు 2021 రైతు ఉద్యమం సమయంలో కంగనా ఈ ట్వీట్ చేసింది. ఆ ట్వీట్‌లో మహిందర్ కౌర్ అనే 87 ఏళ్ల వృద్ధ మహిళ రూ.200 తీసుకుని ఆందోళనకు వచ్చినట్లుగా కంగనా ట్వీట్ చేశారు.

## భక్తులకు అండగా పరమాత్ముడు!

తిరుమల : భగవంతుడు ఎల్లవేళలా తనయందు భక్తి కలిగిన వారికి ఏదో రూపంలో అండగా ఉంటూనే ఉంటారు. శరణాగతి కోరుకుంటే అభయం ఇస్తుంటాడు. భక్తితో తనను శరణు వేడుకున్న వారికి అండగా ఉంటానని మన పురాణాలు, ఉపనిశత్తులు చెబుతున్నాయి. పురాణాలు, ఇతిహాసాల్లో ప్రహ్లాదాదులంతా ఇలాగే భక్తిని చాటారు. భగవంతుడు వారికి అండగా నిలిచాడు. అంటే భక్తికి భగవంతుడు వశమవుతాడన్నది సత్యం. ప్రతిఫలాపేక్ష లేకుండా తనను కొలువుమని గీతాచార్యుడు చెప్పాడు. ఆధునిక కాలంలోనూ ఇదే పద్ధి కొనసాగుతోంది. గుడికి వెళ్లడం భక్తితో చేయాలని అంటారు. భగవంతుని మీద పరిపూర్ణమయైన ప్రేమ కలిగి ఉండడమే భక్తి. అది అమృతానంద స్వరూపం. త్యాగరూఎ మైనది అయి ఏ కోర్కెలూ లేని స్థితిలో ఉండాలి. అదే మోక్ష అని నారద భక్తి సూత్రాలు చెబుతున్నాయి. భగవద్గీతలోని 'భక్తియోగం' భక్తి తత్త్వాన్నీ, లక్షణాల్నీ విపులంగా తెలిపింది. శ్రీమద్భాగవతం భగవద్భక్తుల లక్షణాలను, భక్తి స్వరూపాన్నీ సవిస్తరంగా ఆవిష్కరించింది. మానవునికి క్రోధం, శోకం లాంటి ఎన్నెన్నో అనుభూతులు ఉన్నా ప్రేమ లాంటి మధురమైన అనుభూతి మరేదీ లేదు! ప్రేమ పొందడం కన్నా ప్రేమించడం ఇంకా మధురం. మానవునికి స్వతహాగా ప్రేమించే లక్షణం ఉన్నా... ఆ ప్రేమ ఒక వ్యక్తికో, ఒక వస్తువుకో మాత్రమే పరిమితమవుతుంది. అప్పుడప్పుడు మాత్రమే కనిపిస్తూ, స్వార్థభావంతో కలుషితమౌతూ, విచ్ఛిన్నమైపోతూ ఉంటుంది. దీనినుంచి బయటపడి ప్రేమతత్వాన్ని అలవర్చుకుంటే భగవంతుడు వశమవుతాడని పురాణాలు చెబుతున్నాయి. నిష్కామంగా ప్రేమించడాన్ని సాధన చెయ్యాలి. ఈ జగత్తులో భగవంతుడు సర్వవ్యాప్తి. సమష్టి రూపమైన భగవంతుని పట్ల... సాధకులు చేసే 'నిష్కామప్రేమ' అనే ఈ ఉపాసనాక్రమానికి కూడా 'భక్తి' అనేదే వ్యవహార నామం. భక్తి సార్వజనీనం, భేదరహితం కావడంవల్ల నిజమైన భక్తిలో లోపాలు ఉండవు. అనంతమైన భగవత్తత్వానికి అనంతమైన కళ్యాణ గుణాలు, రూపాలు, నామాలు ఉన్నాయి! వాటిలో రాముడు, కృష్ణుడు, శివుడు, లలిత తదితర సంపూర్ణ దేవతామూర్తుల్ని ఉపాసనా సౌలభ్యం కోసం వేద, పురాణాలు మనకు అందించాయి.



ఆధ్యాత్మికం

# మహాలక్ష్మి 500 సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పథకంతో పేదలకు తగ్గిన ఆర్థిక భారం



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అమలవుతున్న మహాలక్ష్మి గ్యాస్ సిలిండర్‌ను రూ.500కి అందించే పథకం అనేక నిరుపేద కుటుంబాలకు ఎంతో మేలు కలిగిస్తోంది. ఈ పథకంలో భాగంగా జిల్లాలో మొత్తం 2,36,243 గ్యాస్ సిలిండర్లు పంపిణీ చేయబడి, మొత్తం రూ. 655.19 లక్షల సబ్సిడీ మంజూరైంది. ఇది జిల్లాలోని పేద, మధ్య తరగతి కుటుంబాలకు ఎంతో ఆదా జరిగింది. ప్రత్యేకంగా రేగొండ మండలంలో అత్యధికంగా 12292 కుటుంబాలకు ఇప్పటి వరకు 41,459 సిలిండర్లు పంపిణీ చేయడం ద్వారా రూ. 121.36 లక్షల సబ్సిడీ అందించడం ద్వారా ఈ మండలం ఆదర్శంగా నిలుస్తోంది. ఇదే విధంగా భూపాలపల్లి మండలంలో 6487 మంది లబ్ధిదారులకు 23,696 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 65.19 లక్షలు, మహా ముత్తారం మండలంలో 3988 మంది లబ్ధిదారులకు 12193 సిలెండర్లు అందించడం ద్వారా 18.57.లక్షలు, మల్హార్ రావు మండలంలో 5340 మంది లబ్ధిదారులకు 20628 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 58.70 లక్షలు, ఘనపూర్ మండలంలో 5798 మంది లబ్ధి దారులకు 20822 మంది సిలెండర్లు ఇవ్వడం ద్వారా 64.26 లక్షలు, టేకుమట్ల మండలంలో 4286 మంది లబ్ధిదారులకు 13574 మంది లబ్ధిదారులకు 40.69 లక్షలు, మొగుళ్లపల్లి మండలంలో 5981 మంది లబ్ధిదారులకు19112 మంది లబ్ధిదారులకు 59.08 లక్షలు, కాటారం మండలాల్లో 6550 మంది లబ్ధిదారులకు 21619 సిలెండర్లు సరఫరా చేయడం ద్వారా 52.59 లక్షలు, మహాదేవపూర్ మండలంలో 5063 మంది లబ్ధిదారులకు18008 సిలెండర్లు సరఫరా చేయడం ద్వారా 47.48 లక్షలు, పలిమెల మండలంలో 898 మంది లబ్ధిదారులకు 1650 సిలెండర్లు 2.28 లక్షలు, చిట్యాల. మండలంలో 6111 మంది కుటుంబాలకు 19557 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 57.12 లక్షలు, భూపాలపల్లి మున్సిపాలిటీ పరిధిలో 5290 కుటుంబాలకు 23925 సిలెండర్లు ఇవ్వడం ద్వారా 67.87.లక్షలు మొత్తం 655.19 లక్షలు 500 లకే సబ్సిడీపై గ్యాస్ సౌకర్యం అందించబడింది. పేద మహిళలు వంటలో కట్టెల పొయ్యి సమస్యల నుంచి విముక్తి పొందుతున్నారు. వంటకు గ్యాస్ సదుపాయం వల్ల ఆరోగ్య పరిరక్షణతో పాటు సమయాన్ని కూడా ఆదా చేసుకోగలుగుతున్నారు. ఈ పథకంతో ఊరూరా పేద మహిళల కుటుంబాల్లో ఆనందం వెల్లివిరుస్తోంది ఇప్పటికే రెండు మూడు సార్లు గ్యాస్ సబ్సిడీ ఉపయోగించుకున్నా ప్రభుత్వం కల్పించిన సబ్సిడీ గ్యాస్ పథకం మహాలక్ష్మి ఎంతో ఉపశమనం కలిగిస్తోందని లబ్ధిదారులు వెల్లడించారు, జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పర్యవేక్షణలో ఈ పథకం విజయవంతంగా అమలవుతోంది. ప్రతి మండలంలో లబ్ధిదారులకు సకాలంలో సేవలు అందించేందుకు అధికార యంత్రాంగం నిబద్ధతతో పని చేస్తోంది. ప్రజా పాలన పథకం ద్వారా ప్రజల జీవితాల్లో మార్పు తీసుకువచ్చే దిశగా ప్రభుత్వం చేస్తున్న కృషికి గొప్ప పథకంగా ఈ పథకం ఆదర్శంగా నిలిచింది.

## ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణాలు శరవేగంగా పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలి

### ◆ భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా గణపురం మండలంలో ఎస్సి కాలనీ, బుర్రకాయలగూడెంలో ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణ ప్రగతిని ఆయన ప్రత్యక్షంగా పరిశీలించారు. అనంతరం ప్రాథమిక సహకార సంఘం ఎరువుల దుకాణం, ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, పశువుల ఆరోగ్య కేంద్రాలను, తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూము తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ ఇందిరమ్మ ఇండ్లు మంజూరైన లబ్ధిదారులతో ముకాముఖి మాట్లాడారు. నిర్మాణ పనులలో జాప్యం జరుగకుండా నాణ్యత పాటిస్తూ వేగంగా పనులు పూర్తి చేయాలని సూచించారు. లబ్ధిదారులకు నిర్మాణ పద్ధతులపై అవగాహన కల్పించి, అవసరమైన మౌలిక సదుపాయాలు సమకూర్చే దిశగా సంబంధిత శాఖలు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రతి ఇంటి నిర్మాణం పూర్తి చేసి లబ్ధిదారులు వీలైనంత తొందరగా గృహ ప్రవేశం చేసేలా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. అధికారులు, క్షేత్రస్థాయిలో నిరంతర పర్యవేక్షణ చేస్తూ సత్వరం పనులు పూర్తి అయ్యేలా పని చేస్తేనే లక్ష్యాన్ని సాధించగలమన్నారు. గణపురం మండలంలో ఇందిరమ్మ ఇండ్ల ప్రగతిని గృహ నిర్మాణ శాఖ పిడిని అడిగి తెలుసుకున్నారు. ఇసుక ఎక్కడి నుండి తెస్తున్నారని అడిగి తెలుసుకుని ఇసుక ఇబ్బందులు రాకుండా చర్యలు తీసుకోవాలని తెలిపారు. కాల్వపల్లి నుండి ఇసుక తెస్తున్నట్లు పిడి తెలిపారు. అనంతరం ప్రాథమిక పశు వైద్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. పశువుల చికిత్స కు వచ్చిన రైతులతో వైద్యసేవలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. మందులు స్టాకు ఉంచాలని, పశువులు వ్యాధులకు గురికాకుండా టీకాలు వేయాలని సూచించారు. పశు సంపదను కాపాడుకోవాలని తెలిపారు. అవసరమైన మందుల కొరకు ప్రతిపాదనలు ఇవ్వాలని పశు సంవర్ధక శాఖ డిడిని సూచించారు. ఈ సందర్భంగా లిగొర్రెల వైద్య సేవలకు వచ్చిన రైతు జిల్లా కాలెక్టర్ కు గొర్రె పిల్లను బహుకరించారు. వ్యాధులతో బాధ పడే ప్రజలు వైద్యుల సలహాలు, సూచనలతో మేరకు క్రమం తప్పక మందులు వాడాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ తెలిపారు. శు క్రవారం గణపురం ప్రాథమిక వైద్య ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా వైద్య సేవలకు వచ్చిన ప్రజలతో సేవలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మీ పేరేంటి అని గట్టయ్యను అడిగి తెలుసుకుని ఏమి సమస్య ఉంది, వైద్యులు మంచిగా చూశారా లేదా మందులు ఇచ్చారా అని అడిగి తెలుసుకున్నారు. అనంతరం లక్ష్మి అనే మహిళతో మాట్లాడారు. ఈ సందర్భంగా లక్ష్మి మాట్లాడుతూ తేలు కుట్టినందున వైద్య సేవలకు వచ్చానని తెలుపగా మెరుగైన వైద్య సేవలు అందించాలని సూచించారు. ఆసుపత్రికి వచ్చే ప్రజలకు హెల్త్ ప్రొఫైల్ తయారు చేయాలని సూచించారు. ఓపి రిజిస్టర్, స్టోర్ రూము ను పరిశీలించారు. ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని స్పష్టం చేశారు. ప్రాథమిక సహకార సంఘం ఎరువుల విక్రయ కేంద్రాన్ని తనిఖీ చేసి ఎరువుల నిల్వలు పరిశీలించారు. జిల్లాలో ఎరువుల కొరత లేదని, రైతులు అవసరం మేర తీసుకోవాలని సూచించారు. ధరల పట్టిక, స్టాకు రిజిస్టర్ పరిశీలించారు. ఈ రోజు ఇప్పటి వరకు ఎంత మంది రైతులు యూరియా తీసుకున్నారని వివరాలు అడుగగా 13 మంది రైతులకు 30 బస్తాలు యూరియా ఇచ్చామని తెలిపారు. ఎరువులు, విత్తన దుకాణాలను నిత్యం పర్యవేక్షణ చేయాలని వ్యవసాయ అధికారులను ఆదేశించారు. తహసీల్దార్ కార్యాలయంలో భూ భారతి దరఖాస్తులు, స్టోర్ రూములను పరిశీలించారు. ప్రభుత్వ మార్గదర్శకాల మేరకు భూ భారతి దరఖాస్తులు. పరిష్కరించడానికి చర్యలు తీసుకోవాలని తహసీల్దార్ ను ఆదేశించారు. నోటీసు లు జారీ, విచారణ ప్రక్రియ, దరఖాస్తులు తిరస్కరణ తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. తిరస్కరించిన దరఖాస్తు దారులకు కారణాలు తెలియచేయాలని తెలిపారు. తహసీల్దార్ కార్యాలయ సందర్శనలో కార్యాలయానికి వచ్చిన వయోవృద్ధునితో ఏ సమస్య కొరకు ? వచ్చారని అడిగి తెలుసుకుని పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని తహశీల్దార్ ను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, గృహ నిర్మాణ శాఖ పిడి లోకిలాల్, జిల్లా వ్యవసాయ అధికారి బాబూరావు, తహసీల్దార్ సత్యనారాయణ స్వామి, ఎంపిడిఓ భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.





## రెవెన్యూ, అటవీ భూ సమస్యల పరిష్కారానికి సమన్వయంతో పనిచేయాలి

### - భూపాలపల్లి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా ఐడిఓసి కార్యాలయంలో కాటారం, మల్హార్, మహా ముత్తారాం, మహాదేవపూర్ మండలాలలో నెలకొన్న రెవెన్యూ, అటవీ శాఖల భూ సమస్యలపై రెవెన్యూ, అటవీశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలో అటవీ, రెవెన్యూ భూముల సమస్యల పరిష్కారానికి సంయుక్త సర్వే నిర్వహించి హద్దులు కేటాయించాలని తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, రెవెన్యూ, అటవీ శాఖల మధ్య సమన్వయం వల్ల భూముల వివాదాలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని సూచించారు. సమస్యను పరిష్కరించేందుకు ఇరువురు శాఖల అధికారులు కలిసి పనిచేయాల్సిన అవసరం ఉందన్నారు. ప్రతి మండలానికి చెందిన వివాదాస్పద భూముల వివరాలను సమగ్రంగా విశ్లేషించి, తగిన చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. అవసరమైతే స్థలాన్ని సందర్శించి భౌగోళిక పరంగా పరిశీలించాలన్నారు. ఈ సమావేశంలో జిల్లా అటవీ శాఖ అధికారి నవీన్ రెడ్డి, రెవెన్యూ అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, కాటారం సబ్ కలెక్టర్ మయాంక్ సింగ్, ఎఫ్డిఓ సందీప్ రెడ్డి, ఆయా మండలాల తహశీల్దార్లు తదితరులు పాల్గొన్నారు,

## డాక్టర్ మధుసూదన్ పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్



**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డా. మధుసూదన్ గత నెల రోజుల క్రితం హఠాత్తుగా అనారోగ్యానికి గురయ్యారు. ఆయన ప్రస్తుతం హైదరాబాద్‌లో వైద్య సేవలు పొందుతున్నారు. శుక్రవారం గణపురం తహసీల్దార్ కార్యాలయంలో జిల్లా కలెక్టర్ తనిఖీ చేస్తున్న సందర్భంగా డా. మధుసూదన్ మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ డాక్టర్ మధుసూదన్ ఆరోగ్య పరిస్థితి, వైద్య సేవల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అసలు ఏమైంది, అంత సీరియస్ అయింది, ఇపుడు చాలా నీరసంగా ఉన్నారు, ప్రస్తుతం ఆరోగ్యం ఎలా ఉంది అంటూ త్వరగా కోలుకోవాలని "టేక్ కేర్ ఆఫ్ యువర్ హెల్త్" అంటూ పరామర్శించారు. డాక్టర్ మధుసూదన్ పూర్తిగా కోలుకుని సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి విధుల్లో చేరాలని జిల్లా కలెక్టర్ సూచించారు.

## సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటు పనులను వేగవంతం చేయండి జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ





**జయశంకర్ భూపాలపల్లి జిల్లా ప్రతినిధి ఆగస్టు 01,( హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కేంద్రంలోని ప్రధాన ప్రభుత్వ ఆసుపత్రిలో సిటీ స్కాన్ పరికరం ఏర్పాటుకు చేపట్టిన పనులను శుక్రవారం జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజలకు సమయానుకూలంగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు సిటీ స్కాన్ పరికరం ఏర్పాటును త్వరితగతిన పూర్తి చేయాలని స్పష్టం చేశారు పనుల్లో ఆలస్యం లేకుండా, సంబంధిత ఇంజినీరింగ్ శాఖలు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. సిటీ స్కాన్ యంత్రం ఏర్పాటుతో ప్రజలకు అత్యవసర వైద్య సేవలు అందుబాటులోకి వస్తాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు కలెక్టర్ అశోక్ కుమార్, ఆసుపత్రి పర్యవేక్షకులు డా నవీన్, ఆసుపత్రి సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

## అక్రమ తరలిస్తున్న ఇసుక ట్రాక్టర్ పట్టివేత..

**కాటారం,ఆగస్టు 1, (హైదరాబాద్ న్యూస్):** కాటారం మండలం విలాసాగర్ మానేరు నుంచి భూపాలపల్లి మండల కేంద్రానికి ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్ ను కమలాపూర్ క్రాస్ రోడ్ వద్ద పట్టుకుని కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అకుల శ్రీనివాస్ తెలిపారు. కొందరు వ్యక్తులు ఎలాంటి పర్మిట్ లేకుండా ఇసుకను అక్రమంగా రవాణా చేస్తున్నారనే సమాచారంతో పోలీసు సిబ్బంది కమలాపూర్ క్రాస్ వద్ద మాటు వేసి మేడిపల్లి వైపు నుంచి భూపాలపల్లికి ఇసుక లోడుతో వస్తున్న ట్రాక్టర్ ను పట్టుకొని పర్మిట్ చూపించమని అడగగా, దీనితో పర్మిట్ లేకపోవడంతో ట్రాక్టర్ డ్రైవర్ పల్లపు నాగర్జున పై కేసు నమోదు చేసి నట్లు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## అక్రమ రవాణా చేస్తున్న ఇసుక లారీ పట్టివేత..

### - లారీ డ్రైవర్, ఓనర్, జెసిబి డ్రైవర్, ఓనర్ లపై కేసు నమోదు

**కాటారం,ఆగస్టు 1, (హైదరాబాద్ న్యూస్):** జయశంకర్ భూపాలపల్లి జిల్లా కాటారం మండలంలో డంపు చేసి ఉన్న ఇసుకను ఎలాంటి అనుమతులు లేకుండా అక్రమ రవాణా చేస్తున్న ఓ లారీని, ఓ జెసిబిని పట్టుకొని కేసు నమోదు చేసినట్లు కాటారం ఎస్సై అకుల శ్రీనివాస్ శుక్రవారం తెలిపారు. పెట్రోలింగ్ లో భాగంగా పోలీస్ సిబ్బంది రాత్రి సమయంలో పెట్రోలింగ్ చేస్తుండగా అర్ధరాత్రి కొత్తపల్లి గ్రామానికి వెళ్లేసరికి అక్కడ ఓ ఇద్దరు వ్యక్తులు జెసిబి సహాయంతో లారీలో ఇసుకను లోడ్ చేస్తు అనుమానంగా కనిపించడంతో అదుపులోకి తీసుకొని పర్మిట్ చూపించాలని అడగగా ఎలాంటి పర్మిట్ లేదని తెలిపారు. ఇందిరమ్మ ఇండ్ల అవసరాలకు ఉపయోగించే ఇసుకను పర్మిట్ లేకుండా స్వలాభాలకు కమర్షియల్ గా వేరే పట్టణాలకు తరలించుట చట్టరీత్యా నేరం అన్నారు. అట్టి నిబంధనల మేరకు లారీ డ్రైవర్, ఓనర్, జెసిబి డ్రైవర్, ఓనర్ లపై కేసు నమోదు చేయడం జరిగిందని కాటారం ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.

## స్పూన్ నెయ్యిలో చిటికెడు మిరియాల పొడి కలిపి తీసుకుంటే.. ఆ సమస్యలు చిటికెలో మాయం!

నేటి కాలంలో ప్రతి ఒక్కరూ ఏదో ఒక అనారోగ్యంతో బాధపడు తున్నారు. అస్థవ్యస్థమైన జీవనశైలి కారణంగా చిన్న వయసులోనే దీర్ఘకాలిక వ్యాధుల భారీన పడుతున్నారు. దీంతో రోజూ రకరకాల మందులు తీసకుంటూ శరీరం ఆరోగ్యంగా ఉండేలా చూసుకుంటున్నారు. అయితే ఈ వంట గదిలో ఉండే ఈ రెండు పదార్థాలను కలిపి తింటే ఇకపై మందులు వేసుకోవల్సిన అవసరం ఉండదంటున్నారు ఆరోగ్య నిపుణులు. అవేంటంటే.. నెయ్యి, నల్ల మిరియాలు. ఒక చెంచా నెయ్యి తీసుకుని, అందులో కొన్ని నల్ల మిరియాల పొడిని వేసుకుని బాగా కలుపుకోవాలి. ఆ తర్వాత దీనిని తినాలి. ప్రతిరోజూ ఇలా ఒక చెంచా తీసుకుంటే ఎన్నో ప్రయోజనాలు పొందవచ్చు. నెయ్యిలో ఉండే ఎ, ఇ, కె విటమిన్లు శరీర రోగనిరోధక శక్తిని పెంచుతాయి. కీళ్ల నొప్పులు వంటి సమస్యలు ఉన్నవారు రోజూ దీనిని రోజూ ఒక చెంచా చొప్పున తినాలి. కీళ్ల వాపు, నొప్పిని తగ్గించడంలో నెయ్యి సహాయపడుతుంది. నెయ్యి, మిరియాలు తింటే గుండెకు,కాలేయానికిమేలుచేస్తుంది.కాబట్టి మీరూ కాలేయ సమస్యతో బాధపడు తున్నట్లయితే, ఈ హెూం రెమెడీని ప్రతిరోజూ తినవచ్చు. ఏడాది పొడవునా జలుబు, దగ్గు వంటి సమస్యలు ఉంటే నెయ్యి, నల్ల మిరియాల పొడి మిశ్రమం తింటే త్వరిత గతిన ఉపశమనం పొందుతారు. ఇది వాయుమార్గాన్ని శుభ్రంగా ఉంచుతుంది. ఫలితంగా ముక్కు బ్లాక్ అవకుండా సాఫీగా ఉంటుంది.

# భూకబ్జాదారులపై కఠిన చర్యలు తీసుకోవాలి

## ◆ జిల్లా అదనపు కలెక్టర్‌కు వినతి పత్రం

**రామగిరి,ఆగస్టు 01:** పెద్దపల్లి జిల్లా మంథని మండలం కూచిరాజ్ పల్లి గ్రామానికి చెందిన నక్క వివేక్, నక్క శేఖర్ ప్రజాసంఘాల నాయకులతో కలిసి అదనపు కలెక్టర్ కు శుక్రవారం వినతి పత్రం ఇవ్వడం జరిగింది. పెద్దపల్లి జిల్లా మంథని మండలం బట్టుపల్లి గ్రామంలోని సర్వేనెంబర్ 53/అ1/1/1 లో విస్తీర్ణం ఒక ఎకరం భూమి పట్టాదారు మా నాన్న అయినా నక్క పోచం తండ్రి ఆశాలు పేరిట తెలంగాణ ప్రభుత్వం పట్టాదారు పాస్ పుస్తకం భూమి యజమాని హక్కు పత్రం పొంది ఉన్నప్పటికీని గత మూడు సంవత్సరాల నుండి బట్టుపల్లి గ్రామానికి చెందిన యాదవ కులానికి సంబంధించిన కొందరు వ్యక్తులు దౌర్జన్యంగా మా భూమిని కబ్జా చేసి మాకు అడ్డుపడుతున్నారని మా భూమిని దున్నుకోవడానికి వెళితే మీకు భూమి ఎక్కడిది ఇష్టమైన రీతిలో దళితులమని తిడుతున్నారని మాపైన దాడులకు కూడా తిరగబడుతున్నారని అదనపు కలెక్టర్ కు వినతి పత్రంలో తెలియజేయడం జరిగింది. మా తాత తండ్రుల నుండి వచ్చిన ఎకరం భూమిని అన్ని అర్హతలు కలిగి ఉన్న మాకు ఇవ్వాలని రెవెన్యూ అధికారుల చుట్టూ గత మూడు సంవత్సరాల నుండి తిరుగుతున్నామని అధికారులు సానుకూలంగా స్పందించిన కూడా భూమి



కబ్జా చేసిన వ్యక్తులు దౌర్జన్యంగా దున్నుకుంటున్నారని తిరిగి మా భూమిని మాకు కబ్జాదారుల నుండి ఇప్పించగలరని దళిత కుటుంబం జిల్లా ఆదన కలెక్టర్ కు దళిత ప్రజా సంఘాల నాయకులతో కలిసి వినతి పత్రం అందజేశారు.

# శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ సందర్శించిన ఆర్ బి వి ఆర్ ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్తు ఐపీఎస్





**మంథని,ఆగస్ట్ 1 :** రామగుండం పోలీస్ కమిషనరేట్ మంచిర్యాల జోన్ పరిధి శ్రీరాంపూర్ పోలీస్ స్టేషన్ ఆర్ బి వి ఆర్ ఆర్ డైరెక్టర్ అభిలాష్ బిస్త్ అడిషనల్ డీజీ సందర్శించడం జరిగింది.మొదటగా పోలీస్ స్టేషన్ చేరుకొన్న మేడమ్ ని జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్ ఎస్సై సంతోష్ లు మేడం కి మొక్కలు అందజేసి స్వాగతం పలకడం జరిగింది. అనంతరం ఏఆర్ మహిళా సాయిధ దళ సిబ్బంది నుండి గౌరవ వందనం స్వీకరించి అనంతరం పోలీస్ స్టేషన్ పరిసరాలను పరిశీలించి రిసెప్షన్ సెంటర్ ను సందర్శించి రిసెప్షన్ డ్యూటీలు నిర్వహిస్తున్న మహిళా సిబ్బందితో మాట్లాడి బాధితులు వచ్చినప్పుడు ఏ విధంగా వారిని రిసీవ్ చేసుకుంటున్నారు వారి సమస్యలు ఏ విధంగా తెలుసు కుంటున్నారు అని అడిగి తెలుసుకోవడం జరిగింది. పోలీస్ స్టేషన్ లోని రూమ్స్, లాకప్, విమెన్, మెన్ బ్యారక్ పరిసరాలను, వాష్ రూమ్స్ పరిశీలించారు, టెక్నికల్ రూం, సిసి కెమెరాలను పని తీరు గురించి అధికారులను అడిగి తెలుసుకున్నారు. సిబ్బందితో మాట్లాడి వారి విధులకు సంబంధించిన సూచనలు చేశారు. సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఎల్లవేళలా ఫిర్యాదులు స్వీకరించడం, బాధితుల ఫిర్యాదు పై సత్వరం స్పందించి సేవలు అందించాలని చెప్పారు. పోలీస్ స్టేషన్ పరిసరాల శుభ్రత, వాతావరణం, పోలీస్ స్టేషన్ నిర్వహణ, సిబ్బంది కోసం ఏర్పాటు చేసిన వసతుల పై సంతృప్తి వ్యక్తం చేశారు. మేడం వెంట మంచిర్యాల డిసిపి ఏ భాస్కర్ ఐపీఎస్., జైపూర్ ఏసిపి వెంకటేశ్వర్లు, స్పెషల్ బ్రాంచ్ ఏసీపీ మల్లారెడ్డి శ్రీరాంపూర్ సిఐ వేణు చందర్, ఆర్ ఐ సంపత్ శ్రీరాంపూర్ ఎస్సై సంతోష్, లక్ష్మి ప్రసన్న, ఉన్నారు.

# జర్నలిస్టు దామెర రాజేందర్ పై పెట్టిన అక్రమ కేసు ఎత్తివేయాలి

## ◆ ప్రభుత్వానికి టీడబ్ల్యూజేఎఫ్ డిమాండ్ ◆ కలెక్టర్‌ను కలిసిన జర్నలిస్టు నేతలు

**జమ్మికుంట ఆగస్టు 01 :** హన్మకొండ జిల్లాలో ఇటీవల సీనియర్ జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు పెట్టిన తప్పుడు కేసును వెంటనే ఎత్తివేయాలని తెలంగాణ వర్కింగ్ జర్నలిస్ట్స్ ఫెడరేషన్ (టీడబ్ల్యూజేఎఫ్) రాష్ట్ర నాయకులు డిమాండ్ చేశారు. ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య, ఉపాధ్యక్షులు పులిపలుపుల ఆనందం,వల్లాల జగన్,బండి విజయ్ కుమార్, కార్యదర్శి తన్నీరు శ్రీనివాస్, జాతీయ కౌన్సిల్ సభ్యుడు కుడుతాడి బాపురావు, హన్మకొండ జిల్లా అధ్యక్షుడు టీవీ రాజు, వరంగల్ జిల్లా అధ్యక్షుడు జక్కుల విజయ్ కుమార్ తదితరులు గురువారం హన్మకొండ జిల్లా కలెక్టర్ ను కలిసి వినతి పత్రం సమర్పించారు. జర్నలిస్టు దామెర రాజేందర్ పై ఐనవోలు పోలీసులు బనాయించిన తప్పుడు కేసు వివరాలను వారు కలెక్టర్ కు వివరించారు. ఈ సందర్భంగా గ్రేటర్ వరంగల్ ప్రెస్ క్లబ్ లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు మామిడి సోమయ్య మాట్లాడుతూ,రాజేందర్ గతంలో దాదాపు పదేండ్లు వివిధ పత్రికల్లో రిపోర్టర్ గా పనిచేశారని, ప్రస్తుతం సొంత పత్రికను నడుపుతున్నారని, ఐనవోలు తహశీల్దార్ కార్యాలయంలో జరుగుతున్న అక్రమాలపై రాజేందర్ పత్రికలో వరుస కథనాలు ప్రచురించారని తెలిపారు. దీనిని మనసులో పెట్టుకున్న ఐనవోలు తహశీల్దార్ రాజేందర్ పై కుట్రపన్ని పథకం ప్రకారం ఓ యూట్యూబర్ సహాయంతో పోలీసులతో కుమ్మక్కై కావాలని తప్పుడు కేసు నమోదు చేయించి జైలుకు పంపించారని ఆరోపించారు. నీతి, నిజాయితీతో వార్తలు రాస్తున్న జర్నలిస్టులపై ఇలాంటి తప్పుడు కేసులు పెట్టడం సరైంది కాదని అన్నారు. కావాలని ఒకరిద్దరు రాజేందర్ పై సోషల్ మీడియా వేదికగా అసత్యాలు ప్రచారం చేస్తున్నారని, తప్పుడు ప్రచారాలు చేస్తున్న యూట్యూబర్ ను వదిలేసి ఏ తప్పు చేయని జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు అక్రమంగా కేసు బనాయించి వేధిస్తున్నారని అన్నారు.ఈ



కుట్రపూరిత అక్రమ కేసు వ్యవహారంపై సమగ్ర విచారణ జరిపించి బాధ్యులైన అధికారులపై చర్యలు తీసుకోవాలని వారు డిమాండ్ చేశారు. జర్నలిస్టు రాజేందర్ పై పోలీసులు పెట్టిన కేసును ఉపసంహ రింపజేయాలని విజ్ఞప్తి చేశారు. అదేవిధంగా ఐనవోలు తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన భూములు, ప్లాట్ల అక్రమ రిజిస్ట్రేషన్ లపై సమగ్ర విచారణ జరిపించాలని కోరారు. జర్నలిస్టులపై పోలీసులు పెట్టిన అక్రమ కేసులకు బాధ్యులైన ఐనవోలు తహశీల్దార్, ఎస్ ఐలను సస్పెండ్ చేయాలని ఆయన డిమాండ్ చేశారు. ఈ విషయంలో ప్రభుత్వం, ఉన్నతాధికారులు వెంటనే స్పందించి జర్నలిస్టు దామెర రాజేందర్ పై అక్రమ కేసు తొలగించక పోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన చేయాల్సి వస్తుందని మామిడి సోమయ్య హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర కౌన్సిల్ సభ్యులు పొలమాని గోపాల్, పాలడుగుల సురేందర్, సభ్యులు శంకర్ తదితరులు పాల్గొన్నారు.

# దోమల ద్వారా వ్యాపించే వ్యాధులు, దోమల నివారణ పై బడి పిల్లలకు అవగాహన సదస్సు






**కూకట్పల్లి ఆగస్టు 01 :** వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల విజృంభన, వాటితో పాటు వచ్చే వ్యాధుల పై కూకట్పల్లి సర్కిల్ హైదర్ నగర్ డివిజన్ పరిధిలోని నిజాంపేట్ రోడ్ లో ఉన్న జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ' అర్బన్ మలేరియా స్కీమ్' కార్యక్రమంలో భాగంగా, దోమలను నివారించడంతో పాటు వాటి ద్వారా వ్యాపించే వ్యాధులను అరికట్టడం పై బడి పిల్లలకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఎంటమాలజీ విభాగంతో కలసి ముఖ్య అతిథిగా హైదర్ నగర్ డివిజన్ కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ, వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో దోమల బెడద ఎక్కువగా ఉంటుందని అందుకని ఎక్కువ రోజులు నీరు నిల్వ ఉండడం వల్ల దోమలు గుడ్లు పెట్టి, దోమ పిల్లలను ఉత్పత్తి చేస్తాయని అలా జరగకుండా చూసుకోవాలని తెలిపారు.అలాగే దోమకాటు ద్వారా డెంగ్యూ, మలేరియా జ్వరాలు, చికెన్ గునియా, బోధకాలు, మెదడు వాపు, మొదలగు వ్యాధులు వస్తాయని, కాబట్టి పరిసరాలు ఎప్పటికప్పుడు పరిశుభ్రంగా ఉంచుకోవాలని, ఎక్కువ రోజులు నీరు నిలువ ఉండకుండా చూసుకోవాలనీ, నేటి నిల్వల పై ఎల్లప్పుడూ మూతలు ఉంచాలని కార్పొరేటర్ నార్నె శ్రీనివాస రావు తెలిపారు. కార్యక్రమంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు సాయి కుమార్, ఎంటమాలజీ సూపర్వైజర్ నరసింహ, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# డ్రై డే - ఫ్రైడే కార్యాచరణలో భాగంగా దోమల నిర్మూలనకు అవగాహన సదస్సు





**గోదావరి ఖని టౌన్** దోమల నిర్మూలనకు ప్రజలు సహకరించాలని రామగుండం నగర పాలక సంస్థ డిప్యూటీ కమిషనర్ నాయిని వెంకట స్వామి కోరారు. వంద రోజుల కార్యాచరణ ప్రణాళికలో భాగంగా శుక్రవారం నిర్వహిస్తున్న డ్రై డే ఫ్రై డే కార్యక్రమ నిర్వహణ తీరును సంజయ్ గాంధీ నగర్ లో ఆయన పరిశీలించారు. ఈ సంధర్భంగా స్థానికులకు దోమల నివారణపై అవగాహన కల్పించారు. నిలువ ఉన్న మంచి నీళ్ళలో కూడా దోమల లార్వా పెరిగే అవకాశం ఉంటుందని అన్నారు. పూల కుండీలు, ఎయిర్ కూలర్లు, గోళాల్లో, పాత టైర్లలో, కొబ్బరి చిప్పలలో నిలువ ఉన్న నీటిని మున్సిపల్ సిబ్బంది తొలగించారు. మురుగు నీటి కుంటల్లో ఆయిల్ బాల్స్ వేశారు. గాంధీనగర్ సింగరేణి పాటశాల సమీపంలో ఉన్న మరుగు దొడ్డి ఆవరణను మున్సిపల్ సిబ్బంది పరిశుభ్రం చేశారు. అనంతరం లక్ష్మీ పురం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన వైద్య శిబిరంలో మున్సిపల్ సిబ్బందికి ఆరోగ్య పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో నగర పాలక సంస్థ సానిటరీ ఇన్స్పెక్టర్ నాగ భూషణం, వార్డు అధికారులు, సానిటరీ జవాన్లు, మున్సిపల్, మెప్మా సిబ్బంది పాల్గొన్నారు.

# బీసీలను మోసగిస్తున్న బిజెపి

- బీసీ రిజర్వేషన్ల సాధనకై సిపిఎం పోరాడుతుంది
- స్థానిక సంస్థల ఎన్నికల్లో సిపిఎం అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా పనిచేయాలి
- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య




**మహబూబాబాద్ జిల్లా ప్రతినిధి ఆగస్టు 01:** బీసీలకు 42 శాతం రిజర్వేషన్ల అమలు విషయంలో కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం బీసీలను మోసగించే విధంగా ప్రవర్తిస్తున్నదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జి.నాగయ్య విమర్శించారు. శుక్రవారం సిపిఎం జిల్లా స్థాయి వర్క్ షాప్ జగన్నాథం భవనంలో పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు సూర్నపు సోమయ్య అధ్యక్షతన జరిగింది. ఈ వర్క్ షాప్ లో నాగయ్య పాల్గొని ప్రసంగిస్తూ తెలంగాణ రాష్ట్ర మంత్రి వర్గం ఆమోదించి గవర్నర్ ద్వారా కేంద్రానికి పంపిన బీసీ రిజర్వేషన్ బిల్లును వెంటనే ఆమోదించాలని డిమాండ్ చేశారు. బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించకుండా కాలయాపన చేయడం బీసీల పట్ల బిజెపికి ఉన్న చిత్తశుద్ధిని తేటతెల్లం చేస్తుందని విమర్శించారు. రాష్ట్రానికి చెందిన బిజెపి పార్టీకి చెందిన ఇద్దరు కేంద్ర మంత్రులు ప్రగల్బాలు పలకటం మాని బీసీ రిజర్వేషన్ బిల్లును ఆమోదించేలా కృషి చేయాలని డిమాండ్ చేశారు. లేనియెడల సిపిఎం ఆధ్వర్యంలో బీసీ రిజర్వేషన్ల సాధనకై పోరాడుతామని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను అర్హులందరికీ అమలు చేయాలని డిమాండ్ చేశారు. సిపిఎం శ్రేణులు జిల్లా వ్యాప్తంగా ప్రజలందరూ ఎదుర్కొంటున్న స్థానిక సమస్యలపై పోరాటాలు నిర్వహించాలని కోరారు. రాబోయే స్థానిక సంస్థల ఎన్నికలలో సిపిఎం అభ్యర్థుల గెలుపు లక్ష్యంగా కార్యకర్తలు పనిచేయాలని పార్టీ శ్రేణులకు ఆయన పిలుపునిచ్చారు. వర్క్ షాప్ లో సిపిఎం జిల్లా కార్యదర్శి సాదుల శ్రీనివాస్, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గునిగంటి రాజన్న, అలవాల వీరయ్య, ఆకుల రాజు, కుంట ఉపేందర్, కందునూరి శ్రీనివాస్, జిల్లా కమిటీ సభ్యులు, మండల కార్యదర్శిలు, శాఖ కార్యదర్శిలు, ప్రజాసంఘాల బాధ్యులు పాల్గొన్నారు.

# గ్రాడ్యూటీ డబ్బులు త్వరగా తీసుకోవాలి

- మాజీ ఉద్యోగులను కోరిన ఏరియా డీజీఎం



**యైటింక్లయిన్ కాలనీ.:** గ్రాడ్యూటీ క్లయిమ్స్ త్వరగా తీసుకోవాలని, ఏరియా డీజీఎం పర్సనల్ పి.అరవింద్ రావ్ సింగరేణి మాజీ ఉద్యోగులను శుక్రవారం ఒక ప్రకటనలో కోరారు. సంస్థ నుండి ఉద్యోగ విరమణ పొంది, వివిధ కారణాలతో గ్రాడ్యూటీ డబ్బులు తీసుకోకుండా పెండింగ్లో పెట్టిన క్లయిమ్స్ ను త్వరగా తీసుకోవాలన్నారు. ఏరియాలో 130 మంది మాజీ ఉద్యోగులు క్వార్టర్లు ఖాళీ చేసి కంపెనీకి అప్పగించకుండా, 26 మంది ఎలాంటి సమాచారం లేకుండా, గ్రాడ్యూటీ డబ్బులు తీసుకోకుండా ఉన్నారని ఆయన తెలిపారు. కావున వారికి ఏదైనా సమస్య ఉంటే, త్వరగా పరిష్కరించుకొని గ్రాడ్యూటీ డబ్బులు తీసుకోవాలని ఆయన ఆ ప్రకటనలో మాజీ ఉద్యోగులకు సూచించారు.

# ఘనంగా పౌర్ణిమ జన్మదిన వేడుకలు





**కూకట్పల్లి ఆగస్టు 01 :** టిపిసిసి ఉపాధ్యక్షుడు, కూకట్పల్లి నియోజవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ బండి రమేష్ కార్యాలయం అసిస్టెంట్ పౌర్ణిమ జన్మదిన వేడుకలు శుక్రవారం కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు ముఖ్య అతిథిగా బండి రమేష్ పాల్గొని పౌర్ణిమ చేత కేక్ కటింగ్ చేయించి పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా బండి రమేష్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడే ప్రతి కార్యకర్తకు మంచి గుర్తింపు ఇస్తామని, కాంగ్రెస్ పార్టీ కోసం కష్టపడిన ప్రతి ఒక్కరికి భవిష్యత్తులో పార్టీ పదవులతో పాటు నామినేటెడ్ పదవులు, లభిస్తాయని తెలిపారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మాజీ మున్సిపల్ వైస్ చైర్మన్ లక్ష్మయ్య, పిడికిటి గోపాల్ చౌదరి, రాజు ముదిరాజ్, మధు జి. నరేష్, అశోక్ చారి, రఘుపతి పాల్గొన్నారు.

# ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం ఉచిత వైద్య శిభిరం

## - సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖని నందు



**రామగిరి, ఆగస్టు 01:-** ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం ఉచిత వైద్య శిభిరం సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖని నందు నిర్వహించటం జరుగుతుందనీ ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం అన్నారు. రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా సింగరేణి ఉద్యోగులకు వారి కుటుంబ సభ్యులకు సింగరేణి సంస్థ చైర్మన్ అండ్ మెనేజింగ్ డైరెక్టర్ యన్. బలరామ్ (ఐ.ఆర్.యస్) ఆదేశాల మేరకు కేర్ హాస్పటల్, హైదరాబాదు సూపర్ స్పెషాలిటి డాక్టర్స్ చే తేది.03-08-2025 (ఆదివారం) రోజున సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖని నందు ఉద్యోగుల ఆరోగ్య సంక్షేమం కోసం ఉచిత వైద్య శిభిరంను నిర్వహించటం జరుగుతుంది. ఇందులో ప్రదానమైన అత్యున్నతమైన వైద్య బృందం 1).కార్డియాలాజిస్ట్, 2). న్యూరోలాజిస్ట్, 3). మెడికల్ గాస్ట్రోలాజిస్ట్, 4).యురోలాజిస్ట్ రానున్నారు. కావున ఇట్టి సందర్భాన్ని పురస్కరించుకొని ఆసక్తి గల సింగరేణి ఉద్యోగులు వారి కుటుంబ సభ్యులు తేది: 30- 07- 2025 నుండి 02.08.2025 వరకు మెడికల్ కార్డ్ లతో రిజిస్ట్రేషన్ కోసం సింగరేణి ఏరియా హాస్పిటల్ గోదావరిఖని నందు సంప్రదించి ఇట్టి అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా అధికార ప్రతినిధి బి.సుదర్శనం ఒక ప్రకటన ద్వారా తెలియజేశారు.

# పెళ్లి రోజున పుణ్య కార్యం



**గోదావరి ఖని టౌన్ :** నీడ దాత యూనియన్ బ్యాంక్ ఉద్యోగి ఎస్ కరన్ లావణ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా . స్థానిక ఇంద్రానగర్ కాలనీకి చెందిన ఇద్దరు నిరుపేద గర్భిణీ స్త్రీలకు ఊర్వశి, సవంతలకి నీడ సంస్థ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ చేతుల మీదగా పోషకాహారం, పండ్లు అందించడం జరిగింది. ఈ సందర్భంగా నీడ అధ్యక్షులు పల్లెర్ల రమేష్ గౌడ్ మాట్లాడుతూ ఇప్పటివరకు కరణ్ మరియు వారి ఆప్తుల సహాయంతో 11 మంది నిరుపేద గర్భిణీలకు ప్రతినెల నీడ సంస్థ పోషకాహారం అందించి పండంటి ఆరోగ్యంవంతమైన బిడ్డలకు జన్మనివ్వడంలో వారి ముందు చూపు ఉందని తెలిపారు. ఇప్పుడు12 వ గర్భిణీ స్త్రీ ఇంద్రానగర్ అంగన్వాడీ 2 కీ చెందిన సవంత ఆరు నెలల గర్భిణి కరన్ లావణ్య దంపతుల పెళ్లిరోజు సందర్భంగా దత్తత తీసుకొని పోషకహారం, పండ్లు అందించామని ప్రతినెల పోషకాహారం డెలివరీ అయ్యే వరకు అందిస్తామని తెలిపారు. దీనికి పూర్తి సహకారం కరణ్ అందిస్తారని అలాగే పెళ్లిరోజు సందర్భంగా ఊర్వశికి కూడా ఈ నెల పోషకాహారం అందించడం జరిగిందని తెలిపారు. కరణ్ లావణ్య దంపతులను ఆదర్శంగా తీసుకొని ప్రతి ఒక్కరు సేవా కార్యక్రమాలు చేయాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో అంగన్వాడి టీచర్ శారద, గుర్రం సతీష్ తదితరులు పాల్గొన్నారు.

# ఉపాధ్యాయ పోస్టుకు దరఖాస్తు ఆహ్వానం



**ముత్తారం.ఆగష్టు.01.:** ముత్తారం మండలంలోని దర్యాపూర్ మోడల్ స్కూల్లో ఒప్పంద ప్రాతిపదికన ఇంగ్లీష్ పోస్ట్ ఖాళీగా ఉందని దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపల్ కేసరీ సంతోష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.హెచ్చిటి ఉద్యోగానికి ఇంగ్లీషులో పీజీ,బిఈడి చేసి ఉండాలని తెలిపారు.ఆసక్తి గల అభ్యర్థులు తమ బయోడేటాతో పాటు డెమో క్లాస్ కూడా ఇవ్వాలని అన్నారు.ఆగష్టు 4 వ తేదీ లోపు కళాశాలలో హాజరుకావాలని తెలిపారు.మరిన్ని వివరాలకై ప్రిన్సిపాల్ కేసరీ సంతోష్ కుమార్ 9885354200 ను సంప్రదించారని కోరారు.

# జాతీయ, అంతర్జాతీయ రెస్క్యూ పోటీలకు సిద్ధం కావాలి

## • సింగరేణి రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి





**యైటింక్లయిన్ కాలనీ. :** సింగరేణి సంస్థ లోని రెండవ బ్యాచ్ మహిళా ఉద్యోగులకు రెస్క్యూ శిక్షణ శుక్రవారంతో ముగిసింది. సింగరేణి రామగుండం రీజియన్ రెస్క్యూ స్టేషన్ లో రెండవ బ్యాచ్ మహిళా ఉద్యోగులకు 61 రోజులపాటు కొనసాగిన శిక్షణ తరగతులు ముగిసినందున సాయంత్రం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రెస్క్యూ విభాగం జనరల్ మేనేజర్ కె.శ్రీనివాస్ రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై జ్యోతి ప్రజ్వలన చేసి ముగింపు కార్యక్రమాన్ని ప్రారంభించి, శిక్షణ పూర్తి చేసుకున్న మహిళా ఉద్యోగులకు సర్టిఫికెట్లు, డ్రెస్ కోడ్ లు అందజేశారు. ఇక ఈ సందర్భంగా రెస్క్యూ జీఎం శ్రీనివాసరెడ్డి మాట్లాడుతూ..ఈ శిక్షణ ద్వారా అత్యవసర పరిస్థితులను సమర్థంగా ఎదుర్కోగలిగే నైపుణ్యాన్ని పెంచుకోవడం వల్ల విధినిర్వహణలో ఈ శిక్షణ ఎంతగానో ఉపయోగ పడుతుందన్నారు. అలాగే జాతీయ, అంతర్జాతీయ రెస్క్యూ పోటీల్లో పాల్గొనేందుకు మన సింగరేణి మహిళా జట్టు సభ్యులు సిద్ధంగా ఉండాలన్నారు. ఇక ఈ శిక్షణలో మైనింగ్ థియరీ, గ్యాసెస్, గ్యాస్ డిటెక్టర్స్, ఫస్ట్ ఎయిడ్, రెస్క్యూ రికవరీ, ఫైర్ ఫైటింగ్, ఫైర్ ఎక్సిస్టెన్స్ స్పెషలిజెడ్ ఎక్విప్మెంట్స్ తదితర అంశాలపై శిక్షణ ఇవ్వడం జరిగిందని తెలిపారు. ఇంకా ఈ ముగింపు కార్యక్రమంలో రెస్క్యూ సూపరింటెండెంట్ రాజేందర్ రెడ్డి, ఇన్స్ట్రక్టర్ మూర్తి, ట్రైనర్స్ కిషన్ రావు, శ్రావణ్, సిబ్బంది పాల్గొన్నారు.

# సమస్యల పరిశీలనకై పాదయాత్ర చేసిన కార్పొరేటర్ వెంకటేష్ గౌడ్





**కూకట్పల్లి ఆగస్టు 01 :** సమస్య రహిత డివిజన్ గా తీర్చిదిద్దేందుకు అహర్నిశలు కృషి చేస్తున్నట్లు కూకట్పల్లి సర్కిల్ ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ తెలిపారు శుక్రవారం డివిజన్ పరిధిలోని శంషిగుడా ఛత్రపతి శివాజీ నగర్ కాలనీ లో డ్రైనేజీ, సీసీ రోడ్ల కు సంబంధించిన పెండింగ్ వర్క్స్ ఉన్నాయని కాలనీ వాసులు డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్ గౌడ్ దృష్టికి తీసుకురాగా స్పందించిన కార్పొరేటర్ ఛత్రపతి శివాజీ నగర్ కాలనీలో పాదయాత్ర చేసి సమస్యలను పరిశీలించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ మాట్లాడుతూ కాలనీ లోని ఒక గల్లీలో డ్రైనేజీ వ్యవస్థతో పాటు మూడు సీసీ రోడ్లు పెండింగ్ ఉన్నాయన్నారు. సంబంధిత అధికారులతో అంచనాలు వేయించి, బడ్జెట్ మంజూరు చేయించి నిర్మాణ పనులు ప్రారంభిస్తామని హామీ ఇచ్చారు. అదేవిధంగా డివిజన్ లోని ప్రతి కాలనీలో మౌలిక వసతుల కల్పనకు పెద్ద పీట వేస్తామని, సీసీ రోడ్లు వంటి అభివృద్ధి పనులను నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలని, నాణ్యత విషయంలో ఎక్కడ రాజి పడకూడదని, అభివృద్ధి కోసం శాయ శక్తుల కృషి చేస్తానని తెలియచేసారు. కార్యక్రమంలో నాయకులు సమ్మారెడ్డి, శివరాజ్ గౌడ్, పాండుగౌడ్, పోశెట్టిగౌడ్, కాలనీ అధ్యక్షులు అంజయ్య యాదవ్, సెక్రటరీ కె.రమేష్, ఆర్.ఆంజనేయులు, కోటేశ్వరరావు, ఎల్.రాజు, పి.పోచయ్య, తాత బాబు, రాజ్యలక్ష్మి, సౌందర్య, అరుణ, కృష్ణవేణి, స్వరూపా, దేవి, యోగేశ్వరి, సుజాత తదితరులు పాల్గొన్నారు.

# పర్యావరణాన్ని కాపాడడానికి తగిన చర్యలు తీసుకోండి

- **ఆర్జి-త్రీ జి.ఎం కార్యాలయం నందు అధికారులతో సమీక్ష సమావేశం**
- **ఆర్జి-త్రీ, ఏపీఏ ఏరియాలో పర్యటించిన కేంద్ర పర్యావరణ అడ్వైజర్, శాస్త్రవేత్త కె.తరుణ్ కుమార్**







**రామగిరి, ఆగస్టు 01:-** గనుల విస్తరణలో పర్యావరణాన్ని కాపాడడానికి తగిన చర్యలు తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వ పర్యావరణ అడ్వైజర్, శాస్త్రవేత్త హైదరాబాద్ రీజియన్ కె.తరుణ్ కుమార్ అన్నారు. శుక్రవారం ఆయన రామగుండం-త్రీ, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియాలో పర్యటించారు. ముందుగా జి.ఎం కార్యాలయం నందు రామగుండం-త్రీ ఏరియా జనరల్ మేనేజర్ నరేంద్ర సుధాకర్ రావు, అడ్రియాల ప్రాజెక్ట్ ఏరియా జనరల్ మేనేజర్ కొలిపాక నాగేశ్వరరావు, కార్పొరేట్ ఎన్విరాన్మెంట్ విభాగం జనరల్ మేనేజర్ బానోత్ సైదులు లతోపాటు సంబంధిత అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సమావేశంలో వివిధ గనులలో, ఏరియాలో పర్యావరణాన్ని కాపాడేందుకు తీసుకుంటున్న చర్యలను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వారికి వివరించారు. అనంతరం రామగుండం కోల్ మైన్ ఏర్పాటు కోసం సర్టిఫైడ్ కాంప్లాన్స్ రిపోర్టు లో భాగంగా జీడీకే-పదవ ఇంక్లైన్, అడ్రియాల లాంగ్ వాల్, ఓ.సి.పి-టు ఉపరితల గనులను సందర్శించి గనుల విస్తరణలో పర్యావరణాన్ని కాపాడేందుకు చేస్తున్న పనులను పరిశీలించారు. అలాగే అడ్రియాల లాంగ్వాల్ గని ఆవరణలో మొక్కను నాటారు.ఈ కార్యక్రమంలో ఎస్వోటుజియం యం. రామ్మోహన్, ప్రాజెక్ట్ ఆఫీసర్లు సి.హెచ్.వెంకటరమణ, జె.రాజశేఖర్, కె.జనార్ధన్, ఎన్విరాన్మెంటల్ డి.జి.యం పి.రాజారెడ్డి, ఏరియా సర్వే అధికారి జనార్ధనరెడ్డి, ఎస్టేట్స్ అధికారి కె.ఐలయ్య, మేనేజర్లు కె.వి.రామరావు, సునీల్ కుమార్, సుధాకర్, అధికారులు కిషన్, రవికిరణ్, సురేష్, మేఘన, ఇతర అధికారులు పాల్గొన్నారు.

# పారిశుద్ధ్య కార్మికురాలిగా మారిన తాజా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు





**గోదావరి ఖని టౌన్ :** ప్రజారోగ్యంపై తీవ్రమైన ప్రభావం చూపే చెత్త సమస్యను పరిష్కరించడంలో రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ అధికారులు విఫలం కావడంతో తన డివిజన్ పరిధిలోని ప్రజల ఆరోగ్యాన్ని దృష్టిలో పెట్టుకొని 25వ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు పరిశుద్ధ కార్మికురాలిగా మారి ఇంటింటికి వెళ్లి చెత్తను సేకరించారు. 25వ డివిజన్ లో చెత్త సేకరణకు సంబంధించిన వాహనాలు రాకపోవడంతో ప్రజలు పలుమార్లు నగునూరి సుమలత రాజు దృష్టికి తీసుకు రాగా ఆమె అధికారులకు పలు మార్లు ఫిర్యాదులు చేసినా కనీస స్పందన లేకపోవడంతో ఇక చేసేది ఏమీ లేక ఆమె స్వయంగా తన స్కూటీకి రెండు డబ్బాలను అమర్చుకొని చెత్త సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడుతూ గత నెల రోజులుగా మున్సిపల్ కార్పొరేషన్ కు సంబంధించిన పారిశుధ్య కార్మికులు 25వ డివిజన్ లో చెత్త సేకరణకు రాకపోవడంతో తానే పారిశుద్ధ కార్మికురాలిగా మారాల్సిన పరిస్థితి వచ్చిందని వివరించారు.రోడ్లపై చెత్త కుప్పలుగా పేరుకుపోయి తీవ్ర దుర్వాసన వెదజల్లుతోందని, ఇప్పటికే జ్వరాలు విజృంభిస్తున్న సమయంలో అధికారులు పూర్తిగా కమిషన్లకు అలవాటు పడి ప్రజల సమస్యలపై నిర్లక్ష్యం గా వ్యవహరించడం పట్ల ఆమె ఆగ్రహం వ్యక్తం చేశారు. వర్షాలు ప్రారంభమైనప్పటి నుంచి వీధులన్నీ చిత్తడిగా మారి, పాములు, విషపూరిత పురుగులు సంచరిస్తుండటంతో ప్రజలు తీవ్ర భయాందోళనలకు గురవుతున్నారని అన్నారు. 25వ డివిజన్ లోని పలు కాలనీల్లో డ్రైనేజీ వ్యవస్థ పూర్తిగా అధోగతికి గురైందని, ఫాగింగ్ చేపట్టకపోవడం వల్ల దోమలు పెరిగి విష జ్వరాలు, వ్యాధుల బారిన ప్రజలు పడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ లో అధికార పార్టీకి చెందిన నేతల డివిజన్లకు మాత్రమే అధికారులు పనిచేస్తున్నారని ఆరోపించారు. అధికారులు అధికార పార్టీ నాయకుల మెప్పుకోసం పనిచేయడం ఇకనైనా మానాలని హితువు పలికారు. 25వ డివిజన్ అభివృద్ధి, పారిశుధ్యం విషయంలో మున్సిపల్ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ప్రజలతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని సుమలత హెచ్చరించారు. తాజా మాజీ కార్పొరేటర్ సుమలత రాజు చేపట్టిన ఈ వినూత్న నిరసన ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశంగా మారింది. నిన్న మొన్నటి వరకు కార్పొరేటర్ గా బాధ్యతలు చేపట్టిన సుమలత ఇంటింటికి వచ్చి చెత్త సేకరణ చేస్తుండడంతో ప్రజలు ఇదేనా ప్రజాపాలన అంటూ ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

# ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందించడం పై దృష్టి పెట్టాలి

◆ మూడు నెలల్లో కార్పొరేషన్ పరిధిలో పాఠశాల అభివృద్ధి పనులు పూర్తి ◆ విద్యా బోధనలు ఏఐ టూల్స్ వాడకం పట్ల అవగాహన పెంచుకోవాలి ◆ జిల్లాలో మెరుగైన విద్య అమలు పై రామగుండం చెందిన ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించిన జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష

**పెద్దపల్లి ప్రతినిధి :** ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాల అందించడం పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష అన్నారు. శుక్రవారం సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష జిల్లాలో మెరుగైన విద్య అమలు పై రామగుండం ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలలో చదివే పిల్లలకు మెరుగైన విద్య అందించేందుకు తీసుకోవాల్సిన చర్యల పై ఉపాధ్యాయుల నుంచి సలహాలు సూచనలను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ కోయ శ్రీ హర్ష మాట్లాడుతూ, ప్రాథమిక పాఠశాలలో ప్రతి రోజు పిల్లల కు ఏఐ ల్యాబ్ లో కనీసం 20 నిమిషాలు హాజరయ్యే విధంగా షెడ్యూల్ రూపొందించాలని కలెక్టర్ ఆదేశించారు. విద్యార్థి ప్రమాణాలు పెంచేందుకు ఏఐ టూల్స్ వినియోగంపై ఉపాధ్యాయులు అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలలకు రాబోయే 5 సంవత్సరాల పాటు ఎటువంటి మార్పులు చేయాల్సిన అవసరం లేకుండా అవసరమైన మౌలిక వసతుల కల్పన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అన్నారు. ప్రతి పాఠశాలలో 30 శాతం విద్యార్థులు చురుగ్గా ఉంటారని, కొంచెం ఉపాధ్యాయులు శ్రద్ధ పెడితే మరో 40 శాతం విద్యార్థులు సైతం బాగా చదువుతారని, మిగిలిన 30 శాతం విద్యార్థులకు కనీస విద్యా ప్రమాణాలు అందించడం చాలెంజ్ గా తీసుకుని ఉపాధ్యాయులు పని చేయాలని, చివరి విద్యార్థి వరకు మనం చెప్పే పాఠాలు అర్థాలు కావాలని అన్నారు. తరగతి గదిలో బోధన లో పిల్లలను భాగస్వామ్యం చేయాలని అన్నారు. ఉపాధ్యాయులకు సంబంధించి అన్ అకాడమీ పనులు తగ్గించేందుకు చర్యలు తీసుకోవాలని అన్నారు. కార్పొరేషన్ పరిధిలో ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి పనులు 3 నెలలో పూర్తి చేస్తామని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ఎఫ్.ఆర్.ఎస్ ఉపాధ్యాయులు, విద్యార్థులకు తప్పనిసరిగా నమోదు చేయాలని అన్నారు. ఎఫ్.ఆర్.ఎస్ విధానం వల్ల ఉపాధ్యాయుల చాలా వరకు పని భారం తగ్గుతుందని అన్నారు .పాఠశాల సంబంధించి సంపూర్ణ వివరాలు యూ.ఐ.డి.సి పోర్టల్ లో నమోదు చేయాలని అన్నారు. విద్యార్థులు వర్క్ బుక్ ఉపయోగించేలా చూడాలని అన్నారు.



విద్యార్థులకు చదవడం తో పాటు చదివింది అర్థం చేసుకోవాలని కలెక్టర్ తెలిపారు. పిల్లలకు కంప్రహెన్షన్ స్కిల్ వస్తే గణితం సైన్స్ సోషల్ బాగా అర్థం చేసుకుంటారని, బేసిక్ విద్యా ప్రమాణాల పై ఉపాధ్యాయులు దృష్టి పెట్టాలని కలెక్టర్ ఆదేశించారు. ఈ సమావేశంలో జిల్లా విద్యాశాఖ అధికారి డి.మాధవి, ఉపాధ్యాయులు, సంబంధిత అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## శంకర్ రెడ్డి గురు స్వామి మృతి బాధాకరం

**- బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వర్ రావు**





**కూకట్పల్లి ఆగస్టు 1 :** మూసాపేట్ అంజయ్య నగర్‌లో నివసించే పంచ గిరీష భక్త సమాజ్ సభ్యుడడు అరుణ్ గురు స్వామి శిష్యుడు శంకర్ రెడ్డి గురు స్వామి తీవ్ర అస్వస్థతకు గురవడంతో కుటుంబ సభ్యులు స్థానిక ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా గుండెపోటుతో హఠాత్ మరణం (అకాల మరణం) చెందారు. విషయం తెలిసిన వెంటనే అఖిలభారత అయ్యప్ప స్వామి భక్త సంఘం అధ్యక్షుడు అరుణ్ గురు స్వామి, బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు వడ్డేపల్లి రాజేశ్వరరావు లు ఆసుపత్రిని సందర్శించి శంకర్ రెడ్డి పార్థివ దేహాన్ని చూసి నివాళు లర్పించారు. అనంతరం కుటుంబ సభ్యులతో మాట్లాడి శంకర్ రెడ్డి అకాల మరణం పట్ల చింతిస్తూ సానుభూతి ప్రకటించి సంతాపం తెలియజేశారు.

## ఎదురెదురుగా వాహనాలు ఢీ



**ముత్తారం.ఆగష్టు.01.:** ముత్తారం మండలం అడవిశ్రీరాంపూర్ నుండి ఖమ్మంపల్లి వైపు వెళ్లే ప్రధాన రహదారిపై గురువారం రాత్రి సమయంలో కారు,ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీ కొన్నాయి. ఈ ఘటనలో కారులో ప్రయాణిస్తున్న అంబాల రాజ్ కుమార్,కట్కూరి వంశీ ఇద్దరు గాయాలపాలయ్యారు. ఈ ప్రమాదంలో అడవిశ్రీరాంపూర్ గ్రామానికి చెందిన తోడేటి శశికుమార్ ట్రాక్టర్ ముందు భాగం పూర్తిగా దెబ్బతింది. కారులో ప్రయాణిస్తున్న వారు బ్రహ్మణపల్లికి చెందిన వారుగా స్థానికులు తెలిపారు. దీనిపై పోలీసులను వివరణ కోరగా ఎటువంటి ఫిర్యాదు అందలేదని ఎస్సై గోపతి నరేష్ తెలిపాడు.

## ఉద్యోగులకు బదిలీలు సహజమే..



**ముత్తారం.ఆగష్టు.01.:** ప్రభుత్వ ఉద్యోగస్తులకు బదిలీలు సహజమేనని జిల్లా ప్రోగ్రామ్ మేనేజర్ రమణయ్య అన్నారు. బదిలీపై ముత్తారం మండలం నుండి రామగిరి మండలంకి వెళ్తున్న ఐకేపీ ఏపీఎం దొమ్మటి పద్మను మండల సమాఖ్య ఆధ్వర్యంలో సన్మానం నిర్వహించారు. ఈ సందర్భంగా డిపిఎం మాట్లాడుతూ.. ప్రభుత్వ ఉద్యోగులకు బదిలీలు సహజమని విధి నిర్వహణలో ఏపీఎం దొమ్మటి పద్మ మండలంలో చేసిన సేవలు అమూల్యమైనవన్నారు. ముత్తారం ఏపీఎంగా పనిచేసిన 10 సంవత్సరాల కాలంలో ఏపిఎం మహిళా సంఘాలకు సేవలను అందించారని పేర్కొన్నారు. అనంతరం కార్యాలయ సిబ్బంది,మహిళా సంఘాలు,వీవోఏలు బదిలీపై వెళ్తున్న ఏపీఎం ను ఘనంగా సన్మానించారు. అనంతరం ఏపిఎం పద్మ మాట్లాడుతూ మండలంలో విధులు నిర్వహించిన సంవత్సరాలలో నాకు సహకరించిన ప్రజలకు,వివిధ పార్టీ నాయకులకు తోటి ఉద్యోగులను ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు. ఇక్కడ నేర్చుకున్న ఒడిదుడుకులతో బదిలీ పై వెళ్తున్న మండలంలో నిరంతరం మహిళలకు కృషి చేస్తానని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో సిసిలు రాజ్యలక్ష్మి,తిరుపతి,రాధిక,సివో మల్లేష్,ఎంఎస్ఏ కవిత,శ్రీనిధి మేనేజర్ ప్రభాకర్ తోపాటు విఓఏలు, సిఏలు, సంఘాల మహిళలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## కొత్త బెల్లం కంటే పాత బెల్లం వెయ్యిరెట్లు మంచిదట.. మీరూ తినండి ఎన్ని లాభాలో!

తాజా బెల్లం తినడం చాలా మందికి ఇష్టం. అయితే కొత్త బెల్లం కంటే పాత బెల్లం ఎక్కువ మేలు చేస్తుందని మీకు తెలుసా..? అవును.. ఆశ్చర్యంగా అనిపించినా ఇది పోషకాహార నిపుణులు చెబుతున్న మాట. నేటి నుంచి వంటగదిలో కొత్త బెల్లానికి బదులు పాత బెల్లాన్ని వాడటం ప్రారంభించండి. నిపుణుల అభిప్రాయం ప్రకారం.. 1 నుండి 2 సంవత్సరాల కాలంపాటు నిల్వ చేసిన బెల్లం చాలా ప్రయోజనకరంగా ఉంటుంది. సుదీర్ఘ కాలంలో బెల్లంలోని యాంటీ ఆక్సిడెంట్, పోషక విలువలు పెరుగుతాయి. ఇది మన శరీరంలో రోగనిరోధక శక్తిని పెంచుతుంది. ఒత్తిడిని తగ్గించడంలో కూడా సహాయపడుతుంది. కాబట్టి 1 నుంచి 2 సంవత్సరాలలోపు పాత బెల్లం తీసుకోవడం మరింత ప్రయోజనకరంగా ఉంటుంది. ఇందులోని మొలాసిస్‌ను వివిధ పోషకాలను అందిస్తుంది. పాత బెల్లం దుకాణాల్లో దొరుకుతుంది. కానీ దీని ధర కొంచెం ఎక్కువగా ఉంటుంది. బెల్లం అనేక పోషకాలను కలిగి ఉంటుంది. ఇది శరీరానికి శక్తిని అందించడంలో సహాయపడుతుంది. కార్బోహైడ్రేట్లు, ఐరన్, మెగ్నీషియం వంటి పోషకాలు బెల్లంలో పుష్కలంగా ఉంటాయి. బెల్లం మన జీర్ణక్రియను అనేక విధాలుగా మెరుగుపరుస్తుంది. బెల్లంలో అనేక రకాల ఎంజైమ్‌లు, ఫైబర్‌లు ఉంటాయి. ఇవి ఆహారాన్ని సులభంగా జీర్ణం చేయడానికి సహాయపడతాయి. బెల్లం ఎముకల ఆరోగ్యానికి కావల్సిన ముఖ్యమైన కాల్షియం, ఫాస్పరస్ వంటి ముఖ్యమైన పోషకాలను అందిస్తుంది.

## పాలనా వ్యవస్థ పై పాఠశాల స్థాయిలో అవగాహన కార్యక్రమం




**కూకట్పల్లి ఆగస్టు 01 (ది క్రైమ్ న్యూస్):** దేశంలో, రాష్ట్రాలలో ప్రభుత్వాలు ప్రజలను ఎలా పాలిస్తాయన్న దానిపై అవగాహన కల్పించేందుకు కూకట్పల్లి లోని గీతాంజలి పాఠశాలలో క్యాబినెట్ ఏర్పాటుచేసి, పాఠశాల స్థాయిలో పాలనా వ్యవస్థ పై అవగాహన కార్యక్రమం నిర్వహించామని గీతాంజలి స్కూల్స్ ప్రిన్సిపల్ తెలిపారు. ఈ క్రమంలో కూకట్‌పల్లి వివేకానందనగర్‌లోని గీతాంజలి ఒలింపియాడ్ స్కూల్‌లో ఇన్వెస్టిట్యూర్ సెర్మనీ వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా బాలానగర్ అడిషనల్ డీసీపీ సత్యనారాయణ, ఆసియా అథ్లెటిక్ గోల్డ్ మెడలిస్ట్ నందిని, అకడమిక్ డైరెక్టర్ శ్రీనివాస్, శివాని కత్తర్ లు పాల్గొన్నారు. పిల్లల్లో చిన్ననాటి నుంచే నాయకత్వ లక్షణాలు అభివృద్ధి చేయడంలో ఇలాంటి కార్యక్రమాలు దోహదపడతాయని స్కూల్ నిర్వాహకులు తెలిపారు.

## బెజ్జంకి మండలకేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్





**బెజ్జంకి, ఆగస్టు 1,:** సిద్దిపేట జిల్లా బెజ్జంకి మండలకేంద్రంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని శుక్రవారం జిల్లా కలెక్టర్ కె.హైమవతి ఆకస్మికంగా సందర్శించారు. సిబ్బంది హాజరు జాబితా, రోగుల వైద్య సేవలపై ఆరా తీసీ నిర్లక్ష్యం వహిస్తే చర్యలు తప్పవని సిబ్బందిని హెచ్చరిస్తూ అనుమతి లేనిదే సిబ్బందికి సెలవులు మంజూరు చేయవద్దని వైద్యులకు సూచించారు. అన్ని గదులు, ల్యాబ్ లో నిర్వహించే పరిక్షలు,స్టోర్ రూంలోని మందులను పరిశీలించి కాలంచెల్లిన మందులు వాడకూడదని సూచించారు. గ్రామాల్లోని గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రిలోనే వైద్యం చేయించుకునేలా సాదారణ ప్రసవాలను ప్రోత్సహించాలని ఏఎన్ఎంలకు సూచించారు. అనంతరం ఇందిరమ్మ ఇళ్ల పరిశీలనకు వెళ్ళగా సామాగ్రి దరలు పెంచారని లబ్దిదారులు చేసిన ఫిర్యాదుకు దుకాణాదారులతో మాట్లాడి దరల స్థిరీకరణ చేయాలని తహశీల్దార్, ఎంపీడీవోలను ఆదేశించారు. తహశీల్దార్ కార్యాలయాన్ని సందర్శించి భూ భారతి అవగాహన సదస్సుల్లో వచ్చిన దరఖాస్తుల డిస్పోజల్ ప్రక్రియపై ఆరా తీసి భూ భారతి చట్టం ప్రకారం దరఖాస్తులను పరిష్కరించాలని తహశీల్దార్ శ్రీనివాస్ కు సూచించారు. అనంతరం గుండారం ప్రభుత్వ ఉన్నత పాఠశాలను సందర్శించి బోజనానికి సమయమౌతున్నా భోజనం వండపోవడంతో సిబ్బందిపై ఆగ్రహం వ్యక్తంచేసి విద్యార్థుల హాజరు ప్రకారం సరుకులను కొలత ప్రకారం ఇవ్వాలని ఉపాధ్యాయులు ఆదేశించి ప్రాథమిక పాఠశాలలోని మధ్యాహ్న బోజన ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం అగ్రో రైతు సేవా కేంద్రంలోని గోదాంలో ఎరువుల సరఫరా రిజిస్టర్ ను పరిశీలించి అక్రమంగా ఎవరికీ ఎరువుల సరఫరా జరగకుండా చూస్తూ గ్రామాల వారీగా సరఫరా వివరాలు నమోదు చేసుకుని ఎరువుల నిల్వల వివరాలు సక్రమంగా నమోదయ్యేలా పర్యవేక్షించాలని అధికారులను కలెక్టర్ హైమవతి ఆదేశించారు. వివిధ శాఖల అధికారులు కలెక్టర్ వెంట సందర్శనలో పాల్గొన్నారు.

## నల్ల చూపు కాషాయం వైపు

**- కారు దిగి కాషాయం కండువా కప్పుకొనున్న నల్ల మనోహర్ రెడ్డి - ఆగస్టు 5న జరిగే బీజేపీ కార్యకర్తల సమ్మేళన సభలో రాష్ట్ర అధ్యక్షుని ఆధ్వర్యంలో బిజెపిలోకి నల్ల మనోహర్ రెడ్డి**



**పెద్దపల్లి ప్రతినిధి :** పెద్దపల్లి నియోజకవర్గంలో నల్ల ఫౌండేషన్ స్థాపించి అనేక సేవా కార్యక్రమాలు చేస్తూ బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కు అత్యంత సన్నిహితంగా ఉన్న బిఆర్ఎస్ యువ నాయకుడు నల్ల మనోహర్ రెడ్డి చూపు కాషాయం వైపు పడింది. కొద్ది రోజులుగా పెద్దపల్లి నియోజకవర్గంలో సైలెంట్ అయిపోయిన నల్ల మనోహర్ రెడ్డి ఎట్టకేలకు కారు దిగి కాషాయం కండువా కప్పుకోనున్నారు. ఈనెల 5న పెద్దపల్లి లో జరిగే బిజెపి కార్యకర్తల సమ్మేళన సభలో రాష్ట్ర అధ్యక్షుని సమక్షంలో కాషాయతీర్థం పుచ్చుకోనున్నారు. పెద్దపల్లి జిల్లా జూలపల్లి మండలానికి చెందిన నల్ల మనోహర్ రెడ్డి గత 20 ఏళ్లుగా రాజకీయాల్లో ఉంటూ యువతకు క్రికెట్ కిట్ లు అందించి క్రీడలను ప్రోత్సహిస్తూ, నిరుపేదలకు అనారోగ్య బాధితులకు ఆర్థిక సహాయం అందజేస్తూ మీకోసం నేనున్నానంటూ బాసటగా నిలిచి, పెద్దపల్లి నియోజకవర్గ వ్యాప్తంగా పెద్ద ఎత్తున సేవా కార్యక్రమాలు చేస్తూ అందరి చూపును ఆకర్షించిన నల్ల మనోహర్ రెడ్డి కొద్ది రోజులుగా ఎలాంటి ఉనికిని చాటకుండా నిశ్శబ్దంగా ఉండి పార్టీ మారే నిర్ణయం తీసుకున్న విషయం నియోజకవర్గ ప్రజలను ఆశ్చర్యానికి గురిచేసింది. ఏదేమైనా నియోజకవర్గంలోని అన్ని గ్రామాలలో యువకుల్లో మంచి ఫాలోయింగ్ ఉండడంతో బీజేపీ కి పెద్దపల్లి నియోజకవర్గంలో మంచి ఊపు వచ్చే అవకాశాలు ఉన్నాయని చర్చ జరుగుతుంది. నల్ల మనోహర్ రెడ్డి బీజేపీలో చేరికతో నూతనోత్సాహంతో పాటుగా రాబోయే స్థానిక ఎన్నికల్లో బీజేపీ కి అదనపు బలం చేకూరుతుందని రాజకీయ పరిశీలకులు భావిస్తున్నారు .

## వరకట్న వేధింపులతో వివాహిత బలవన్మరణం....!



**మానకొండూర్, ఆగస్టు 1,:** కరీంనగర్ జిల్లా మానకొండూర్ మండలం గంగిపల్లిలో వరకట్న వేధింపులు భరించలేక ఓ వివాహిత గురువారం ఉరివేసుకుని బలవన్మరణానికి పాల్పడింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.... గ్రామానికి చెందిన చలిగంటి నాగయ్యకు శంకరపట్నం మండలం మెట్ పల్లికి చెందిన హేమలతతో ఐదేళ్ళ క్రితం వివాహం కాగా అత్తింటి వాళ్ళు తరచూ వరకట్నం కోసం వేదిస్తుండడంతో మనస్తాపానికి గురైన హేమలత గురువారం రాత్రి ఇంట్లో ఉరివేసుకుని మృతి చెందింది. కాగా తన కూతురు మృతికి భర్త నాగయ్య, అత్త పోచమ్మ, ఆడబిడ్డలు స్వరూప, కొమురమ్మలపై అనుమానం వ్యక్తం చేస్తూ మృతురాలి తల్లి కొయ్యడ సమ్మక్క ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు సిఐ బి.సంజీవ్ తెలిపారు.

# స్పోర్ట్స్

# 224పరుగులకు ఆలౌటైన టీమిండియా

## అర్ధ సెంచరీతో ఆడుకున్న కరుణ్ నాయర్

## 5/33తో రాణించిన గస్ అట్కిన్సన్ ఫైఫర్



ఇంగ్లాండో తో జరుగుతున్న ఆఖరిదైన ఐదో టెస్టులో టీమిండియా ఓ మాదిరి స్కోరుకే పరిమితమైంది. సవాలు విసిరే ఈ పిచ్ పై శుక్రవారం రెండో రోజు ఆట ప్రారంభమైన కాసేపటికే తొలి ఇన్నింగ్స్ లో 69.4 ఓవర్లలో 224పరుగులకు ఆలౌటైంది. వెటరన్ బ్యాటర్ కరుణ్ నాయర్ అర్ద సెంచరీ (109 బంతుల్లో 57, 8 ఫోర్లు)తో టాప్ స్కోరర్ గా నిలిచాడు. ఇంగ్లీష్ బౌలర్లలో గస్ అట్కిన్సన్ ఫైఫర్ (5/33)తో సత్తా చాటాడు. ఈ మ్యాచ్ లోనే చోటులో దక్కించుకున్న కరుణ్.. జట్టులో ఏకైక ఫిఫ్టీతో తన స్థానానికి న్యాయం చేశాడు. మరోవైపు ఈ మ్యాచ్ కు గాయం కారణంగా క్రిస్ వోక్స్ దూరమయ్యాడు. టెయిలెండర్లు త్వరగా ఔటయ్యే బలహీనతను టీమిండియా మరోసారి ప్రదర్శించింది. శుక్రవారం రెండోరోజు ఉదయం 204/6 తో తొలి ఇన్నింగ్స్ ను కొనసాగించిన భారత్ మరో 20 పరుగులు జోడించి మిగతా నాలుగు వికెట్లను కోల్పోయింది. 218 పరుగుల వద్ద కరుణ్ ను జోష్ టంగ్ ఎల్బీగా ఔట్ చేశాడు. ఆ తర్వాత గస్ అట్కిన్సన్ త్వరగా మూడు వికెట్లను తీసి, ఫైఫర్ ను నమోదు చేశాడు. వరుసగా వాషింగ్టన్ సుందర్ (26), మహ్మద్ సిరాజ్, ప్రసిధ్ కృష్ణ లను డకౌట్ చేశాడు. దీంతో ఓ మాదిరి స్కోరుకే టీమిండియా పరిమితమైంది. ఈ వికెట్ పై 280 పరుగుల యావరేజీ స్కోరు కాగా, టీమిండియా ఆ మార్కును దాటలేక పోయింది. ఇక ఈ మ్యాచ్ లో బౌలింగ్ లైనప్ లో ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగింది. మహ్మద్ సిరాజ్ వరుసగా సిరీస్ లో ఐదో టెస్టు ఆడుతుండగా, ప్రసిధ్, ఆకాశ్ దీప్ రీ ఎంట్రీ ఇచ్చారు. కేవలం ముగ్గురు పేసర్లతోనే బరిలోకి దిగుతుండటంతో వీలైనంత త్వరగా వికెట్లను తీయాలని విశ్లేషకులు సూచిస్తున్నారు. ఇక ఈ మ్యాచ్ లో ఇరుజట్లు నాలుగేసి మార్పులతో బరిలోకి దిగిన సంగతి తెలిసిందే. రిషభ్ పంత్, శార్దూల్ ఠాకూర్, అన్షుల్ కాంబోజ్, జస్ ప్రీత్ బుమ్రా ల స్తానాల్లో ధ్రువ్ జురెల్, కరుణ్ నాయర్, ప్రసిధ్, ఆకాశ్ దీప్ బరిలోకి దిగుతున్నారు. ఇక ఇంగ్లాండ్ జట్టులో కెప్టెన్ బెన్ స్టోక్స్, జోఫ్రా ఆర్చర్, బ్రైడెన్ కార్స్, లియామ్ డాసన్ లు ఈ మ్యాచ్ కు దూరమయ్యారు. వారి స్థానాల్లో జాకబ్ బెతెల్, గస్ అట్కిన్సన్, జోష్ టంగ్, జామీ ఓవర్టన్ లు జట్టులోకి వచ్చారు. ఇక ఐదు టెస్టుల అండర్సన్-టెండూల్కర్ ట్రోఫీలో 2-1తో ఇంగ్లాండ్ ఆధిక్యంలో ఉన్న సంగతి తెలిసిందే.

## కరుణ్ నాయర్, ప్రసిద్ధ్ కృష్ణకు ఇదే చివరి అవకాశం!

టీమ్ ఇండియాలో నాలుగు ప్రధాన మార్పులు చోటు చేసుకున్నాయి. గాయపడిన వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ స్థానంలో ధ్రువ్ జురెల్‌కు అవకాశం ఇచ్చారు. ఫాస్ట్ బౌలర్ జస్‌ప్రీత్ బుమ్రా స్థానంలో ప్రసీద్ కృష్ణకు, శార్దూల్ ఠాకూర్ స్థానంలో కరుణ్ నాయర్‌కు, అన్షుల్ కాంబోజ్ స్థానంలో ఆకాష్ దీప్‌కు అవకాశం ఇచ్చారు. అయితే ముఖ్యంగా కరుణ్ నాయర్, ప్రసిద్ధ్ కృష్ణకు బహుషా ఇదే చివరి అవకాశం అయ్యే ప్రమాదం ఉంది. ఒక వేళ వాళ్లు ఇందులోనూ రాణిచలేకపోతే.కరుణ్ నాయర్ కు చివరి అవకాశం లభించింది. తొలి మూడు మ్యాచ?ల్లో బాగా రాణించకపోవడంతో కరుణ్ 4వ టెస్ట్ మ్యాచ్ కు దూరమయ్యాడు. ఇప్పుడు శార్దూల్ ఠాకూర్ స్థానంలో కరుణ్ ను జట్టులోకి తీసుకున్నారు. కాబట్టి కరుణ్ తన కెరీర్ ను కాపాడుకోవాలంటే డూ ఆర్ డై మ్యాచ్ అయిన ఓవల్ టెస్ట్ మ్యాచ్ లో మెరవాలి.జట్టు పేసర్ జస్ప్రీత్ బుమ్రా వర్క్‌లోడ్ మేనేజ్‌మెంట్‌లో భాగంగా జట్టుకు దూరంగా ఉన్నాడు. అతని స్థానంలో ప్రసీద్ కృష్ణకు ప్లేయింగ్ ఎలెవన్‌లో స్థానం కల్పించారు. ప్రసీద్ కూడా ఈ సిరీస్‌లో పెద్దగా రాణించలేదు. అందువల్ల అతన్ని కూడా జట్టు నుండి తొలగించారు. కానీ ఇప్పుడు ప్రసీద్‌కు చివరి టెస్ట్‌లో చివరి అవకాశం దొరికింది.గాయం కారణంగా టీం ఇండియా వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ రిషబ్ పంత్ చివరి టెస్ట్‌కు దూరమయ్యాడు. అందువలన ధ్రువ్ జురెల్‌కు అవకాశం లభించింది. ఈ టెస్ట్ సిరీస్‌లో రిషబ్ పంత్ మంచి ఫామ్‌లో ఉన్నాడు, కానీ గాయం కారణంగా అతను జట్టుకు దూరమయ్యాడు. ఇప్పుడు అతనికి జట్టులో స్థానం లభించడంతో ధ్రువ్ జురెల్ బాగా రాణించాల్సి ఉంటుంది.ఈ సిరీస్ మొత్తంలో ఒక్క అవకాశం కూడా దక్కని అతికొద్ది మంది ఆటగాళ్లలో కుల్దీప్ ఒకడు. ఇంగ్లాండ్ జట్టులో ప్రధాన స్పిన్నర్‌గా వచ్చిన కుల్దీప్ బెంచ్ మీద వేచి ఉండటం తప్ప మరేమీ చేయలేకపోయాడు. అతనితో పాటు అభిమన్యు ఈశ్వరన్, అర్ష్‌దీప్ సింగ్ కూడా అవకాశం దక్కకుండా బెంచ్ మీద కూర్చోవాల్సి వచ్చింది. అయితే ఈ మ్యాచ్‌లోనూ రాణించకుంటే కరుణ్ నాయర్ ఇక అంతర్జాతీయ క్రికెట్‌కు రిటైర్మెంట్ ఇవ్వాల్సిందే అనే ప్రచారం జరుగుతోంది.






## టెస్టు ఫార్మాట్‌లో రాణించిన కరుణ్ నాయర్

భారత క్రికెట్‌లో ఒకప్పుడు తారాజువ్వలా దూసుకొచ్చి అంతలోనే తెరమరుగైన క్రికెటర్ కరుణ్ నాయర్ సుదీర్ఘ విరామం తర్వాత మళ్లీ టెస్టు ఫార్మాట్?లో సత్తా చాటాడు. ఓవల్ మైదానం వేదికగా ఇంగ్లండ్‌తో జరుగుతున్న టెస్ట్ సిరీస్‌లో భాగంగా చివరి మ్యాచ్‌లో 52 పరుగులతో నాటౌట్‌గా నిలిచిన నాయర్, భారత్‌కు దన్నుగా నిలిచాడు. దాదాపు దశాబ్దం క్రితం ఇంగ్లండ్‌పై చేసిన అజేయ ట్రిపుల్ సెంచరీ తర్వాత, టెస్టుల్లో అతని మొదటి 50ం స్కోరు ఇదే కావడం విశేషం. అంటే సరిగ్గా 3,148 రోజుల నిరీక్షణ తర్వాత కరుణ్ నాయర్ యాభైకి పైగా పరుగులు చేయడం ఇప్పుడే కావడం గమనార్హం.ఈ సిరీస్‌లోని మొదటి మూడు టెస్టుల్లో కరుణ్ ప్రదర్శన అంతంత మాత్రంగానే ఉంది. మొదటి టెస్టులో ఓ ఇన్నింగ్స్?లో ఏకంగా డకౌట్ అయ్యాడు, మరో ఇన్నింగ్స్ లో 20 పరుగులు చేశాడు. రెండో టెస్టులో 31, 26 పరుగులు చేశాడు. మూడో టెస్టులో 40 పరుగులు చేసి కొంత ఆశలు రేపినప్పటికీ, తర్వాతి ఇన్నింగ్స్‌లో 14 పరుగులకే పరిమితమయ్యాడు. దీంతో నాలుగో టెస్టుకు అతన్ని జట్టు నుంచి తప్పించారు. అయితే, చివరిదైన ఐదో టెస్టుకు మళ్లీ అతనికి అవకాశం దక్కింది, ఈసారి అతను ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని అద్భుతమైన హాఫ్ సెంచరీతో అదరగొట్టాడు.మామూలు పరిస్థితుల్లో ఆడితే కరుణ్ నాయర్ అర్ధ సెంచరీకి ఇంత ప్రాముఖ్యం లభించేది కాదు. ఓవల్ పిచ్ పచ్చగా, బౌలర్లకు అనుకూలంగా ఉన్న పరిస్థితుల్లో, పైగా మబ్బులు కమ్మేసిన వాతావరణంలో బ్యాటింగ్ చేయడం భారత బ్యాట్స్‌మెన్‌లకు సవాలుగా మారింది. భారత జట్టు 83/3 తో కష్టాల్లో ఉన్నప్పుడు కరుణ్ నాయర్ క్రీజులోకి వచ్చాడు. తన అనుభవాన్ని రంగరించి బ్యాటింగ్ చేస్తూ 98 బంతుల్లో 52 పరుగులు చేశాడు. అతని ఇన్నింగ్స్‌లో 7 బౌండరీలు ఉన్నాయి. జట్టు స్కోరు 200 దాటడంలో, వాషింగ్టన్ సుందర్‌తో కలిసి 51 పరుగుల భాగస్వామ్యాన్ని నెలకొల్పడంలో నాయర్ కీలక పాత్ర పోషించాడు. పిచ్ కఠినంగా ఉండటం, ఒకవైపు వికెట్లు పడిపోతున్న సమయంలో ఇంగ్లాండ్ బౌలర్లకు ఎదొరొడ్డి 52 పరుగులతో అజేయంగా నిలవడంతో మొదటి రోజు ఆటలో కరుణ్ ప్రత్యేకంగా నిలిచాడు.2016 డిసెంబర్ 19న చెన్నైలో ఇంగ్లండ్‌తో జరిగిన టెస్టులో కరుణ్ నాయర్ అద్భుతమైన అజేయ 303 పరుగులు చేశాడు. అది అతని టెస్టు కెరీర్‌లో కేవలం మూడో టెస్టు మాత్రమే. ఆ ఇన్నింగ్స్‌లో 32 ఫోర్లు, 4 సిక్సర్లు ఉన్నాయి. వీరేంద్ర సెహ్వాగ్ తర్వాత ట్రిపుల్ సెంచరీ సాధించిన రెండో భారత బ్యాట్స్‌మెన్‌గా నాయర్ చరిత్ర సృష్టించాడు. ఆ సమయంలో కరుణ్ నాయర్?పై టీమిండియా ఎన్నో ఆశలు పెట్టుకున్నా ఆ స్థాయిలో మళ్లీ ప్రదర్శన చేయలేకపోయాడు. తర్వాత అతని ఫామ్ కూడా పడిపోయింది. జట్టులో అతనికి చాలాసార్లు అవకాశం ఇచ్చినా సద్వినియోగం చేసుకోలేకపోయాడు. దీంతో అతను జట్టు నుంచి దూరమయ్యాడు. ఆ తర్వాత సుమారు ఎనిమిది సంవత్సరాల పాటు భారత టెస్టు జట్టుకు దూరమయ్యాడు.జాతీయ జట్టుకు దూరమైనప్పటికీ, కరుణ్ నాయర్ దేశీయ క్రికెట్‌లో నిలకడగా రాణించాడు. 2023-24 దేశీయ సీజన్‌కు ముందు కర్ణాటక నుంచి విదర్భకు మారిన తర్వాత అతని కెరీర్ కాస్త గాడినపడింది. 2023-24 సీజన్‌లో అతను 10 మ్యాచ్‌లలో 690 పరుగులు చేశాడు. ఆ తర్వాత 2024-25 రంజీ ట్రోఫీలో మరింత మెరుగ్గా రాణించి 9 మ్యాచ్‌లలో 863 పరుగులు సాధించాడు. రంజీ ఫైనల్‌లో కేరళపై సెంచరీ చేసి విదర్భకు మూడో రంజీ ట్రోఫీ అందించడంలో కీలకపాత్ర పోషించాడు. దీంతో దాదాపు ఎనిమిది సంవత్సరాల తర్వాత కరుణ్ నాయర్‌కు ప్రస్తు ఇంగ్లాండ్ టూర్?లో చోటు దక్కింది.33 ఏళ్ల కరుణ్ నాయర్ ఇప్పటివరకు భారత జట్టు తరపున 9 టెస్ట్ మ్యాచ్‌లు ఆడాడు (ఓవల్ టెస్ట్‌ను మినహాయించి). ఈ 9 టెస్టుల్లో 13 ఇన్నింగ్స్‌లలో అతను 505 పరుగులు చేశాడు, ఇందులో ఒక ట్రిపుల్ సెంచరీ ఉంది. అతని టెస్ట్ కెరీర్ సగటు సుమారు 38.84. టెస్ట్ క్రికెట్‌తో పాటు, కరుణ్ భారత్ తరపున 2 వన్డే ఇంటర్నేషనల్ మ్యాచ్‌లు కూడా ఆడాడు. ఇందులో 46 పరుగులు సాధించాడు. దేశీయ క్రికెట్‌లో కర్ణాటక తరపున అతను అసాధారణ ప్రదర్శన చేశాడు, ముఖ్యంగా రంజీ ట్రోఫీలో స్థిరమైన స్కోరింగ్‌తో తన సత్తా చాటాడు. విరామం తర్వాత, లీడ్స్‌లో జరిగిన టెస్ట్ మ్యాచ్‌తో అతను భారత టెస్ట్ జట్టులోకి తిరిగి ప్రవేశించాడు.



## వరుసగా విఫలమౌతున్న జైస్వాల్

తన తొలి ఆస్ట్రేలియా పర్యటనలో యశస్వి జైస్వాల్ తన అద్భుతమైన బ్యాటింగ్‌తో అందరినీ ఆకట్టుకున్నాడు. అలాంటి పరిస్థితిలో, ఇంగ్లాండ్ పర్యటనలో కూడా యువ భారత ఓపెనర్ నుంచి ఇలాంటి ప్రదర్శన ఆశించారు. దీనికి తోడు, జైస్వాల్ కూడా ఇలాంటి ఆరంభాన్ని పొంది మొదటి ఇన్నింగ్స్‌లో అద్భుతమైన సెంచరీ సాధించాడు. కానీ ఆ తర్వాత, అతని ప్రదర్శన ప్రత్యేకంగా ఏం లేదు. ఇప్పుడు, జైస్వాల్ ఓవల్ టెస్ట్ తొలి ఇన్నింగ్స్‌లో కూడా సింగిల్ డిజిట్‌కే అలసిపోయాడు. ఈ విధంగా, ఈ సిరీస్‌లో ఆరోసారి, అతను 50 కంటే తక్కువ స్కోరుకే ఔటయ్యాడు. కానీ, అతను 7వ సారి కూడా అదే విధంగా ఔట్ కావడం జట్టు ఆందోళనలను పెంచింది. భారత్, ఇంగ్లాండ్ మధ్య జరుగుతున్న టెస్ట్ సిరీస్ లో చివరి మ్యాచ్ జులై 31న ప్రారంభమైంది. ఈ మ్యాచ్ లోనూ టాస్ ఓడిన టీం ఇండియా ముందుగా బ్యాటింగ్ ప్రారంభించింది. కానీ ఈసారి కూడా టీం ఇండియాకు మంచి ఆరంభం లభించలేదు. నాల్గవ ఓవర్ లో జైస్వాల్ ను గస్ అట్కిన్సన్ ఎల్బీడబ్ల్యూగా అవుట్ చేసి జట్టుకు తొలి షాక్ ఇచ్చాడు. ఈ ఇన్నింగ్స్ లో జైస్వాల్ మరోసారి టీం ఇండియాకు భారీ ఆరంభం ఇవ్వలేకపోయాడు. ఎందుకంటే, అతను కేవలం 2 పరుగులకే ఔటయ్యాడు.ఈ సిరీస్‌లో ఇంగ్లాండ్‌తో జరిగిన తొలి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో జైస్వాల్ సెంచరీ చేశాడు. తర్వాతి మ్యాచ్‌లో కూడా జైస్వాల్ ఇలాంటి ప్రదర్శన చేస్తాడని ఊహించారు. కానీ, తర్వాతి 8 వరుస ఇన్నింగ్స్‌లలో జైస్వాల్ బ్యాటింగ్‌తో కేవలం 2 అర్ధ సెంచరీలు మాత్రమే చేశాడు. 4 సార్లు సింగిల్ ఫిగర్‌కు అవుట్ అయ్యాడు. వీటిలో, జైస్వాల్ 2 సార్లు తన ఖాతాను కూడా తెరవలేకపోయాడు. మొత్తం మీద, ఈ సిరీస్‌లో అతని స్కోర్లు వరుసగా 101, 4, 87, 28, 13, 0, 58, 0, 2గా ఉన్నాయి.తక్కువ స్కోరు మాత్రమే కాకుండా, ఈ సిరీస్‌లో జైస్వాల్‌ను ఔట్ చేసిన విధానం కూడా ప్రశ్నలను లేవనెత్తింది. వాస్తవానికి, జైస్వాల్ ఈ సిరీస్‌లోని 9 ఇన్నింగ్స్‌లలోనూ వికెట్ సమర్పించుకున్నాడు. వాటిలో 7 ఇన్నింగ్స్‌లలో అతను అదే లోపానికి బలి అయ్యాడు. నిజానికి, కుడిచేతి వాటం ఫాస్ట్ బౌలర్ అయిన జైస్వాల్, వికెట్ చుట్టూ తిరిగినప్పుడల్లా %బాదీఔ% లేదా స్లిప్‌లో క్యాచ్ అయ్యాడు. దీని అర్థం జైస్వాల్ బలహీనత ఇంగ్లాండ్‌లో బాగా తెలిసింది. అందువల్ల, రాబోయే రోజుల్లో ఈ లోపాన్ని సరిదిద్దడం జైస్వాల్‌కు సవాలుగా ఉంటుంది.

## కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశా

### వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్

టీమిండియా మాజీ కెప్టెన్ విరాట్ కోహ్లీ బాత్రూమ్‌లో ఏడవడం చూశానని వెటరన్ స్పిన్నర్ యుజ్వేంద్ర చాహల్ తెలిపాడు. 2019 వన్డే ప్రపంచకప్ సెమీఫైనల్లో న్యూజిలాండ్ చేతిలో ఎదురైన ఓటమి కోహ్లీ తట్టుకోలేకపోయాడని గుర్తు చేసుకున్నాడు. కోహ్లీతో పాటు జట్టులోని ఆటగాళ్లంతా కన్నీటి పర్యంతమయ్యారని చెప్పాడు. ఇంగ్లండ్ వేదికగా జరిగిన ఈ ప్రపంచకప్‌లో అసాధారణ ప్రదర్శనతో సెమీస్ చేరిన భారత్.. తృటిలో విజయాన్ని చేజార్చుకుంది. వర్షం అంతరాయం కలిగించిన ఈ మ్యాచ్ రెండు రోజుల పాటు జరగ్గా.. టీమిండియా గెలుపు కోసం జడేజా, ధోనీ ఆఖరి వరకు పోరాడారు. కానీ చివర్లో ధోనీ రనౌట్‌గా వెనుదిరిగడంతో టీమిండియాకు ఓటమి తప్పలేదు. ఆ పరాజయాన్ని భారత అభిమానులు కూడా జీర్ణించుకోలేకపోయారు. తాజాగా ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న చాహల్.. ఈ మ్యాచ్‌ను గుర్తు చేసుకున్నాడు. ‘2019 వన్డే ప్రపంచకప్‌లో టీమిండియా ఓటమి తట్టుకోలేక కోహ్లీ కన్నీటి పర్యంతమయ్యాడు. అతనే కాదు జట్టులోని ఆటగాళ్లంతా ఏడ్చారు. నేనే చివరిగా క్రీజులో నుంచి వచ్చా. కోహ్లీని దాటి ముందుకెళ్తుంటే అప్పటికే అతని కళ్లలో నీళ్లు తిరిగాయి. ధోనీకి అదే ఆఖరి మ్యాచ్. ఆ క్షణమే బౌలింగ్‌లో నేను 15 పరుగులు తక్కువగా ఇవ్వాల్సిందని అనిపించింది. నేను ఇంకొంచెం ఉత్తమంగా బౌలింగ్ చేసి ఉంటే బాగుండేదనిపించింది.’అని చాహల్ పేర్కొన్నాడు. ఆ మ్యాచ్‌లో చాహల్ 10 ఓవర్లో 63 పరుగులిచ్చి ఒక్క వికెట్ మాత్రమే తీసాడు. ఈ ఓటమి కారణంగా విరాట్ కోహ్లీ కెప్టెన్‌గా ఒక్క ఐసీసీ టైటిల్‌ను అందించలేకపోయాడు. అతని సారథ్యంలో టీమిండియా మెరుగైన ప్రదర్శన చేసింది. అతని సారథ్యంలో టీమిండియా 2017 ఛాంపియన్స్ ట్రోఫీ ఫైనల్ చేరడం, 2019 వన్డే ప్రపంచకప్ సెమీస్, డబ్ల్యూటీసీ 2021 ఫైనల్ చేరింది. కానీ తృటిలో టైటిల్ అందుకోలేకపోయింది.

# శుభ్‌మన్ గిల్ ఆల్ టైమ్ రికార్డ్



లండన్ ఓవల్? టెస్టులో టీమ్ఇండియా కెప్టెన్ శుభ్?మన్ గిల్ చరిత్ర సృష్టించాడు. ఈ సీజన్?లో తొలి మ్యాచ్ నుంచి ఫుల్ ఫామ్?లో ఉన్న గిల్ తాజాగా ఐదో టెస్టులో 46ఏళ్ల రికార్డును బ్రేక్ చేశాడు. ఐదో టెస్టు తొలి రోజు మ్యాచ్?లో గిల్ లంచ్ బ్రేక్ సమయానికి (15) పరుగులు చేశాడు. దీంతో ఓ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన భారత కెప్టెన్?గా గిల్ రికార్డుల్లోకెక్కాడు. ఈ క్రమంలోనే మాజీ కెప్టెన్ సునీల్ గావస్కర్ రికార్డ్ బ్రేక్ చేశాడు. ప్రస్తుతం గిల్ ఈ సిరీస్?లో 743 పరుగులు చేశాడు. గతంలో ఈ లిస్ట్?లో సునీల్ గావస్కర్ 732 పరుగులతో టాప్?లో ఉన్నాడు. 1978-79లో వెస్టిండీస్?పై గావస్కర్ ఈ స్కోర్ సాధించాడు. దీంతో దాదాపు 46ఏళ్లుగా గావస్కర్ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన కెప్టెన్?గా కొనసాగుతూ వచ్చాడు. తాజా సిరీస్?లో గిల్ ఈ రికార్డును బ్రేక్ చేశాడు. కాగా, ఈ సిరీస్?లో గిల్ ఇప్పటికే 743 పరుగులు చేశాడు. 9 ఇన్నింగ్స్?ల్లో 92.88 సగటుతో గిల్ ఈ గణాంకాలు నమోదు చేశాడు. ఇందులో నాలుగు సెంచరీలు ఉన్నాయి. అలాగే ఈ సిరీస్?లో టాప్ స్కోరర్?గానూ గిల్ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. అయితే ఓ టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు బాదిన టీమ్ఇండియా ప్లేయర్లలో గావస్కర్ 774 పరుగులతో టాప్?లో ఉన్నాడు. ఈ మ్యాచ్?లోనే గిల్ ఈ రికార్డు కూడా బ్రేక్ చేసే ఛాన్స్ ఉంది. టెస్టు హిస్టరీలో సింగిల్ సిరీస్?లో ఓ ప్లేయర్ బాదిన అత్యధిక పరుగులు 974. ఆస్ట్రేలియా లెజెండరీ క్రికెటర్ డాన్ బ్రాడ్‌మన్ 1930లో యాషెస్ సిరీస్‌లో ఇంగ్లాండ్?పై 974 పరుగులు చేశాడు. అలాగే ఈ సిరీస్‌లో బ్రాడ్‌మన్ మొత్తం 4 సెంచరీలు సాధించాడు. గత 95 ఏళ్ల నుంచి టెస్టు సిరీస్?లో అత్యధిక పరుగులు నమోదు చేసిన రికార్డ్ బ్రాడ్?మన్ పేరిటే కొనసాగుతూ వస్తోంది. ప్రస్తుత సిరీస్?లో ఈ రికార్డ్ బ్రేక్ చే[illegible] గిల్?కు ఛాన్స్ ఉంది.ఈ సిరీస్?లో ఇప్పటిదాకా గిల్ 743లి పరుగులు చేశాడు. మరో 231 పరుగులు చేస్తే, గిల్ వరల్డ్ రికార్డ్? బ్రేక్ చేసిన బ్యాటర్ అవుతాడు. ఈ మ్యాచ్?లో ఇంకో రెండు ఇన్నింగ్స్?లు ఆడాల్సి ఉంది. రెండో ఇన్నింగ్స్?ల్లోనూ భారీ ఇన్నింగ్స్ ఆడితేనే గిల్?కు ఆ ఘనత సాధించే ఛాన్స్ ఉంది. మరి గిల్ ఏం చేస్తాడో చూడాలి!ప్రస్తుత సిరీస్?లో గిల్ శతకాల మోత మోగిస్తున్నాడు. ఇటీవల మాంచెస్టర్ వేదికగా జరిగిన నాలుగో టెస్టు రెండో ఇన్నింగ్స్?లో సెంచరీతో రాణించారు. ఈ సిరీస్?లో గిల్?కు అది నాలుగో శతకం. తొలి టెస్టులో శతకం బాదగా, ఎడ్జ్?బాస్టన్ టెస్టులో (269 పరుగులు, 161 పరుగులు) రెండు సెంచరీలు నమోదు చేశాడు. దీంతో క్రికెట్ ద్వైపాక్షిక టెస్టు సిరీస్?లో అత్యధిక సెంచరీలు బాదిన కెప్టెన్?గా దిగ్గజాలు సునీల్ గావస్కర్, డాన్ బ్రాడ్?మన్ ?మన్ రికార్డును సమం చేశాడు.

# విశ్వజి

# మద్యం కన్నా లివర్‌కు ఈ ఆహారాలతోనే డేంజర్..!!





కాలేయం. మన శరీరంలోని ముఖ్యమైన అవయవాలలో ఒకటి. కాలేయం మన శరీరంలో అనేక ముఖ్యమైన విధులను నిర్వహిస్తుంది. ఇది విషకారకాలను తొలగించేందుకు, గ్లైకోజెన్, విటమిన్లు, ఖనిజాల నిల్వలో సహాయపడుతుంది. ఇది రక్తాన్ని శుభ్రపరుస్తుంది. పోషకాలను ప్రాసెస్ చేస్తుంది. కాలేయం ఆరోగ్యంగా ఎప్పుడూ ఆరోగ్యంగా ఉండటం అవసరం. మరి, కాలేయానికి మంచి శక్తి.. ఆరోగ్యం ఉండాలంటే కొన్ని ప్రమాదకరమైన ఆహారాలకు దూరంగా ఉండాలి. ఈ మధ్య కాలంలో మారుతున్న ఆహారపు అలవాట్లతో లివర్ సమస్యలు పెరుగుతున్నాయి. ఫ్యాటీ లివర్ సర్వసాధారణంగా మారుతోంది. ఆ తరువాత సరైన జాగ్రత్తలు తీసుకోని కారణంగా ఆ సమస్యే క్యాన్సర్ గా మారుతుంది. ప్రపంచవ్యాప్తంగా క్యాన్సర్ మరణాలకు లివర్ క్యాన్సర్ కూడా ఒక ప్రధాన కారణంగా గుర్తించారు. వేగంగా మారుతున్న జీవనశైలి, ఆహారంలో అజాగ్రత్తలు కాలేయాన్ని దెబ్బతీస్తున్నాయి. ఈ రోజుల్లో, ఫ్యాటీ లివర్, సిర్రోసిస్ వంటి అనేక కాలేయ సంబంధిత సమస్యలు ప్రజలను తీవ్ర ఇబ్బందులకు గురి చేస్తున్నాయి. కాలేయ క్యాన్సర్‌కు అత్యంత సాధారణ కారణం హెపటైటిస్ బి, సి వైరస్ ఇన్ఫెక్షన్. కానీ కొన్ని జీవనశైలి కారణాల వల్ల ఈ వ్యాధి బారిన పడి కొందరు ప్రాణాలు కోల్పోతున్నారు. కొన్ని ఆహార పదార్థాలు మద్యం కంటే ఎక్కువగా కాలేయానికి నష్టం చేస్తాయని పరిశోధనలు తేల్చి చెబుతున్నాయి. ప్రాసెస్ చేసిన మాంసంలో అధిక మొత్తంలో ఇనుము, సంతృప్త కొవ్వులు ఉంటాయి. దీనిని ఎక్కువగా తీసుకోవడం వల్ల ఇన్సులిన్ నిరోధకత ఏర్పడుతుంది. ఇది కాలేయ క్యాన్సర్‌తో నేరుగా ముడిపడి ఉంటుంది. ఎక్కువ మొత్తంలో ఆల్కహాల్ తీసుకోవడం కూడా కాలేయంలో క్యాన్సర్ పెరుగుదలను ప్రేరేపిస్తుంది. మొదట ఫ్యాటీ లివర్ సమస్యకు కారణమై క్రమంగా క్యాన్సర్ సమస్యగా మారుతుంది. చక్కెర ఎక్కువగా తింటే డయాబెటిస్ మాత్రమే కాకుండా క్యాన్సర్ ప్రమాదాన్ని కూడా పెంచుతుంది. జంక్ ఫుడ్స్ రోజూ తీసుకోవడం కాలేయానికి హానికరం. ఇది నాన్ ఫ్యాటీ లివర్ ప్రమాదాన్ని పెంచుతుంది. అధిక ఉప్పు కాలేయ వాపు తీవ్రతరం చేస్తుంది. ధూమపానం, రెడ్ మీట్ కూడా లివర్ క్యాన్సర్ కు కారణంగా నిలుస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు.



# కొబ్బరి నీళ్లు ఎన్ని తాగాలి?


కొబ్బరి నీళ్లు ఆరోగ్యానికి మేలని అందరికీ తెలిసిందే. ఎవరికైనా చిన్న ఆరోగ్య సమస్య వచ్చినా%ొ% కొబ్బరి నీళ్లు తాగమని సలహా ఇస్తుంటారు. రోగాలతో ఉన్నవాళ్లకే కాదు ఆరోగ్యంగా ఉన్నవాళ్లకూ ఇందులో ఉండే పోషకాలు అవసరమే. అయితే, అధికంగా పోషకాలు ఉండే కొబ్బరి నీళ్లను ఎన్ని తాగాలి? ఎన్నిసార్లు తాగాలో అవగాహన తక్కువే! పరిమితిని మించితే ఔషధం కూడా వికటిస్తుంది. ఎక్కువ మోతాదులో లవణాలు ఉండే కొబ్బరి నీళ్లను పరిమితంగా తాగడమే మేలని చెబుతున్నారు నిపుణులు. కొందరైతే.. కొబ్బరినీళ్లు లీటర్ బాటిల్ కొని గటగటా తాగేస్తుంటారు. ఇంకొందరు రెండుసార్లు విరామం ఇస్తూ లీటర్ పట్టిస్తారు. అన్నేసి కొబ్బరినీళ్లు తాగితే.. కిడ్నీలు, ఇతర అవయవాలపై భారం పడుతుందని వైద్యులు హెచ్చరిస్తున్నారు. ఒకసారి 150–200 మిల్లీలీటర్లు తాగితే సరిపోతుందని సలహా ఇస్తున్నారు. ఆరోగ్యవంతులు వారంలో మూడు నుంచి నాలుగుసార్లు కొబ్బరినీళ్లు తాగొచ్చు. అది కూడా ఉదయం, సాయంత్రాల్లో శారీరక శ్రమ చేసిన తర్వాత లేదా వ్యాయామం ముగించిన తర్వాత కొబ్బరి నీళ్లు తాగడం మేలు! కొబ్బరి నీళ్లలో ఉండే పొటాషియం రక్తపీడనాన్ని నియంత్రణలో ఉంచుతుంది. శరీరానికి కావాల్సిన గ్లూకోజ్‌ను వేగంగా అందిస్తుంది. కాళ్ల తిమ్మిర్లు తగ్గిస్తుంది.

# మఖానా.. మంచిదేనా?



'ఫూల్ మఖానా'ను చాలామంది హెల్దీ స్నాక్స్‌గా తీసుకుంటున్నారు. శరీరానికి కావాల్సిన ప్రొటీన్, ఫైబర్, యాంటి ఆక్సిడెంట్లను పొందుతున్నారు. ఆరోగ్యానికి భరోసానిచ్చే ఈ తామర విత్తనాలు.. కొందరికి మాత్రం హాని కలిగిస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. కొన్నిరకాల అనారోగ్య సమస్యలతో బాధపడేవారు.. 'మఖానా'కు దూరంగా ఉండాలని సూచిస్తున్నారు. గర్భిణులు మఖానాను పరిమితంగానే తీసుకోవాలి. వీటిని ఎక్కువగా తీసుకుంటే.. శరీరంలో వేడి ఉత్పత్తి అవుతుంది. దాంతో అసౌకర్యం ఏర్పడుతుంది. కాబట్టి, వైద్యుడిని సంప్రదించిన తర్వాతే.. మఖానాను తినాలి. కిడ్నీ సమస్యలతో బాధపడేవారికి.. మఖానా మంచిది కాదు. ఇందులో పొటాషియం ఎక్కువగా ఉంటుంది. మూత్రపిండాల సమస్య ఉన్నప్పుడు.. శరీరంలో పొటాషియం స్థాయిలు పెరుగుతాయి. దీర్ఘకాలంలో గుండె సమస్యలకు దారితీస్తుంది. కాబట్టి, కిడ్నీరోగులు 'మఖానా' ముట్టకుంటేనే బెటర్! మఖానా తింటే కొందరిలో జీర్ణ సమస్యలు తలెత్తే అవకాశం ఉంటుంది. ఇందులో అధిక మొత్తంలో లభించే ఫైబర్.. కొన్నిసార్లు గ్యాస్, కడుపు ఉబ్బరం, మలబద్ధకం వంటి సమస్యలను సృష్టిస్తుంది. అల్సర్, గుండెల్లో మంట, ఇతర జీర్ణ సమస్యలుంటే.. మఖానాను పక్కన పెట్టేయాలి. కొందరిలో 'మఖానా' అలెర్జీలకు దారితీస్తుంది. చర్మంపై దద్దుర్లు, దురద, ఇతర ఇన్‌ఫెక్షన్లు కనిపిస్తాయి. మఖానా తిన్నప్పుడు ఏదైనా అలెర్జీ వచ్చినట్లయితే.. వీటికి దూరంగా ఉండాలి. తీసుకునే ముందు వైద్యుడిని సంప్రదించాలి. మఖానాలో కార్బోహైడ్రేట్లు అధిక మొత్తంలో లభిస్తాయి. ఇవి రక్తంలో చక్కెర స్థాయిలను పెంచుతాయి. కాబట్టి, డయాబెటిస్ ఉన్నవారు వీటికి దూరంగా ఉండటమే మంచిది. వైద్యుడి సలహా మేరకు పరిమితంగా తీసుకోవాలి.

# అటుకుల్లో ఇన్ని బెనిఫిట్స్ ఉన్నాయా?



అటుకులు అని తేలిగ్గా తీసుకుంటాం గానీ ఇందులో అనేక పోషకాలు ఉన్నాయి. అల్పాహారంగా, సాయంత్రం వేళ.. చిరుతిండిగా అటుకుల (పోహా)ను తింటుంటారు. తక్కువ కేలరీలు కలిగి ఉండటం దీని ప్రత్యేకత. బరువు తగ్గాలనుకునేవారికి పోహా ఒక దివ్యౌషధం. అద్భుతంగా పని చేస్తుందిది. ఇందులో ఐరన్, ఫైబర్, విటమిన్లు వంటి పోషకాలు పుష్కలంగా ఉన్నాయి. క్యారెట్, బఠానీలు, వేరుశెనగలు, కరివేపాకు వంటి వాటిని చేర్చుకుంటే పోహాను మరింత రుచికరంగా తయారవుతుంది. భుజియా, చట్నీతో కలిపి తింటే రుచి మరింత పెరుగుతుంది. పోహా వల్ల ఆరోగ్య ప్రయోజనాలను కూడా ఉన్నాయి. అవేంటో ఇప్పుడు తెలుసుకుందాం.. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రిస్తుంది: పోహాలో ఉండే ఫైబర్, రక్తంలో చక్కెర స్థాయిలను అదుపులో ఉంచుతుంది. ఇది నెమ్మదిగా, స్థిరంగా షుగర్ కంటెంట్ ను విడుదల చేస్తుంది. ఫలితంగా రక్తంలో చక్కెర స్థాయి స్థిరంగా ఉంటుంది. ఆకస్మిక పెరుగుదలను నివారించినట్టవుతుంది. డయాబెటిస్ తో బాధపడే వారికి ఇదో బెస్ట్ ఆప్షన్. తక్కువ కేలరీలు: బరువు తగ్గడానికి పోరాడుతున్న వారికి పోహా ఒక గొప్ప ఆహారం. తక్కువ కేలరీలు కలిగి ఉండటంతో పాటు, ఇందులో సుమారు 76.9% కార్బోహైడ్రేట్లు, తక్కువ కొవ్వు శాతం ఉంటాయి. ఇది బరువు తగ్గడానికి అనువైనది. పోహాలోని ఫైబర్ కడుపును నిండుగా ఉంచుతుంది, అతిగా తినడాన్ని తగ్గిస్తుంది. ఐరన్ పుష్కలం: పోహాను ఎండబెట్టి, రోలర్లతో చదును చేసేటప్పుడు, అది కొంత ఐరన్‌ను గ్రహిస్తుంది. ఇది శరీరంలో ఐరన్ లోపాన్ని నివారించడంలో సహాయపడుతుంది. గర్భిణీలు, పాలిచ్చే తల్లులకు కూడా ఇది మంచి ప్రయోజనకరం. రక్తంలో చక్కెర స్థాయిలను నియంత్రించడంలో పోహ (అటుకులు) గ్లైసెమిక్ ఇండెక్స్ సహాయపడుతుంది. పోహాలోని ఫైబర్ జీర్ణక్రియకు తోడ్పడటమే కాకుండా, నిమ్మరసం కలపడం వల్ల జీర్ణ వ్యవస్థ ఆరోగ్యం మరింత మెరుగుపడుతుంది. నిమ్మరసం రోగనిరోధక శక్తిని, చర్మ ఆరోగ్యాన్ని పెంపొందించే విటమిన్ సి కి మంచి వనరు. పోహాలో పిండి పదార్థాలు ఉండటం వల్ల.. దీన్ని తగిన మోతాదులో తీసుకోవడం చాలా ముఖ్యం. పోహను సమతుల్య ఆహారంలో భాగంగా చేర్చుకోవాలి కానీ, దీనిపైనే పూర్తిగా ఆధారపడకూడదు. మార్కెట్లో లభించే రెడీమేడ్ పోహ మిక్స్‌లలో చక్కెర, సోడియం ఎక్కువగా ఉండే అవకాశం ఉంది. కాబట్టి, ఇంట్లో తయారుచేసుకున్నవి లేదా జాగ్రత్తగా ఎంచుకున్న వాటిని వాడటం మంచిది. పోహ పోషక విలువలను పెంచడానికి కూరగాయలు, పప్పులు, లేదా ఉడికించిన గుడ్లు జోడించవచ్చు. గుండె ఆరోగ్యానికి మేలు చేసే బాదం, అవిసె గింజలు వంటి నట్స్, గింజలను పోహపై చల్లుకోవడం వల్ల ఆరోగ్యకరమైన కొవ్వులు లభిస్తాయి. రుచి కోసం, అలాగే యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, జీవక్రియను పెంచే లక్షణాల కోసం పోహాలో పసుపు, జీలకర్ర, కారం పొడి వంటివి కలపవచ్చు.

# మార్కెట్

## పెరిగిన భారత్ ఫారెక్స్ నిల్వలు..

### బంగారం నిల్వలు ఎన్ని బిలియన్లకు చేరాయంటే..?

జులై 25తో ముగిసిన వారంలో భారతదేశ విదేశీ మారక నిల్వలు 2.703 బిలియన్లు పెరిగి 698.192 బిలియన్లకు చేరుకున్నాయని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తెలిపింది. గత వారంలో నిల్వలు 1.183 బిలియన్లు తగ్గి 695.489 బిలియన్లకు పడిపోయాని పేర్కొంది. విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 588.926 బిలియన్లకు పెరిగాయి. ఆర్‌బీఐ డేటా ప్రకారం.. విదేశీ మారక ద్రవ్య నిల్వల్లో ప్రధాన భాగమైన విదేశీ మారక ద్రవ్య ఆస్తులు 1.316 బిలియన్లు పెరిగి 588.926 బిలియన్లకు చేరుకున్నాయి. ఈ వారంలో బంగారం నిల్వలు 1.206 బిలియన్లు పెరిగి 85.704 బిలియన్లకు చేరుకున్నాయని ఆర్‌బీఐ తెలిపింది. స్పెషల్ డ్రాయింగ్ రైట్స్ 126 మిలియన్ డాలర్లు పెరిగి 18.809 బిలియన్లకు చేరుకున్నాయని సెంట్రల్ బ్యాంక్ తెలిపింది. అంతర్జాతీయ ద్రవ్య నిధి లో భారతదేశం రిజర్వ్ స్థానం 55 మిలియన్ డాలర్లు పెరిగి 4.753 బిలియన్ డాలర్లకు చేరుకుంది.




# బంగారం కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్..

### మళ్లీ ధర ఎంత తగ్గిందంటే..?



బంగారం కొనుగోలుదారులకు గుడ్‌న్యూస్. వరుస సెషన్‌లో ధరలు దిగి వస్తున్నాయి. స్టాకిస్టుల అమ్మకాల నేపథ్యంలో ధరలు పడిపోతున్నాయి. దేశ రాజధాని ఢిల్లీ నగరంలో 24 క్యారెట్ల పసిడి ధర రూ.400 తగ్గి తులానికి రూ.97,620కి చేరుకుంది. ఇక 22 క్యారెట్ల పసిడి ధర రూ.300 తగ్గి తులానికి రూ.97,500 పడిపోయింది. అదే సమయంలో వెండి సైతం భారీగా తగ్గుముఖం పట్టింది. కిలోకు రూ.2500 పతనమై.. రూ,1,09,500కి చేరిందని ఆల్ ఇండియా సరాఫా అసోసియేషన్ ధ్రువీకరించింది. అంతర్జాతీ మార్కెట్‌లో బంగారం ప్రస్తుతం ఔన్స్‌కు 3,290 డాలర్ల వద్ద కొనసాగుతున్నది. స్పాట్ గోల్డ్ 0.12శాతం పెరిగి ఔన్స్‌కు 3,294.31 డాలర్లకు చేరుకుంది. ఎల్‌కేపీ సెక్యూరిటీస్ కమోడిటీ అండ్ కరెన్సీ వైస్ ప్రెసిడెంట్, పరిశోధన విశ్లేషకుడు జతిన్ త్రివేది మాట్లాడుతూ.. ఈ తగ్గుదల అమెరికా ఫెడరల్ రిజర్వ్ దూకుడు.. సమీప భవిష్యత్తులో వడ్డీ రేట్లను తగ్గించే సూచనలు లేకపోవడం వల్లేనన్నారు. దాంతో బంగారం పెట్టుబడి ఆస్తులపై సెంటిమెంట్ తగ్గిందన్నారు. హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ సీనియర్ విశ్లేషకుడు సౌమిల్ గాంధీ మాట్లాడుతూ వారంలో చివరిరోజున బంగారం ప్రతికూల ధోరణి ఉంటుందని.. వారంలో తగ్గుదలతోనే మార్కెట్ ముగుస్తుందన్నారు. డిమాండ్ తగ్గడం, యూఎస్ డాలర్ రికవరీ కారణంగా ధర తగ్గిందని చెప్పారు. ఈ వారం ఇప్పటి వరకు 2శాతానికి పెరిగి తొమ్మిది వారాల గరిష్టానికి చేరుకుందని పేర్కొన్నారు. సుంకాల అనిశ్చితి కారణంగా మార్కెట్‌లో మదుపరులు అప్రమత్తంగా వ్యవహరించారని మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్‌లోని ప్రెషియస్ మెటల్స్ రీసెర్చ్ అనలిస్ట్ మానవ్ మోదీ పేర్కొన్నారు. యూఎస్ వ్యవసాయేతర వేతన డేటాపై పెట్టుబడిదారుల దృష్టి కేంద్రీకరించడంతోపాటు సెంట్రల్ బ్యాంకు వడ్డీ రేట్లను 4.25శాతం నుంచి 4.50శాతం పరిధిలోనే కొనసాగించనుందనే అంచనాలున్నాన్నారు. ఫెడ్ రిజర్వ్ చైర్మన్ జెరోమ్ పావెల్ వ్యాఖ్యలు సైతం సెప్టెంబర్‌లో వడ్డీ రేట్లను తగ్గింపు ఆశలుపై నీళ్లు చల్లినట్లయ్యింది. మార్కెట్‌పై అమెరికా వ్యవసాయేతర డేటా, సుంకాల సంబంధిత నిర్ణయాలపై దృష్టి సారిస్తుందని ఆయన పేర్కొన్నారు.



## నష్టాల్లో ముగిసిన సూచీలు.. సెన్సెక్స్ 81వేల దిగువకు సెన్సెక్స్..

దేశీయ స్టాక్ మార్కెట్లు వరుసగా మూడోరోజు నష్టాల్లో ముగిశాయి. సెన్సెక్స్ 585 పాయింట్లు పతనం కాగా.. నిఫ్టీ 203 పాయింట్లు పతనమైంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ భారత్‌పై విధించిన సుంకాల నేపథ్యంలో మార్కెట్ల పతనం కొనసాగుతోంది. అమెరికా సుంకాల అమలును మరో వారం పొడిగించిన నేపథ్యంలో మార్కెట్‌ల నష్టాల్లో మొదలైంది. చివరి వరకు కోలుకోలేకపోయింది. క్రితం సెషన్‌తో పోలిస్తే సెన్సెక్స్ 81,074.41 పాయింట్ల వద్ద నష్టాల్లో మొదలైంది. ఇంట్రాడేలో 81,317.51 పాయింట్ల గరిష్టానికి చేరిన సెన్సెక్స్.. అత్యల్పంగా 80,495.57 కనిష్టానికి తగ్గింది. చివరకు 585.67 పాయింట్ల నష్టంతో 80,599.91 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 203 పాయింట్లు పతనమై.. 24,565.35 వద్ద ముగిసింది. ట్రేడింగ్‌లో దాదాపు 1264 షేర్లు లాభపడగా.. 2582 షేర్లు పతనమయ్యాయి. నిఫ్టీలో సన్ ఫార్మా, డాక్టర్ రెడ్డీస్ ల్యాబ్స్, అదానీ ఎంటర్‌ప్రైజెస్, టాటా స్టీల్, సిప్లా నష్టపోయాయి. లాభపడిన వాటిలో ట్రెంట్, ఆసియన్ పెయింట్స్, హీరో మోటోకార్ప్, హెచ్‌యూఎల్, నెస్లే ఉన్నాయి. ఎఫ్ఎంసీజీ మినహా, అన్ని ఇతర రంగాల సూచీలు ఆటో, రియాల్టీ, ఫార్మా, ఐటీ, మెటల్, ఆయిల్ అండ్ గ్యాస్, పీఎస్‌యూ బ్యాంక్, టెలికాం 0.5–2 శాతం క్షీణించి నష్టాల్లో ముగిశాయి.

# మహిళా ఎమ్మెల్యేను అవమానించిన వ్యక్తికి పరామర్శలా

**తప్పు చేస్తే ఖండించకుండా... వెనకేసుకొస్తారా**

**జగన్ అండ్ కో రాష్ట్రానికి అవసరమా**

**జమ్మలమడుగు పర్యటనలో చంద్రబాబు**



కడప,ఆగస్ట్1 : వైసీపీ అధినేత వైఎస్ జగన్ మోహన్ రెడ్డికి ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్ట్రాంగ్ వార్నింగ్ ఇచ్చారు.కడప జిల్లా జమ్మలమడుగులో సీఎం చంద్రబాబు శుక్రవారం పర్యటించారు. గూడెంచెరువులో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో ముఖ్యమంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కోవూరు టీడీపీ ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిపై అసభ్యంగా మాట్లాడిన వైసీపీ నేత నల్లపురెడ్డి ప్రసన్న కుమార్ రెడ్డి మాటలని జగన్ సమర్థిస్తున్నారా? అని ప్రశ్నించారు. ప్రసన్నని జగన్ పరామర్శించడం ఏంటనీ ధ్వజమెత్తారు. పార్టీలో ఎవరైనా తప్పు చేస్తే కట్టడి చేయాలి.. ఖండించాలని హితవు పలికారు. నల్లపురెడ్డిని మందలించాల్సింది పోయి.. జగన్ ప్రోత్సహిస్తు న్నారని దుయ్యబట్టారు. మహిళలపై ఇంకా విరుచుకుపడాలనే ధోరణిలోనే జగన్ వైఖరి ఉందని మండిపడ్డారు. నాయకుడే రెచ్చగొడితే కిందిస్థాయి నేతలు ఇష్టానుసారం మాట్లాడరా? అని చంద్రబాబు నిలదీశారు. జగన్ అండ్ కో లాంటి వ్యక్తులు రాజకీయాలకు అవసరమా? అని సీఎం చంద్రబాబు ప్రశ్నించారు. ఏపీలో శాంతిభద్రతలకు విఘాతం కలిగిస్తే తోక కట్ చేస్తానని హెచ్చరించారు. ఇటీవల బంగారుపాళ్యంలో జగన్ పర్యటన దృశ్యాలను.. నెల్లూరులో ఆయన పర్యటనకు వచ్చినట్లు-గా చూపించారని విమర్శించారు. వితండవాదం చేయడంలో వైసీపీ నేతలు ఎప్పుడూ ముందుంటారని ఆరోపించారు. ప్రతి చోటా డ్రోన్లు పర్యవేక్షిస్తున్నా యని.. తస్మాత్ జాగ్రత్త అంటూ సీఎం చంద్రబాబు హెచ్చరించారు. గూడెంచెరువు గ్రామం నుంచి ప్రజావేదిక వద్దకు ఆటోలో పెళ్లారు సీఎం చంద్రబాబు. ఈ క్రమంలో ఆటో కార్మికుడికి బాడుగ ఇవ్వగా.. చంద్రబాబుకు ఆటోవాలా పాదాభివందనం చేశారు. అనంతరం గూడెంచెరువులో సీఎం చంద్రబాబు పేదల సేవలో ప్రజావేదిక బహిరంగసభలో ప్రసంగించారు. ఎన్టీఆర్ ఆలోచన నుంచే రాయలసీమకు సాగునీటి ప్రాజెక్టుల రూపకల్పన చేసినట్లు- సీఎం చంద్రబాబు గుర్తుచేశారు. రూ.3,800 కోట్లతో హంద్రీనీవా పనులు చేపట్టామని చెప్పుకొచ్చారు. త్వరలోనే హంద్రీనీవా పనులు పూర్తిచేసి చెరువులన్నీ నింపుతామని స్పష్టం చేశారు. సముద్రంలోకి వెళ్లే నీటిని వాడుకుంటే కరవు అనేదే ఉండదని వివరించారు. రాయలసీమకు పరిశ్రమలు రావాల్సిన అవసరం ఉందని ఉద్ఘాటించారు. త్వరలోనే కడప స్టీల్ఎ÷-లాంట్ నిర్మాణ పనులు చేపడతామని తెలిపారు. 2028 డిసెంబర్ నాటికి స్టీల్ఎ÷-లాంట్ తొలిదశ పనులు పూర్తి చేస్తామని వెల్లడించారు. రేపు అన్నదాత సుఖీభవ పథకం ప్రారంభిస్తున్నామని ప్రకటించారు. ఏపీ ప్రభుత్వం రూ.14 వేలు, కేంద్ర ప్రభుత్వం రూ.6 వేలు ఇవ్వబోతున్నాయని స్పష్టం చేశారు. మొత్తంగా రైతులకు రూ.20 వేలు ఇవ్వబోతున్నామని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఈ సమావేశానికి కడప జిల్లా ఇన్‌ఛార్జ్ మంత్రి సవిత, టీడీపీ ఎమ్మెల్యేలు, 4 బంగారు కుటుంబాల మార్గదర్శకులు, చేనేతలు, ప్రజలు హాజరయ్యారు.

# ఆర్థికస్థితి విషమంగా ఉన్నా సంక్షేమం ఆగడం లేదు

**ఏడాది పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమం**

**ఓటమి నుంచి పాఠం నేర్చుకోని జగన్**

**జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు**

కాకినాడ,ఆగస్ట్1 : రాష్ట్రంలో ఆర్థిక పరిస్థితి విషమంగా ఉన్న పెద్ద ఎత్తున సంక్షేమం అమలు చేస్తున్నామని జల వనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు తెలిపారు. ఏడాది పాలనలో పెద్ద ఎత్తున అభివృద్ధి సంక్షేమం చేస్తున్నామన్నారు. ఓటమి నుంచి పాటలు నేర్చుకోకుండా జగన్మోహన్ రెడ్డి అదే విధ్వంసం సృష్టిస్తున్నారన్నారు. తూర్పుగోదావరి జిల్లా అనపర్తి పర్యటనలో వైయస్ జగన్మోహన్ రెడ్డి పై మంత్రి నిమ్మల రామానాయుడు సంచలన వ్యాఖ్యలు చేశారు. రాష్ట్రంలో ఒకటో తారీకు వస్తే పండగ వాతావరణం నెలకొంటుందని.. వైసీపీ పాలనలో వెయ్యి రూపాయలు పెన్షన్ పెంచేందుకు ఐదేళ్లు పట్టిందన్నారు. జగన్ పింఛన్లు పెంచుతామని ప్రజలను మోసం దగా చేశారని..ముఖ్యమంత్రి చంద్రబాబు రాష్ట్రాన్ని గాడిలో పెట్టి 2047 కి రాష్ట్రాన్ని ప్రపంచంలోనే తెలుగుజాతిని అగ్రస్థానంలో ఉంచాలని కృషి చేస్తున్నారన్నారు. కానీ జగన్మోహన్ రెడ్డి ధ్వంసం చేయాలని ఆలోచించడం దురదృష్టకరమన్నారు. గంజాయి బ్యాచ్లకు బ్లేడ్ బ్యాచ్లకు బెట్టింగ్ బ్యాచ్లకు పరామర్శలు చేయడం ఏంటని ప్రశ్నించారు. అవినీతిలో భాగస్వాములై, ప్రజలను లూటీ- చేసి జైల్లో ఉన్న వ్యక్తులను జగన్ పరామర్శిస్తున్నారు.. జగన్మోహన్ రెడ్డి రాజ్యాంగం ప్రజాస్వామ్యం గురించి మాట్లాడుతున్నారని, వాటి గురించి మాట్లాడే అర్హతయే జగన్ కు లేదని విమర్శించారు. జగన్ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు బయటకు వచ్చేవారు కాదన్నారు మంత్రి నిమ్మల రామానాయుడు. ఒకవేళ బయటకు వస్తే ప్రతిపక్ష నాయకులను హౌస్ అరెస్టులు చేసేవారు. ఐదేళ్లపాటు- కక్షలు వేధింపులు పాలనను ఎవ్వరూ మర్చిపోలేదు. జగన్ కు ప్రజాస్వామ్యం గురించి రాజ్యాంగం గురించి మాట్లాడే అర్హత లేదు. ఐదేళ్లపాటు- ఒక హిట్లర్ ముషారఫ్ వంటి వ్యక్తులు కూడా అసూయపడేలా పాలన చేశారు. ఐదేళ్ల జగన్ పాలన నుంచి ప్రజలు విముక్తి పొందారు. 1947లో బ్రిటిష్ పాలన నుంచి స్వతంత్రం లభిస్తే 2024లో రాక్షస పాలన నుంచి విముక్తి పొంది ప్రజలు స్వేచ్ఛగా ఉన్నారు. జగన్ దొంగ ఏడుపులను అబద్దాలను నమ్మే పరిస్థితి రాష్ట్రంలో లేదు. అన్యాయం గా అరెస్టు చేస్తున్నారంటూ జగన్ మాట్లాడటం హాస్యాస్పదం. చట్టం తన పని తాను చేసుకోని వెళు ుంది. తప్పు చేసిన వారే జైల్లో ఉన్నారని కక్ష సాధింపుగా ఎవరిని జైల్లో పెట్టలేదు. మిథున్ రెడ్డిని కూడా కూటమి అధికారంలోకి వచ్చాక జైల్లో పెట్టలేదని సంవత్సరం పాటు- విచారణ దర్యాప్తు చేసి ఆధారాలు అన్నిటిలతోనే అరెస్టు చేశాం. అరెస్టు అవకుండా మిథున్ రెడ్డి న్యాయస్థానానికి వెళితే అవి కూడా తిరస్కరించాయి. ప్రజల సొమ్ములను లూటీ- చేసారని ఆధారాలు ఉండబట్టే కోర్టులు బెయిల్ ఇవ్వడానికి తిరస్కరించాయి. ప్రైవేట్ చేతిలో ఉండే లెక్కల వ్యాపారాన్ని జగన్ తన చేతిలోకి తీసుకున్నారా లేదా చెప్పాలి. బ్రాందీ అమ్మకం సర్కార్ పేరు మీద జగన్ చేతిలో ఉందో లేదో చెప్పాలి. రోడ్డు పక్కన అమ్మే జామకాయలు బండి దగ్గర కూడా ఫోన్ పే ఉంటు-ందని, సర్కార్ నిర్వహించే బ్రాందీ షాపుల్లో ఎందుకు ఫోన్ పే పెట్టలేదు. ఐదేళ్లపాటు- సర్కార్ పేరు చెప్పి విచ్చలవిడిగా ప్రజల సొమ్ము లూటీ- చేశారు. వైసీపీ పాలనలో జగన్ వెనకేసిన కోట్ల రూపాయలు ప్రజాధనాన్ని వెనక్కి తీసుకురావాలని కూటమి ప్రభుత్వం పని చేస్తుందని మంత్రి నిమ్మల వ్యాఖ్యానించారు.

# చేనేత మరమగ్గాలకు ఉచిత విద్యుత్

**ఇచ్చిన హామీ మేరకు చంద్రబాబు ఆమోదం**

కడప,ఆగస్ట్1 : చేనేతలకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం శుభవార్త తెలిపింది. శుక్రవారం ఆగస్టు1 నుంచే ఉచిత విద్యుత్ అమలుకు ఏపీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశం ఇచ్చారు. మగ్గాలకు 200 యూనిట్లు-, మర మగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్ ఇస్తున్నట్లు ప్రకటించారు. నేతన్నల ఉచిత విద్యుత్‌కు రూ.125 కోట్ల వ్యయాన్ని ఏపీ ప్రభుత్వం ఖర్చు చేయనుంది. అయితే, 50 వేల మగ్గాలు, 15 వేల మర మగ్గాలు కలిగిన కుటుంబాలకు ఉచిత విద్యుత్ ద్వారా లబ్ధి చేకూరనుంది. చేనేతలకు ఇచ్చిన ఎన్నికల హామీని సీఎం చంద్రబాబు దృష్టికిమంత్రి సవిత తీసుకెళ్లారు. జాతీయ చేనేత దినోత్సవానికి వారం ముందుగానే ఉచిత విద్యుత్ పథకం అమలుకు సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. చేనేతలకు ఇచ్చిన ఎన్నికల హామీని నెరవేర్చడంపై సీఎం చంద్రబాబుకు మంత్రి సవిత ధన్యవాదాలు తెలిపారు. కడప జిల్లాలోని జమ్మలమడుగులో శుక్రవారం సీఎం చంద్రబాబు పర్యటించారు. ఈ సందర్భంగా చేనేతల ఉచిత విద్యుత్ అమలుపై సీఎం చంద్రబాబు నిర్ణయం తీసుకున్నారు. మరోవైపు, వైసీపీ ప్రభుత్వం నిలిపివేసిన రాజధాని రైతు కూలీ పెన్షన్లను కూటమి ప్రభుత్వం తిరిగి మంజూరు చేసింది. ఈ సందర్భంగా కృష్ణయపాలెం గ్రామంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్, మంత్రి నారా లోకేష్ చిత్రపటాలకు రాజధాని రైతులు పాలాభిషేకం చేశారు. గత వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రాగానే రాజధాని రైతు కూలీ పెన్షన్లను నిలిపివేసింది. రాజధాని ప్రాంత రైతు కూలీలకు పెన్షన్లు మంజూరైన నేపథ్యంలో హర్షం వ్యక్తం చేశారు కూలీలు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే పెన్షన్లను యథావిధిగా కొనసాగిస్తామని ఎన్నికల ప్రచారంలో చంద్రబాబు హామీ ఇచ్చారు. ఇచ్చిన మాటకు చంద్రబాబు కట్టుబడి పెన్షన్లను మంజూరు చేయటం పట్ల రాజధాని రైతులు హర్షం వ్యక్తం చేశారు.

# జగన్‌ను ఆపటం మీ తరం కాదు

**మాజీమంత్రి, వైకాపా నేత అంబటి విమర్శలు**

అమరావతి,ఆగస్ట్1 : ఇచ్చిన హామీల పక్రియ సంగతి మర్చిపోయి జగన్ కట్టడి కోసం పనిచేస్తున్నారని, 164 సీట్లు తెచ్చుకుని మంచి పాలన చేయాల్సిన మీరు జగన్ నామ జపం చేస్తున్నారని వైసీపీనేత, మాజీమంత్రి అంబటి రాంబాబు విమర్శించారు.. అమరావతిలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. .. చిట్టి నాయుడు దెబ్బకు చంద్రబాబు బుర్ర కూడా పోయిందన్నారు.. జగన్ ను ఆపటం మీ తరం కాదు.. జగన్ వస్తే విపరీతంగా జనం వస్తున్నారని మీరే ప్రచారం చేస్తున్నారు.. లా అండ్ ఆర్డర్ చూసుకోవాల్సిన హోం మంత్రి ఆ పని చేయటం లేదు.. హోం మంత్రి జగన్ విషయాలు మాట్లాడటం, తిట్టే కార్యక్రమాలు మాత్రమే చేస్తుందని రాంబాబు ఫైర్ అయ్యారు.. తల్లి, చెల్లి వాటాల గురించి చెప్తుంది.. మీ కుటుంబం గురించి మాకు తెలియదా అని రాంబాబు సంచలన వ్యాఖ్యలు చేశారు. మీరు ఇష్టానుసారం పిచ్చిపిచ్చిగా మాట్లాడుతున్నారు.. రాజధాని, పోలవరం నిర్మాణం సంగతి మర్చి పోయారని మండిపడ్డారు.. తమ మంత్రి వర్గంలో ఉన్నవాళ్ళు జైళ్లకు పంపుతున్నారు.. అయితే ఏమవుతుంది.. రేపు మావాళ్ళు అధికారంలోకి వచ్చాక మా వాళ్ళు ఇదే చేయమంటారు కదా..? అన్నారు.. కొంతమంది ఐపీఎస్ అధికారులపై టీ-డీపీ అధికారంలోకి అక్రమ కేసులు పెట్టిందని.. మీరేమీ అతీతులు కాదన్నారు. రాజకీయంగా మమ్మల్ని అణగదొక్కాలని చూస్తే ఊరుకునేది లేదని.. నిబంధనల ప్రకారం పనిచేయాలని సూచించారు.. లోకేష్ ఇప్పుడు హై క్యాష్.. అధికారం మూన్నాళ్ళ ముచ్చట అని తెలుసుకోవాలన్నారు.. ప్రసన్న కుమార్ రెడ్డి ఒక మహిళను ఇష్టానుసారం మాట్లాడారని మీ అభియోగం.. ఆయన మీద కేసులు పెట్టారు కదా.. ఎందుకు దాడి చేశారు.. మా నాయకుడ్ని మేం పరమర్శకు తప్పేంటి. వాళు ్ళ నేరారోపణ చేయబడిన వ్యక్తులు తప్ప నేరస్తులు కాదు.. ఆ లెక్కకు వస్తే చంద్రబాబు కూడా జైల్లో ఉన్నారు.. చిట్టినాయుడు పిట్ట కథలు గతంలో పర్యటనల సందర్భంగా చాలా విన్నాం.. ఈశ్వర్ కు వీళ్లకు జరిగిన లావాదేవీలపై సెటిల్మెంట్ కోసం సింగపూర్ వెళ్ళారు.. డౌట్ ఉంటే కనుక్కోవాలి.. డిస్టిల్లరి కంపెనీ లు ఏమి కొనుక్కుంటే ఎవరికి సంబంధం.. కట్టు-కదలతో వైసీపీ వాళ్లను వేధిస్తున్నారు.. పిన్నెల్లి రామకృష్ణారెడ్డి జైలులో ఉన్న సమయంలో ప్రజాధారణకు ఇప్పుడు ఉన్న ప్రజాదరణకు చాలా తేడా ఉంది.. జగన్ పర్యటనల సమయంలో జనం వచ్చిన విజువల్స్ చూపించాల్సిన అవసరం లేదు.. విజువల్స్ మార్ఫింగ్ చేయాల్సిన దుస్తితి మాకు లేదు.. జనం రాకపోతే అసలు లాఠీఛార్జ్ ఎందుకు చేశారు.. హోం మంత్రి గారు సమాధానం చెప్పాలి.. వాళ్ళు ఎంత కట్టడి చేస్తే అంత జనం వస్తున్నారు.. చంద్రబాబు మా తోకలు కట్ చేయటం కాదు.. మా తోకలు జనం కట్ చేశారు.. మీ తోకలు కట్ చేయకుండా చూసుకోండి.. మీరు ఎన్ని ప్రయత్నాలు చేసినా జగన్ మీద ఎన్ని మాటలు చెప్పినా నమ్మరు.. గతంలో వైఎస్ మీద ఇప్పుడు జగన్ మీద వ్యక్తిత్వ హననం చేయాలని చూస్తున్నారు.. టీ-డీపీ హయాంలో మామీద పెట్టిన కేసులు ఒక్కటి నిలబడ్డా నన్ను అడగండి.. ఒక్క కేసు కూడా నిలబడదు.. అంబటి రాంబాబు వ్యాఖ్యానించారు.

# రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకం

**ఆటో మ్యుటేషన్ పక్రియకు శ్రీకారం**

**పక్రియను పరిశీలించిన కలెక్టర్**

విజయవాడ,ఆగస్ట్1 : ఆటో మ్యుటేషన్ పక్రియకు శ్రీకారంచుట్టడం ద్వారా రిజిస్ట్రేషన్ సేవలు మరింత పారదర్శకమయ్యాయని.. ఇదో విప్లవాత్మకమైన మార్పు అని, కొత్త విధానంలో ఒకేరోజు ఒకే చోట చాలా తక్కువ సమయంలో రిజిస్ట్రేషన్‌తో పాటే తక్షణ మ్యుటేషన్ జరుగుతుందని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అన్నారు. రాష్ట్రంలోని 17 మునిసిపల్ కార్పొరేషన్ల పరిధిలో శుక్రవారం ఆటో మ్యుటేషన్ సేవలు ప్రారంభమయ్యాయి. ఈ నేపథ్యంలో కలెక్టర్ డా. జి.లక్ష్మీశ, విజయవాడ నగరపాలక సంస్థ కమిషనర్ ధ్యానచంద్ర హెచ్ఎంతో కలిసి నగరంలోని గాంధీనగర్ సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ అవుతున్న పక్రియను పరిశీలించారు. నగరంలోని చిట్టినగర్‌కు చెందిన నంబూరు సామ్రాజ్యలక్ష్మి కొనుగోలు చేసిన రెసిడెన్షియల్ ఆస్తి రిజిస్ట్రేషన్, ఆటో మ్యుటేషన్ పక్రియను స్టెప్ 1 మొదలు స్టెప్ 7 వరకు చివరగా మ్యుటేషన్ సర్టిఫికేట్ జనరేట్ అయినంత వరకు పక్రియను పరిశీలించారు. ఇదంతా అరగంటలోనే పూర్తికావడంతో ఇరు పార్టీలు ప్రభుత్వ సేవల్లో వేగంపై ఆనందం వ్యక్తం చేశాయి. కలెక్టర్ లక్ష్మీశ, కమిషనర్ ధ్యానచంద్రలు లబ్ధిదారుకు మ్యుటేషన్ సర్టిఫికేట్ అందజేశారు. అనంతరం కలెక్టర్ లక్ష్మీశ మీడియాతో మాట్లాడుతూ ఆస్తి రిజిస్ట్రేషన్ తర్వాత మునిసిపల్ రికార్డుల్లో యజమాని పేరు మారాలంటే రిజిస్ట్రేషన్ పూర్తయిన తర్వాత డాక్యుమెంట్లతో మునిసిపల్ కార్యాలయానికి వెళ్లి దరఖాస్తు చేసుకోవడం, అక్కడ ఆ పక్రియ పూర్తికి కూడా కొంత సమయం పట్టడం జరుగుతుండేదని.. ఇప్పుడు ప్రభుత్వం తెచ్చిన ఆటో మ్యుటేషన్ వల్ల ఆస్తి రిజిస్ట్రేషన్ సమయంలోనే మ్యుటేషన్ కూడా పూర్తవుతుందని.. మునిసిపల్ డేటా బేస్‌లో ఆటోమేటిక్‌గా యజమాని పేరు మారిపోతుందని వివరించారు. ఆటో మ్యుటేషన్ వల్ల ప్రజలకు సమయం, డబ్బు ఆదా అవుతుందని, రిజిస్ట్రేషన్ కార్యాలయంలోనే మ్యుటేషన్ జరిగిపోతుందన్నారు. డాక్యుమెంటేషన్ వర్క్ తగ్గడమే కాకుండా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో సేవలందుతాయన్నారు. రిజిస్ట్రేషన్, మునిసిపల్ డిపార్టుమెంట్ల డేటాబేస్ అనుసంధానంతో సరళీకృత సేవలు లభిస్తాయన్నారు. సేవలపై ప్రజలకు విశ్వాసాన్ని, సంతృప్తి స్థాయిని పెంచేందుకు రాష్ట్ర ప్రభుత్వం చేస్తున్న కృషికి ఆటోమ్యూటేషన్ మంచి ఉదాహరణ అని.. ఈ విధానాన్ని అందుబాటు-లో ఉంచిన గౌరవ ముఖ్యమంత్రికి ప్రజల తరఫున ధన్యవాదాలు తెలియజేస్తున్నానని, రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలియజేస్తున్నట్లు- కలెక్టర్ లక్ష్మీశ తెలిపారు. ఆటో మ్యుటేషన్ అనేది పట్టణ డిజిటల్ పాలనలో కీలక మైలురాయి అని.. మ్యుటేషన్ కోసం మునిసిపల్ కార్యాలయానికిగానీ వార్డు సచివాలయానికిగానీ వెళ్లాల్సిన అవసరం లేకుండానే రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మ్యుటేషన్ పూర్తవుతుందని మునిసిపల్ కమిషనర్ ధ్యానచంద్ర అన్నారు. దీనివల్ల రిజిస్ట్రార్ కార్యాలయంలోనే మునిసిపల్ డేటా బేస్‌లో పేరు నమోద వుతుందని పేర్కొన్నారు. విజయవాడ అర్బన్ పరిధిలోని నాలుగు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లోనూ ఈ పక్రియ ప్రారంభమైందని తెలిపారు. 64 డివిజన్ల ప్రజలు అవగాహన పెంచుకొని, సద్వినియోగం చేసుకోవాలని ధ్యానచంద్ర కోరారు. కార్యక్రమంలో రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్ డిప్యూటీ-ఇన్‌స్పెక్టర్ జనరల్ ఎ.రవీంద్రనాథ్, జిల్లా రిజిస్ట్రార్ పీవీవీ దుర్గాప్రసాద్, సబ్ రిజిస్ట్రార్లు ఎండీ ఆరిఫ్, కె.వెంకటేశ్వరరావు, కార్యాలయ సిబ్బంది తదితరులు ఉన్నారు.



## జగన్ లిక్కర్ డెన్‌ల డాన్: ఆదినారాయణ

కడప,ఆగస్ట్1 : రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన పీ4 (పబ్లిక్, ప్రైవేట్, పీపుల్, పార్టనర్‌షిప్) కార్యక్రమాన్ని పీ5గా భాజపా ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి అభివర్ణించారు. ఐదో 'పి'ని 'పవర్‌ఫుల్' అని ఆయన పేర్కొన్నారు. వైఎస్సార్ కడప జిల్లా జమ్మలమడుగు నియోజకవర్గం గూడెం చెరువులో సీఎం చంద్రబాబు పింఛన్లు పంపిణీ చేశారు. అనంతరం నిర్వహించిన ప్రజావేదికలో సీఎం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే ఆదినారాయణరెడ్డి మాట్లాడుతూ.. మంత్రి లోకేశ్‌ను తండ్రికి మించిన తనయుడంటూ సీఎం చంద్రబాబు ఎదుటే ప్రశంసించారు. ఈ క్రమంలో జగన్‌పై ఆయన విమర్శలు గుప్పించారు. జగన్ లిక్కర్ డెన్‌ల డాన్. సూపర్ సిక్స్ పథకాలతో కడప జిల్లాలో జగన్‌కు సూపర్ చెక్ పెడతాంఅని ఆదినారాయణరెడ్డి అన్నారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్ అన్నారు.

## కానిస్టేబుళ్ల ఫలితాలు విడుదల

అమరావతి,ఆగస్ట్1 : ఏపీలో 6,100 పోలీసు కానిస్టేబుళ్ల పోస్టుల భర్తీకి సంబంధించి తుది ఫలితాలు శుక్రవారం విడుదలయ్యాయి. మంగళగిరిలోని డీజీపీ కార్యాలయంలో హోంమంత్రి అనిత వీటిని విడుదల చేశారు. డీజీపీ హరీష్ కుమార్ గుప్తా, పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు ఛైర్మన్ ఆర్.కె.మీనా పలువురు ఉన్నతాధికారులు కార్యక్రమంలో పాల్గొన్నారు. గండి నానాజి 168 మార్కులతో ప్రథమ స్థానంలో, జి.రమ్య మాధురి (159) రెండో స్థానంలో, మెరుగు అచ్యుతారావు(144.5) మూడో స్థానంలో నిలిచారు.

## గౌహతిలో శ్రీవారి ఆలయ నిర్మాణం

**సిఎం శర్మతో టిటిడి ఛైర్మన్ భేటీ**


తిరుమల,ఆగస్ట్1 : అస్సాం రాజధాని గౌహతిలో శ్రీవారి ఆలయం నిర్మించేందుకు తిరుమల తిరుపతి దేవస్థానంచర్యలు చేపట్టింది. ఈ మేరకు అస్సాం ముఖ్యమంత్రి హిమంత బిశ్వశర్మతో తితిదే ఛైర్మన్ బీఆర్ నాయుడు శుక్రవారం భేటీ- అయ్యారు. గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణానికి సంబంధించి పలు కీలక అంశాలపై సీఎంతో తితిదే ఛైర్మన్ చర్చించారు. ఆలయ నిర్మాణానికి ఐదు ఎకరాల స్థలాన్ని కేటాయించాలని ముఖ్యమంత్రిని ఆయన కోరారు. దీనికి స్పందించిన సీఎం హిమంత.. ఐదు ఎకరాల స్థలంతోపాటు- ప్రభుత్వం నుంచి అన్నిరకాల సహాయ సహకారాలు అందిస్తామని వెల్లడించారు. తమ రాష్ట్ర రాజధానిలో తిరుమల శ్రీవారి అద్భుతమైన ఆలయం నిర్మించాలని తితిదే నిర్ణయం తీసుకోవడం ఎంతో గొప్పగా భావిస్తున్నట్లు సీఎం అన్నారు. తితిదే ఆధ్వర్యంలో నిర్మించబోయే శ్రీవారి ఆలయం ద్వారా హిందూధర్మ పరిరక్షణ, సంప్రదాయాలు, హిందుత్వ భావజాలాన్ని విస్తృతంగా ప్రచారం చేసేందుకు దోహదపడుతుందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు.

## పరామర్శల పేరుతో ఉద్రిక్తతలు పెంచుతున్న జగన్: జివి

గుంటూరు,ఆగస్ట్1 : పరామర్శ పేరుతో యాత్రలు, ర్యాలీలు చేపట్టి జగన్ ఉద్రిక్తతలను పెంచుతున్నారని ప్రభుత్వ చీఫ్ విప్ జీవీ ఆంజనేయులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బందిపోటు దొంగల కంటే జగన్ ప్రమాదకరమైన వ్యక్తి అని జీవీ ఆంజనేయులు విమర్శించారు. రూ.3,700 కోట్ల అక్రమార్జన కోసం జే బ్రాండ్లు తాగించి ప్రజల ప్రాణాలు బలిగొన్నారన్నారు. పల్నాడు జిల్లా వినుకొండలో వితంతు పింఛన్లను ఆయన పంపిణీ చేశారు. ఈ సందర్భంగా జీవీ ఆంజనేయులు మాట్లాడారు. అబద్ధాలు, అసత్య ప్రచారాలకు జగన్ బ్రాండ్ అంబాసిడర్. కోవూరు ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డిపై వైకాపా మాజీ ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి చేసిన వ్యాఖ్యలను ఖండించకుండా జైలుకెళ్లి మొసలి కన్నీళ్లా?మహిళలను కించపరిచేవాళ్లు, దూషించేవాళ్లను ప్రోత్సహించడమే జగన్ పని. ఆయన అవినీతి ఆకలి, అరాచకాల కారణంగానే ఎంపీ మిథున్‌రెడ్డి జైలు పాలయ్యారు.

## నన్స్ అరెస్టుపై కొనసాగుతున్న ఆందోళన

న్యూఢిల్లీ,ఆగస్ట్1 : ఛత్తీస్‌గఢ్‌లో కేరళ నన్స్ అరెస్ట్ వ్యవహారం దేశవ్యాప్తంగా హాట్ టాపిక్ అవుతోంది. దుర్గ్ రైల్వేస్టేషన్‌లో జులై 25న కేరళకు చెందిన ఇద్దరు నన్స్ సిస్టర్ ప్రీతి మేరీ, సిస్టర్ వందన ఫ్రాన్సిస్‌ను ఛత్తీస్‌గఢ్ పోలీసులు అరెస్టు చేసిన సంగతి తెలిసిందే. మానవ అక్రమ రవాణా, బలవంతపు మతమార్పిడి ఆరోపణలపై ఈ అరెస్టులు జరిగాయి. అయితే, ఈ ఘటన ఇప్పుడు దేశ రాజకీయ, సామాజిక వర్గాల్లో చర్చనీయాంశమైంది. పార్లమెంటు- వెలుపల సైతం కాంగ్రెస్ ఎంపీ ప్రియాంక గాంధీ సహా పులువురు రాజకీయ నేతలు ప్లకార్డులు చేతబట్టి నిరసనలకు దిగారు. అటు-, కేరళ వ్యాప్తంగా క్రిస్టియన్ వర్గాలు నిరసన ప్రదర్శనలు చేస్తున్నాయి. ఛత్తీస్‌గఢ్‌లో అరెస్టు చేసిన ఇద్దరు కేరళ నన్స్ లను వెంటనే విడుదల చేసేలా జోక్యం చేసుకోవాలని కోరుతూ డీఎంకే ఎంపీ విల్సన్ .. కేంద్ర మంత్రులు అమిత్ షా, కిరణ్ రిజిజుకు లేఖ రాశారు. కాగా, ఛత్తీస్‌గఢ్‌లోని దుర్గ్ రైల్వేస్టేషన్ సమీపంలో ముగ్గురు గిరిజన యువతులతో కలిసి ప్రయాణిస్తున్న నన్స్‌ను బజరంగ్ దళ్ సభ్యులు అడ్డుకున్నారు. మానవ అక్రమ రవాణాకు పాల్పడుతున్నారని, మతమార్పిడి చేస్తున్నారని నన్స్ మీద బజరంగ్ దళ్ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో వీరిన పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. అయితే, సదరు యువతులు స్వచ్ఛందంగా ఉద్యోగ అవకాశాల కోసం ఆగ్రా వెళు ున్నారని, వారి దగ్గర చెల్లుబాటు- అయ్యే డాక్యుమెంట్లు- కూడా ఉన్నాయని నన్స్ వాదించారు. అయినప్పటికీ, ఈ ఆరోపణల ఆధారంగా నన్స్‌ను అరెస్టు చేసి దుర్గ్ సెంట్రల్ జైలులో ఉంచారు.




## కింగ్డమ్ పార్ట్ -2పై అప్పడే ప్రకటన

విజయ్ దేవరకొండ అభిమానులు కోరుకున్నట్టుగానే 'కింగ్డమ్' పార్ట్ 2 ఉంటుందని తేలిపోయింది. నాగవంశీయే ఈ విషయం చెప్పారు. కింగ్డమ్‌తో తో ఆయన విజయాన్ని అందుకోవడం ఆనందంగా ఉందని నిర్మాత సూర్యదేవర నాగవంశీ అన్నారు. విజయ్ ప్రస్తుతం చేస్తున్న సినిమాలు పూర్తవ్వగానే 'కింగ్డమ్ 2' మొదలవుతుందని, అందులో మరో అగ్ర హీరో కూడా ఉంటారని చెప్పారు. ఆయన ఫార్చ్యూన్ ఫోర్ సినిమాస్ సంస్థతో కలిసి సితార ఎంటర్-టైన్‌మెంట్స్ పతాకంపై నిర్మించిన చిత్రమే 'కింగ్డమ్'. విజయ్ దేవరకొండ, భాగ్యశ్రీ బోర్సే జంటగా నటించారు. గౌతమ్ తిన్ననూరి దర్శకుడు. ఈ చిత్రం గురువారం ప్రేక్షకుల ముందుకొచ్చింది. చిత్రానికి లభిస్తున్న స్పందనపై ఆనందం వ్యక్తం చేసారు. మేం ఊహించినట్టుగానే సినిమాకి మంచి స్పందన లభిస్తోంది. సాంకేతికంగా గొప్పగా ఉందనే ప్రశంసలు లభిస్తున్నాయి. ఒక తెలుగు సినిమాని హాలీవుడ్ స్థాయి సాంకేతికతతో తీశాం. థియేటర్‌కి వచ్చిన ప్రేక్షకులంతా తప్పకుండా సినిమాని ఆస్వాదిస్తారు. త్వరలోనే ఆంధ్రలో విజయోత్సవాన్ని నిర్వహిస్తాం' అన్నారు. 'కింగ్డమ్ 2'లో హీరోయిన్ పాత్రకి ప్రాధాన్యం ఉంటుందని, ఈ సినిమాలో పాట పెట్టేందుకు అవకాశం లభించలేదని ఆయన చెప్పారు. సినిమాలో కీలక పాత్ర పోషించిన నటుడు సత్యదేవ్ మాట్లాడుతూ విజయ్ గెలిస్తే నేను గెలిచినట్టే. ఏదైనా సాధించాలనే తపనతో సొంతంగా వచ్చే ఎంతోమందికి విజయ్ స్ఫూర్తి. ఇందులోని అన్నదమ్ముల బంధం గురించి, నటుల అభినయం గురించి అంతా మాట్లాడుతున్నారు. ఈ సినిమా ఇచ్చిన ఉత్సాహంతో మరిన్ని మంచి సినిమాల్ని అందించడానికి ప్రయత్నిస్తాం అన్నారు.




## రామాయణ మ్యూజిక్‌లో కొత్త ఒరవడి


### రుద్రవీణను ఉపయోగిస్తున్న ఎఆర్ రహమాన్

బాలీవుడ్ నుంచి వస్తున్న ప్రతిష్టాత్మకమైన ప్రాజెక్ట్‌లలో 'రామాయణ'దాదాపు రూ.4000 కోట్ల బడ్జెట్‌తో రూపొందుతున్న ఈ ప్రాజెక్ట్‌లో సాయిపల్లవి, బాలీవుడ్ నటు-డు రణ్‌బీర్ కపూర్, కన్నడ స్టార్ నటుడు యష్ ప్రధాన పాత్రలో నటిస్తున్నారు. ఈ సినిమాకు దంగల్ సినిమా దర్శకుడు నితేశ్ తివారీ దర్శకత్వం వహిస్తుండగా.. నమిత్ మల్హోత్రా నిర్మిస్తున్నాడు. రణ్‌బీర్ కపూర్ రాముడి పాత్రలో నటిస్తుండగా.. సాయి పల్లవి సీత పాత్రను పోషిస్తుంది. కన్నడ స్టార్ నటు-డు యష్ రావణుడి పాత్రలో నటించబోతున్నాడు. ఇక హను మంతుడి పాత్రలో సన్నీ డియోల్, -కై-కేయి పాత్రలో లారా దత్తా నటిస్తుండగా.. లక్ష్మణుడి పాత్రలో రవి దూబే నటించబోతున్నాడు. రెండు పార్టులుగా ఈ సినిమా రాబోతుంది. అయితే ఈ సినిమాకు ఆస్కార్ దిగ్గజాలు, ప్రముఖ సంగీత దర్శకులు ఆ.. రెహమాన్, హన్స్ జిమ్మర్ కలిసి సంగీతం అందిస్తున్నారు. ఇదిలావుంటే తాజాగా ఈ ప్రాజెక్ట్‌కి సంబంధించి ఆసక్తికర విషయం సోషల్ మీడియాలో చక్కర్లు కొడుతుంది.రామాయణం సినిమాలో బ్యాక్ గ్రౌండ్ స్కోర్ కోసం భారతీయ వాయిద్యాలలో పురాతనమైన రుద్ర వీణను రెహమాన్ ఉపయోగించబోతున్నట్లు- సమాచారం. దీనికి సంబంధించి ఇప్పటికే మ్యూజిక్ పనులు కూడా మొదలు పెట్టినట్లు- తెలుస్తుంది. కాగా దీనిపై అధికారిక ప్రకటన వెలుబడలేదు.





## మహావతార్ నరసింహకు జనం నీరాజనం

పౌరాణిక పాత్రలకు తిరుగులేదని మరోసారి నిరూపించింది 'మహావతార్ నరసింహ' అనే సినిమా. నిజానికి, ఈ సినిమాని హోంబాలే ప్రొడక్షన్స్ వాళ్ళు రిలీజ్ చేయడానికి ముందుకు వచ్చేవరకు అసలు ఈ సినిమా ఒకటి ఉందని కూడా ఆడియన్స్‌కి తెలియదు. హోంబాలే ఫ్యాన్ ఇండియా లెవెల్‌లో సినిమాని రిలీజ్ చేయడానికి రెడీ అవ్వడం, తెలుగులో గీత ఆర్ట్స్ డిస్ట్రిబ్యూషన్ చేయడంతో సినిమా మీద చర్చ జరిగింది. తర్వాత వచ్చిన ట్రైలర్ కూడా పెద్దగా ఆడియన్స్‌ని థియేటర్లకు రప్పించలేకపోయింది. కానీ, సినిమా చూసిన వారంతా సినిమా అద్భుతం అంటూ అబ్బురపడుతూ సోషల్ మీడియాలో మౌత్ టాక్ స్ప్రెడ్ చేయడంతో సినిమాకి ఇప్పుడు కలెక్షన్ల వర్షం కురుస్తోంది. తాజాగా, ఈ సినిమా ఇప్పటివరకు 53 కోట్ల రూపాయల కలెక్షన్లు రాబట్టినట్లుగా అధికారికంగా ప్రకటించింది సినిమా యూనిట్. ఇప్పటివరకు ఈ సినిమా 53 కోట్ల బాక్స్ ఆఫీస్ గ్రాస్ సాధించినట్లు- వెల్లడించారు. ఈ సినిమాని క్లీమ్ ప్రొడక్షన్స్ బ్యానర్ మీద శిల్పా ధావన్ నిర్మించగా, అశ్విన్ దర్శకుడిగా వ్యవహరించారు. ఈ సినిమాని హిందీలో అనిల్ తడానికి సంబంధించిన ఏ ఏ ఫిలిమ్స్ డిస్ట్రిబ్యూట్ చేయగా, ఒక్కొక్క భాషలో ఆయా భాషల్లో సిద్ధహస్తులైన డిస్ట్రిబ్యూటర్ల చేత రిలీజ్ చేయించారు. దీంతో సినిమా మీద అందరి దృష్టి పడడమే కాదు, సినిమా మంచి టాక్‌తో దూసుకుపోయింది. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే, తెలుగు రాష్ట్రాల విషయానికి వచ్చేసరికి విజయ్ దేవరకొండ కింగ్డమ్ సినిమా కంటే కొన్ని చోట్ల ఈ సినిమా బుకింగ్స్‌లో డామినేట్ చేయడం గమనార్హం. దాదాపు వారం గడుస్తోంది.



## చకచకా పెద్ది మూవీ షూటింగ్

కీలకమైన సన్నివేశాల చిత్రీకరణతో 'పెద్ది' సినిమా చకచకా ముందుకు సాగుతోంది. ప్రస్తుతం ఈ సినిమా చిత్రీకరణ రామోజీ ఫిల్మ్‌సిటీలో జరుగుతోంది. అందులో భాగంగా రామ్‌చరణ్‌తోపాటు-, ఇతర తారాగణంపై ఓ వేడుక నేపథ్యంలో సాగే సన్నివేశాల్ని తెరకెక్కిస్తున్నారు. ఈ సినిమా కోసం ప్రత్యేకంగా సెట్‌ని తీర్చిదిద్దారు. ఉత్తరాంధ్ర నేపథ్యంలో సాగే పీరియాడిక్ చిత్రమిది. బుచ్చిబాబు సానా దర్శకత్వం వహిస్తున్నారు. రామ్‌చరణ్ సరసన జాన్వీకపూర్ నటిస్తున్నారు. వృద్ధి సినిమాస్ పతాకంపై వెంకట సతీష్ కిలారు నిర్మిస్తున్నారు. మైత్రీ మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పిస్తున్నాయి. ఈ చిత్రం కోసం శారీరకంగా ప్రత్యేకంగా సన్నద్ధమయ్యారు రామ్‌చరణ్. వచ్చే ఏడాది మార్చి 27న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్రంలో కన్నడ నటు-డు శివరాజ్ కుమార్‌తోపాటు-, జగపతిబాబు, దివ్యేందు శర్మ తదితరులు నటిస్తున్నారు.




## రామయణ కోసం కిశోర్‌ను వదిలేసిన రణ్‌బీర్

రణ్‌బీర్ కపూర్ ప్రధాన పాత్రలో తెరకెక్కుతోన్న చిత్రం 'రామాయణ'. ఈ సినిమా కోసం కిశోర్ కుమార్ బయోపిక్‌ను రణ్‌బీర్ వదులుకున్నారని బాలీవుడ్ దర్శకుడు అనురాగ్ బసు తెలిపారు. మంచి నిర్ణయమే తీసుకున్నారని ప్రశంసించారు. దివంగత గాయకుడు, నటు-డు కిశోర్ కుమార్ బయోపిక్ గురించి కూడా అనురాగ్ బసు మాట్లాడారు.నేను రణ్‌బీర్‌తో మరో సినిమా చేయాలని ఎన్నో రోజుల నుంచి ఎదురుచూస్తున్నాను. కానీ, మా ప్రయత్నాలు ఫలించడం లేదు. రణ్‌బీర్ తన జీవితంలో ఏ విషయంలోనైనా నిజాయతీగా నిర్ణయాలు తీసుకుంటాడు. రామాయణఆఫర్ వచ్చినప్పుడే కిశోర్ కుమార్ బయోపిక్‌లోనూ అవకాశం వచ్చింది. ఈ రెండింటిలో ఏదోఒకటి ఎంపిక చేసుకోవడం చాలా కష్టం. రెండూ గొప్ప చిత్రాలే. ఫైనల్‌గా రణ్‌బీర్ రామాయణను ఎంపిక చేసుకున్నాడు. ఈ సినిమా కోసం ఆ బయోపిక్‌ను వదులుకున్నారని తెలిపారు. అనురాగ్ బసు కాంబినేషన్‌లో రణ్‌బీర్ హీరోగా 'బర్ఫీ', 'జగ్గా జాసూస్' రెండు సినిమాలు తెరకెక్కిన విషయం తెలిసిందే. ఇక కిశోర్‌కుమార్ బయోపిక్‌లో ఆమిర్ ఖాన్ నటించనున్నట్లు- వస్తోన్న వార్తలపై అనురాగ్ బసు స్పందించారు. దాని గురించి ఇప్పుడే చెప్పలేనన్నారు. అన్నీ ఓకే అయ్యాక అగ్రిమెంట్ మీద సంతకం చేసిన తర్వాతనే అధికారికంగా వెల్లడిస్తానన్నారు. ఇక రణ్‌బీర్ ప్రధాన పాత్రలో నితేశ్ తివారీ దర్శకత్వంలో రెండు భాగాలుగా 'రామాయణ' రానుంది. వచ్చే ఏడాది దీపావళికి మొదటి పార్ట్ ప్రేక్షకుల ముందుకు రానుండగా.. 2027లో రెండో భాగం విడుదల కానుంది.

## ఆసక్తికరంగా వచ్చిన వాడు గౌతమ్ టీజర్

యంగ్ హీరో అశ్విన్ బాబు చేస్తున్న యాక్షన్ థ్రిల్లర్ 'వచ్చినవాడు గౌతమ్' టీజర్ సినిమా మీద ఆసక్తి ఏర్పరిచింది. ఈ సినిమాకి మామిడాల ఎం.ఆర్ కృష్ణ దర్శకత్వం వహిస్తున్నారు. అరుణశ్రీ ఎంటర్‌టైన్‌మెంట్స్ ప్రొడక్షన్ నెంబర్ 3గా రూపొందుతున్న ఈ సినిమాని నిర్మాత టి.గణపతి రెడ్డి గ్రాండ్ గా నిర్మిస్తున్నారు. ప్రవల్లిక యోగి కో - ప్రొడ్యూసర్. ఇప్పటికే విడుదలైన టీజర్ ట్రెమండస్ రెస్పాన్స్ తో సినిమాపై అంచనాలు పెంచింది. ఆగస్ట్ 1 హీరో అశ్విన్ బాబు బర్త్ డే సందర్భంగా ఆయనకి విషెష్ అందిస్తూ మేకర్స్ ఒక పవర్ ఫుల్ పోస్టర్ రిలీజ్ చేశారు. అశ్విన్ బాబు ఇం-టె-న్స్ లుక్ లో కనిపించిన ఈ పోస్టర్ అదిరిపోయింది. ఇటివలే భారీ బడ్జెట్ తో హైవోల్టేజ్ -ల్గ÷కె-మాక్స్ యాక్షన్ సీక్వెన్స్ షూట్ పూర్తి చేశారు. హై టెక్నాలజీని వాడి ఈ యాక్షన్ సీక్వెన్స్ షూట్ చేశారు. రియా సుమన్ హీరోయిన్ గా నటిస్తున్న ఈ చిత్రంలో అయేషా ఖాన్, మురళీ శర్మ, సచిన్ ఖేడేకర్, అజయ్,÷ం గణేష్, కీలక పాత్రలు పోహిస్తున్నారు. ఈ చిత్రానికి ఎం.ఎన్. బాల్ రెడ్డి సినిమాటోగ్రఫీ, గౌర హరి మ్యూజిక్ అందిస్తున్నారు. ప్రస్తుతం పోస్ట్ ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. త్వరలోనే మేకర్స్ రిలీజ్ డేట్ ని అనౌన్స్ చేయనున్నారు.



Printed, Published & Owned by B. Srinivas, Printed at Abhyudaya Publications,& Printers Algunoor, MDI: Thimmapur District, Karimnagar. 505001(T.S) Published at H.NO. 6-3-289,Kishan Nagar, Karimnagar MDI: District karimnagar- 505001(T.S) Editor: B.Srinivas, RNI NO. APTEL/2006/18964, Cell : 7989575563, Mail:thecrimenews123@gmail.com